సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 291
బుధవారం 5-7-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



చాంపియన్ భారత్
దక్షిణాసియా ఫుట్‌బాల్‌లో భారత జట్టు మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. దక్షిణాసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ (శాఫ్)లో తొమ్మిదోసారి భారత జట్టు చాంపియన్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో సునీల్ ఛెత్రి కెప్టెన్సీలోని టీమిండియా పెనాల్టీ షూటౌట్‌లో 5–4తో కువైట్ జట్టును ఓడించింది.
- వివరాలు 12లో



ద్వంద్వ ప్రమాణాలు వద్దు
ఉగ్రవాద కార్యకలాపాలను అణచివేసే విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించవద్దని పాక్‌కు ప్రధాని మోదీ హితవు పలికారు.
వివరాలు 6లో ▸



మాస్కోపై డ్రోన్ల దాడి యత్నం
రష్యా రాజధాని మాస్కోపై దాడి చేసేందుకు ఉక్రెయిన్ సైన్యం డ్రోన్లను ప్రయోగించిందా? నిజమేనని చెబుతోంది రష్యా వైమానిక దళం.
వివరాలు 6లో ▸



ఇజ్రాయెల్ భారీ సైనిక ఆపరేషన్
పాలస్తీనా ఉగ్రవాదులను ఏరివేస్తూ, ఆయుధాలను స్వాధీనం చేసుకోవడానికి వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయెల్ సేనలు విరుచుకుపడుతున్నాయి.
వివరాలు 6లో ▸



అమెరికాలో మళ్లీ పేలిన తూటా..
అమెరికాలోని టెక్సాస్, ఫిలడెల్ఫియాల్లో జరిగిన కాల్పుల ఘటనల్లో 8 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

చంపిన వాళ్లే సానుభూతికి ప్రయత్నిస్తున్నారు


వంగవీటి రంగాను కుట్ర చేసి చంపిన వాళ్లే తిరిగి సానుభూతి కోసం ఆయన జయంతి, వర్ధంతిలను నిర్వహిస్తున్నారని టీడీపీ తీరుపై రాష్ట్ర మంత్రులు నిప్పులు చెరిగారు. రాజకీయ లబ్ధి కోసం కాపులను వాడుకునేందుకు చంద్రబాబు యత్నిస్తున్నాడని మండిపడ్డారు.
వివరాలు 3లో ▸

అల్లూరి లేకపోతే మన్యం లేదు


అల్లూరి సీతారామరాజు లేకపోతే నేడు మన్యం ప్రాంతం ఉండేది కాదని, ఆయన పోరాటం వల్లే గిరిజనుల జీవన విధానం దెబ్బతినకుండా నేటికీ కొనసాగుతోందని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. అల్లూరి 126వ జయంతి వేడుకలను రుషికొండలో నిర్వహించారు.
వివరాలు 2లో ▸

విశ్వగురువు భారత్


భవిష్యత్‌లో భారత్ విశ్వగురువుగా నిలుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదని భారత ప్రధాని మోదీ అన్నారు. పుట్టపర్తిలోని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌ను ప్రధాని మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు.
వివరాలు 10లో ▸


చిత్తూరు పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం.


చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ శిలాఫలకం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'చిత్తూరు'కు క్షీరాభిషేకం!

దశాబ్దాల చరిత్ర కలిగిన అతిపెద్ద డెయిరీకి ప్రాణ ప్రతిష్ట.. చిత్తూరు డెయిరీ పునరుద్ధరణకు సీఎం జగన్ శ్రీకారం

- రూ.385 కోట్ల పెట్టుబడితో పునరుజ్జీవం.. అమూల్‌తో ఒప్పందం
- రూ.150 కోట్లతో తొలిదశ పనులు.. లక్ష లీటర్లతో 10 నెలల్లో పాల ప్రాసెసింగ్
- దశలవారీగా బటర్, పాలపొడి, చీజ్, పన్నీర్, యోగర్ట్, స్వీట్ తయారీ
- ఏడెనిమిదేళ్లలో 10 లక్షల లీటర్లు ప్రాసెస్ చేసే స్థాయికి చిత్తూరు డెయిరీ
- 5 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు.. మరో 2 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి.. జగనన్న పాలవెల్లువ పథకంలో మరో విప్లవాత్మక అడుగు
- అమూల్ రాకతో పాడి రైతన్నల్లో 'ధర'హాసం.. అదనంగా రూ.4,243 కోట్ల లబ్ధి.. స్వార్థంతో సొంత జిల్లా రైతులను నిలువునా ముంచేసిన చంద్రబాబు
- చిత్తూరు డెయిరీని నష్టాల్లోకి గెంటేసి.. హెరిటేజ్‌ను లాభాలతో పరుగులెత్తించిన బాబు

సాక్షి, తిరుపతి: గత పాలకుల స్వార్థంతో రెండు దశాబ్దాలుగా మూతబడ్డ చిత్తూరు డెయిరీకి జీవం పోస్తూ అమూల్ సంస్థ రూ.385 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న పునరుద్ధరణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం చిత్తూరులో భూమి పూజ చేశారు. అనంతరం చిత్తూరు సమీపంలోని చీలాపల్లి సీఎంసీ మెడికల్ కళాశాల, 300 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్, ఆర్‌కే రోజా, సీదిరి అప్పలరాజు, విడదల రజని, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, వెంకటేగౌడ, ద్వారకనాథరెడ్డి, ఎంఎస్ బాబు, నవాజ్‌బాషా..
మిగతా 2వ పేజీలో ▸

> ఇవాళ మనం తెరిపిస్తున్న చిత్తూరు డెయిరీ కథ ఎలాంటిదంటే.. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న ఓ మనిషి తాను స్థాపించిన డెయిరీ కోసం, సొంత లాభం కోసం, సొంత జిల్లా రైతునైనా, పిల్లనిచ్చిన మామనైనా బలి పెట్టేస్తాడని చెప్పే మనిషి కథ ఇది! ఓ నీతిమాలిన రాజకీయ నాయకుడి కథ ఇదీ! ఒక గొప్ప మెడికల్ కాలేజీ మన చిత్తూరుకు వస్తుంటే అడ్డుకున్నది సాక్షాత్తూ ఈ చంద్రబాబునాయుడు, గజదొంగల ముఠా సభ్యుడైన ఈనాడు రామోజీరావు వియ్యంకుడే. స్థలాలివ్వకుండా ఈ గడ్డకు మంచి మెడికల్ కాలేజీ రాకుండా అడ్డుకున్న చరిత్ర వారిదే. వేలూరు మెడికల్ కాలేజీకి జరిగిన అన్యాయాలను పూర్తిగా సరిదిద్దుతూ ఈరోజు అడుగులు ముందుకు వేస్తున్నా.
>
> - చిత్తూరు బహిరంగ సభలో సీఎం జగన్

బీజేపీ రాష్ట్ర శాఖలకు కొత్త సారథులు

ఎన్నికల వేళ బీజేపీ కీలక మార్పులు

పంజాబ్, జార్ఖండ్, ఏపీ, తెలంగాణలకు కొత్త అధ్యక్షులు

పంజాబ్‌కు సునీల్ జాఖడ్, జార్ఖండ్‌కు బాబూలాల్ మరాండీ

తెలంగాణ బీజేపీ చీఫ్‌గా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి 6లో

ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురందేశ్వరి

ఉత్తర్వులు జారీ చేసిన బీజేపీ అధిష్టానం..

అధ్యక్ష బాధ్యతల నుంచి సోము వీర్రాజు తొలగింపు 3లో



బాబూలాల్


సునీల్ జాఖడ్


పురందేశ్వరి


కిషన్‌రెడ్డి

వైద్య శాఖలో 168 కొత్త పోస్టుల భర్తీ



- కడపలో మెంటల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌కు 116 పోస్టులు
- పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు 41
- ఆంధ్రా వైద్య కళాశాలకు 11 కేటాయింపు

10లో

నేటి నుంచి స్పెషలిస్ట్ వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

తొలి రోజు 118 పోస్టుల భర్తీకి..

10వ తేదీ వరకు నిర్వహణ

2లో

- వివరాలు 0లో

తెలంగాణలో ఊబకాయం, హైబీపీ ఎక్కువే..

దాదాపు 25 శాతం మంది జీవనశైలి వ్యాధుల బాధితులే

మద్యం, మాంసం వినియోగం అధికంగా ఉండటమూ కారణం

లాన్సెట్ తాజా అధ్యయన నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే జీవనశైలి వ్యాధుల సూచికల్లో తెలంగాణ పరిస్థితి అత్యంత పేలవంగా ఉందని తాజా అధ్యయనం తేల్చింది. అలాగే స్థూలకాయం, రక్తపోటు కేసుల సంఖ్య సైతం రాష్ట్రంలోనే ఎక్కువగా నమోదవుతున్నాయని వెల్లడించింది. 'మెటబాలిక్ నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ హెల్త్ రిపోర్ట్ ఆఫ్ ఇండియా: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్–ఇండియా డయాబెటీస్ (ఐసీఎంఆర్ ఐఎన్‌డీఐఏబీ) పేరిట లాన్సెట్ రూపొందించిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో 25 శాతం మంది సెంట్రల్ ఒబెసిటీ, హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్నారు. దేశవ్యాప్తంగా 2008 అక్టోబర్ 18 నుంచి 2020 డిసెంబర్ 17 మధ్య మొత్తం 1,13,043 మంది (గ్రామీణ ప్రాంతాల నుంచి 79,506 పట్టణ ప్రాంతాల నుంచి 33,537 మంది)పై నిర్వహించిన అధ్యయన ఫలితాలను లాన్సెట్ ఇటీవల ప్రచురించింది. ఊబకాయం కేసులలో తెలంగాణ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, మణిపూర్, మిజోరం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, చండీగఢ్, హరియాణా, ఢిల్లీల సరసన నిలుస్తోంది. దీనికి కారణం ఉదర ఊబకాయం, ట్రైగ్లిజరైడ్స్‌కు మధ్య దగ్గరి సంబంధం ఉండటమేనని వైద్య నిపుణులు అంటున్నారు.

శారీరక శ్రమ లేకపోవడం.. ప్రాసెస్డ్ ఫుడ్ తినడం..

లాన్సెట్ నివేదిక ప్రకారం ప్రజల్లో ఊబకాయం, రక్తపోటు, ట్రైగ్లిజరిడెమియా సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. 'ఇది తక్కువస్థాయి శారీరక శ్రమతోపాటు ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తినడం వల్ల పెరుగుతున్న సమస్య. ట్రైగ్లిజరైడ్స్, యూరిక్ యాసిడ్ స్థాయిలు ఎక్కువగా ఉన్న రోగులను ఇప్పుడు తరచుగా చూస్తున్నాం. చికిత్స తీసుకోకుంటే గుండె, మూత్రపిండాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయి'' అని నిజామాబాద్ మెడికల్ కాలేజీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ మాదల వివరించారు.

అలవాట్లను కట్టడి చేస్తేనే...

పొత్తికడుపు ప్రాంతంలో కొవ్వు అధికంగా చేరడాన్నే సెంట్రల్ ఒబెసిటీగా పేర్కొంటారు. పెరిగిన విసరల్ ఫ్యాట్ పోర్టల్ బ్లడ్ సిస్టమ్ ద్వారా సరఫరా అవుతుంది కాబట్టి ఈ ప్రాంతంలోని అదనపు కొవ్వు రక్తప్రవాహంలోకి కొవ్వు నిల్వలను విడుదల చేస్తుందని... ఇది అనారోగ్య సమస్యలను కలిగిస్తుందని వైద్యులు అంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యాయామం, శారీరక శ్రమను జీవనశైలిలో భాగం చేసుకోవడంతోపాటు ఆహారపు అలవాట్లను నియంత్రించుకోవడం తప్పనిసరని వారు సూచిస్తున్నారు.

రాష్ట్రంలో ఓ వర్గం మీడియా అరాచకం

- స్వార్థ, రాజకీయ, వ్యాపార ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తోంది
- వ్యక్తులు, ప్రభుత్వ, దర్యాప్తు సంస్థల ప్రతిష్టను దెబ్బ తీస్తోంది
- మీడియా ట్రయల్ చేస్తూ తీర్పులిచ్చేస్తోంది
- ప్రజా ప్రభుత్వాలను కూలదోసేందుకు తప్పుడు కథనాలు వండి వారుస్తోంది
- దర్యాప్తు సంస్థల మనో స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోంది.. న్యాయ వ్యవస్థను సైతం భ్రష్టుపట్టించేందుకు వెనుకాడటంలేదు
- టీవీ చర్చల్లో జడ్జిలను లంచగొండులుగా చిత్రీకరిస్తున్నారు.. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయాలి
- అందుకే రామోజీ, ఈనాడు, మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై ఫిర్యాదు చేస్తున్నాం
- విచారణకు స్వీకరించి వారికి సమన్లు జారీ చేయండి
- గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ కోర్టును కోరిన అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి
- ఫిర్యాదును పరిశీలించిన జిల్లా, సెషన్స్ జడ్జి
- తదుపరి చర్యల నిమిత్తం విచారణ వాయిదా

3లో

రంగస్థలానికి నంది అవార్డులు

- 5 విభాగాల్లో మొత్తం 73 నందుల ప్రదానం
- పద్య, సాంఘిక నాటకాలు, నాటికలకు పూర్వ వైభవం.. అర్హులకే నంది అవార్డులు ఇస్తాం
- ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి



- వివరాలు 10లో

క్లుప్తంగా...

నేడు ఢిల్లీకి సీఎం జగన్

ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను కలిసే ఛాన్స్

సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 9.30కు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీకి వెళ్తారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఢిల్లీలోని జనపథ్–1 నివాసానికి చేరుకుంటారు. ఈ పర్యటనలో సీఎం జగన్.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలతో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉంది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై ఆయన వారితో చర్చిస్తారు.

మూడు రోజులు వర్షాలు

సాక్షి, అమరావతి/విశాఖపట్నం: రాష్ట్రంలో వర్షాలకు పరిస్థితులు అనుకూలంగా మారాయి. ఇప్పటికే రెండు మూడు రోజులుగా కొన్నిచోట్ల మోస్తరుగా, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి బంగాళాఖాతం, దాని పరిసరాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై ఉత్తరాంధ్ర తీరానికి ఆనుకుని కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్రంలో అనేకచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ మంగళవారం రాత్రి నివేదికలో వెల్లడించింది.

ఏపీపీఎస్సీ పరీక్షలకు తేదీల ఖరారు

సాక్షి, అమరావతి: వివిధ ప్రభుత్వ విభాగాల్లోని నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీకి గతేడాది ఇచ్చిన నోటిఫికేషన్లకు రాత పరీక్షలు నిర్వహించేందుకు ఏపీపీఎస్సీ చర్యలు చేపట్టింది. ఆయా పరీక్షల తేదీలను మంగళవారం ప్రకటించింది. ఈ పరీక్షలు ఆగస్టు 18 నుంచి 22 వరకు జరుగుతాయని కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు. జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (పేపర్–1) టెస్ట్ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు సబ్జెక్టు పేపర్ (పేపర్–2) టెస్ట్ ఉంటుందని ప్రకటించారు. ఆగస్టు 18న ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌లో టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ పోస్టులకు, 19న ఏపీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సబార్డినేట్ సర్వీస్‌లోని కంప్యూటర్ డ్రాఫ్ట్‌మన్ (గ్రేడ్–2) పోస్టులకు, ఏపీ ప్రివెంటివ్ మెడిసిన్, పబ్లిక్ హెల్త్ ల్యాబ్స్ అండ్ ఫుడ్ సబ్ సర్వీస్‌లోని శాంపిల్ టేకర్ పోస్టులకు, 21న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ పోస్టులకు పరీక్షలు నిర్వహించనున్నారు.

నేటి నుంచి స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఏఎస్ఎస్) పోస్టుల భర్తీకి నేటి నుంచి వాక్–ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. రోజు విడిచి రోజు ఈ నెల 10 వరకు వీటిని నిర్వహిస్తారు. మొత్తం 14 స్పెషాలిటీల్లో 331 పోస్టులు భర్తీ చేస్తారు. ఇందులో భాగంగా తొలి రోజు బుధవారం జనరల్ మెడిసిన్–73, జనరల్ సర్జరీ–31, డెర్మటాలజీ–08, మైక్రోబయాలజీ–01, ఫోరెన్సిక్ మెడిసిన్–05 విభాగాల్లో 118 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు చేపడతారు. శాశ్వత, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పోస్టుల భర్తీ ఉంటుంది. కాంట్రాక్ట్ నియామకాల్లో విశ్రాంత వైద్యులకు అవకాశం కల్పిస్తారు. ఇంటర్వ్యూల్లో పాల్గొనే అభ్యర్థులు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఏపీవీవీపీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట మధ్య దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. ఇతర వివరాల కోసం 6301138782, apvvpwalkinrecruitment@gmail.comను సంప్రదించవచ్చు.

జగన్‌పై హత్యాయత్నంలో కుట్ర ఉంది

న్యాయస్థానానికి వివరించిన వైఎస్ జగన్ తరఫు న్యాయవాది

సాక్షి, అమరావతి : సీఎం వైఎస్ జగన్‌పై 2018 అక్టోబరు 25న విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం వెనుక కుట్ర ఉందని, ఈ కోణంలో ఎన్ఐఏ సరిగా దర్యాప్తు చేయలేదని ఆయన తరఫు న్యాయవాది న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా విశాఖపట్నం విమానాశ్రయంలో ఆయనపై జనుపల్లి శ్రీనివాసరావు అనే యువకుడు హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. విజయవాడలోని ఎన్ఐఏ న్యాయస్థానంలో మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. వైఎస్ జగన్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వైఎస్ జగన్‌పై హత్యాయత్నం వెనుక కుట్ర కోణం ఉందని తగిన ఆధారాలతోసహా వివరించినప్పటికీ ఎన్ఐఏ ఆ దిశగా దర్యాప్తు చేయలేదని చెప్పారు. కాగా, ఈ కేసులో నిందితుడు శ్రీనివాసరావుకు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరఫు న్యాయవాది న్యాయస్థానాన్ని కోరారు. బెయిల్ అంశం తమ పరిధిలో లేదని, హైకోర్టు లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించాలని న్యాయమూర్తి సూచించారు. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేశారు. అనంతరం న్యాయస్థానం ప్రాంగణంలో శ్రీనివాసరావు తరఫు న్యాయవాది మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి కేసును రెగ్యులర్‌గా విచారించాలని, లేకపోతే నిందితుడు శ్రీనివాసరావు రాజమహేంద్రవరం జైలులోనే నిరాహార దీక్ష చేస్తారని చెప్పారు.





చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ పనులకు భూమి పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం వెలుపల రహదారులపై భారీ జనసందోహం

‘చిత్తూరు’కు క్షీరాభిషేకం!

> **వెన్నుపోటు వీరుడు.. ప్యాకేజీ శూరుడు!**
>
> ఇవాళ వీళ్ల పరిస్థితి ఏమిటంటే.. చక్రాలు లేని సైకిల్ ఎక్కలేనాయన ఓ నాయకుడు! ఎవరైనా తైలం పోస్తే కానీ గ్లాసు నిండని వ్యక్తి మరో నాయకుడు! ఒకరు వెన్నుపోటు వీరుడు, మరొకరు ప్యాకేజీ శూరుడు! వీరిద్దరికీ పేదల బతుకుల గురించి, ప్రజల కష్టాల గురించి, మాటిస్తే ఆ మాట మీద నిలబడాల్సిన అవసరం గురించి, ఒక మాటకున్న విలువ గురించిగానీ ఏమాత్రం తెలియదు. అలా బతకాలన్న ఆలోచనా లేదు. ఇద్దరూ కలసి ప్రజల్ని మోసం చేస్తూ 2014 - 19 మధ్య రాష్ట్రాన్ని ఏలారు. ఇద్దరూ కలసి రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, చిన్న పిల్లలు, సామాజిక వర్గాలకు వెన్నుపోటు పొడిచారు.



చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ పనులకు భూమి పూజ చేస్తున్న సీఎం వైఎస్ జగన్



సభాస్థలి వద్దకు బస్సులో వస్తూ అభిమాన జనసందోహానికి నమస్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు మేయర్ అముద, ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, అమూల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్తూరు పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఆ వివరాలివీ..

రెండు మంచి కార్యక్రమాలకు నాంది

ఈరోజు జరుగుతున్న రెండు మంచి కార్యక్రమాల్లో మొదటిది.. ఏనాడో మూతపడ్డ అతి పెద్దదైన చిత్తూరు డెయిరీని తెరిపించేందుకు నాంది పలుకుతున్నాం. ఇక రెండోది.. దేశంలోనే టాప్ 3 మెడికల్ కాలేజీలలో ఒకటైన వేలూరు సీఎంసీ ఏర్పాటుకు పునాది రాయి వేస్తున్నాం. దివంగత వైఎస్సార్ ఏనాడో స్థలాన్ని కేటాయించి ఇక్కడ మెడికల్ కాలేజీని తీసుకొచ్చే కలగన్నారు. వైఎస్సార్ మరణం తర్వాత నిర్లక్ష్యానికి గురైన మెడికల్ కాలేజీ నిర్మాణానికి 14 ఏళ్ల తరువాత ఆయన బిడ్డగా ఇవాళ పునాది రాయి వేస్తున్నా.

చిత్తూరు డెయిరీ చరిత్ర..

పాడి రైతుల ముఖాల్లో చిరునవ్వులు విరబూయించిన చిత్తూరు డెయిరీని 20 ఏళ్ల క్రితం కుట్ర పూర్వకంగా మూసివేశారని జిల్లాలో నా పాదయాత్ర జరుగుతున్నప్పుడు ప్రజలు చెప్పిన మాటలు గుర్తున్నాయి. 1945లో చిల్లింగ్ ప్లాంట్‌గా ఏర్పడిన చిత్తూరు డెయిరీ 1988లో రోజుకు ఏకంగా 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో ప్రాసెసింగ్ చేస్తున్న పరిస్థితులు కనిపించేవి. 1988–1993 మధ్య రోజుకు సగటున 2.50 లక్షల నుంచి 3 లక్షల లీటర్ల ప్రాసెసింగ్ స్థాయికి చేరుకుంది. ఆ సమయంలో ఈ జిల్లా ఖర్మకొద్దీ చంద్రబాబు కళ్లు దానిపై పడ్డాయి. 1992లో తన సొంత డెయిరీ హెరిటేజ్ పురుడు పోసుకున్న తర్వాత ఒక పద్ధతి, పథకం ప్రకారం చిత్తూరు డెయిరీని నష్టాల్లోకి నెట్టేస్తూ పోయారు. సహకార రంగంలోని చిత్తూరు డెయిరీని 2002 ఆగస్టు 31న ఎలాంటి నోటీసు ఇవ్వకుండా మూత వేసే స్థాయికి తీసుకెళ్లారు. సరిగ్గా హెరిటేజ్ ఏర్పాటైన పదేళ్లకు అతిపెద్ద సహకార డెయిరీని చంద్రబాబు హయాంలో మూతవేసే కార్యక్రమం చేశారు. రైతులకే కాకుండా ఉద్యోగులకు రూ.వందల కోట్ల బకాయిలు పెట్టి 2003 నవంబర్ 27న లిక్విడేషన్ ప్రకటించేశారు.

అర్నెల్లకు ఒకసారి బోనస్..

ఆశ్చర్యమేమిటంటే.. సహకార రంగంలో అతి పెద్దదైన చిత్తూరు డెయిరీ నష్టాల్లోకి వెళ్తుంటే చంద్రబాబు కుటుంబ సంస్థ హెరిటేజ్ డెయిరీ మాత్రం అదే సమయంలో లాభాల్లోకి పరుగెత్తుకుంటూ పోయింది. 20 ఏళ్లుగా మూతపడ్డ ఈ చిత్తూరు డెయిరీ దుస్థితి చూసి దానికి జీవం పోసి పాడి రైతన్నలకు, అక్కచెల్లెమ్మలకు తోడుగా ఉంటానని హామీ ఇచ్చా. మాట ప్రకారం రూ.182 కోట్ల బకాయిలు తీర్చి నేడు చిత్తూరు డెయిరీ తలుపులు తెరిచాం. ప్రపంచంలోనే అతిపెద్ద సహకార డెయిరీ అమూల్‌ను తేవటమే కాకుండా వారు ఇదే డెయిరీలో రూ.385 కోట్లు పెట్టుబడి పెడుతున్నారని సంతోషంగా చెబుతున్నాం. ప్రతి ఆర్నెల్లకు ఒకసారి డెయిరీకి పాలు పోసే అక్కచెల్లెమ్మలకు లాభాలను బోనస్‌గా పంచిపెట్టే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం.

రూ.150 కోట్లతో తొలిదశ పనులు

రూ.150 కోట్లతో చిత్తూరు డెయిరీ తొలిదశ పనులు మొదలవుతున్నాయి. దాదాపు లక్ష లీటర్లతో మరో 10 నెలల వ్యవధిలో పాల ప్రాసెసింగ్ మొదలవుతుంది. రానున్న రోజుల్లో ఇక్కడే దశలవారీగా బటర్, పాలపొడి, యూహెచ్‌టీ పాల విభాగం, చీజ్ , పనీర్, యోగర్ట్, స్వీట్ తయారవుతాయి. ఐదు నుంచి ఏడెనిమిదేళ్లలో 10 లక్షల లీటర్లు ప్రాసెస్ చేసే స్థాయికి డెయిరీ చేరుకుంటుంది. దీనిద్వారా 5 వేల మందికి ప్రత్యక్షంగా ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయి. మరో 2 లక్షల మందికి అమూల్ రాకతో అవుట్‌లెట్స్, డిస్ట్రిబ్యూషన్ చానెళ్ల ద్వారా పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. చిత్తూరు జిల్లానే కాకుండా రాయలసీమకు చెందిన పాడి రైతన్నలు, అక్కచెల్లెమ్మలకు మంచి పాల సేకరణ ధర లభిస్తుంది.

ఇతర డెయిరీలూ పెంచక తప్పలేదు

సహకార రంగాన్ని పునరుద్ధరిస్తూ దేశంలోని అతి పెద్ద కో–ఆపరేటివ్ డెయిరీ అమూల్‌తో కలిసి 2020 డిసెంబర్ 2న ‘జగనన్న పాల వెల్లువ’ను ప్రారంభించాం. పాడి రైతుల నుంచి 8,78,56,917 లీటర్ల పాలను సేకరించాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రతి 10 రోజులకొకసారి నేరుగా అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. అమూల్ రాక ముందు 2020 డిసెంబర్ 2న గేదె పాల రేటు లీటరు రూ.67 ఉండగా అమూల్ వచ్చాక ఎనిమిది సార్లు రేటు పెంచుకుంటూ వెళ్లింది. ఈరోజు గేదె పాలు లీటర్ రూ.89.76 ఉంది. అమూల్ రాక ముందు ఆవు పాలు లీటర్ రూ.32 కూడా సరిగా ఉండేవి కాదు. అమూల్ వచ్చిన తర్వాత 8 సార్లు రేటు పెంచుకుంటూ వెళ్లడంతో రూ.43.69కి చేరుకుంది. ఇతర ప్రైవేట్ డెయిరీలు కూడా సేకరణ ధర పెంచక తప్పని పరిస్థితి ఉత్పన్నమైంది. పాల సేకరణలో మనం తీసుకున్న చర్యల వల్ల అక్కచెల్లెమ్మలు, పాడి రైతన్నలకు రూ.4,243 కోట్ల మేర అదనపు లబ్ధి చేకూరింది.

నాన్ రెసిడెంట్ నాయకులు..

చంద్రబాబు, దత్తపుత్రుడు నాన్ రెసిడెంట్ నాయకులు. ఇద్దరూ మన రాష్ట్రంలో ఉండరు. వీళ్లద్దరి కోసం హైదరాబాద్ పోవాల్సిందే. ఇద్దరికీ సామాజిక న్యాయం అసలే తెలియదు. పేదలకు గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లిష్ మీడియం తెస్తామంటే అడ్డుకుంటారు. పేదలకు ఇళ్ల పట్టాలిస్తామంటే దాన్నీ అడ్డుకుంటారు. సంక్షేమ పథకాలు ఇస్తామంటే దాన్నీ అడ్డుకొనే కార్యక్రమం చేస్తారు. వీరికి అధికారం కావాల్సింది ప్రజలకు మంచి చేయడం కోసం కాదు.. దోపిడీ కోసమే! ఈరోజు యుద్ధం జరుగుతోంది జగన్‌తో కాదు. పేదవాడితో పెత్తందార్లకు యుద్ధం జరుగుతోంది. మీ ఇంట్లో మంచి జరిగితే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలవాలని కోరుతున్నా.

చిత్తూరుకు శుభవార్తలు

‘చిత్తూరు మున్సిపాల్టీకి సంబంధించి రూ.75 కోట్ల పనులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాసులు కోరారు. ఆర్వోబీ, లిల్లీ బ్రిడ్జి కావాలని అడిగారు. ఇవన్నీ చేస్తాం. చిత్తూరులో ఎన్ని సచివాలయాలుంటే అన్నింటికీ రూ.50 లక్షలు చొప్పున వెంటనే మంజూరు చేస్తాం. ప్రతిపాదనలు అందించిన వెంటనే మంజూరవుతాయి. బీసీ భవన్ నిర్మాణం జరుగుతుంది. కాపు భవనాన్ని కూడా మంజూరు చేస్తున్నా. 37 కి.మీ. రోడ్ల ప్రతిపాదనలు రూపొందించి పనులు చేపడతాం.

షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల బకాయిలు క్లియర్

చిత్తూరు చక్కెర కర్మాగారం ఉద్యోగులకు శుభవార్త చెబుతూ వారికి సంబంధించిన రూ.32 కోట్ల బకాయిలు క్లియర్ చేశాం. వారి ముఖాల్లో చిరునవ్వులు చూసేందుకు బకాయిలు క్లియర్ చేసిన తర్వాతే ఇక్కడకి వచ్చా. చిత్తూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అడిగారు. దీనిపై ప్రతిపాదనల కోసం కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చాం. మరి కొన్ని విద్యాసంస్థల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నాం’

పాడి రైతన్నలకు లాభం

చిత్తూరులో డెయిరీ స్థాపనకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు. పాడి రైతులకు మరింత మేలు చేసే విధంగా అధిక ధరకు పాల సేకరణ చేస్తాం. గుజరాత్, మరో 16 రాష్ట్రాల్లో అమూల్ డెయిరీలున్నాయి. ఏటా 36 లక్షల మంది పాడి రైతుల నుంచి దాదాపు 10 బిలియన్ లీటర్ల పాలను సేకరిస్తున్నాం. రూ.7,200 కోట్ల టర్నోవర్‌తో అమూల్ సంస్థ అంతర్జాతీయంగా ఉత్తమ స్థానంలో ఉంది.

– జైన్ మెహతా, అమూల్ ఎండీ

పురిటి గడ్డకు చంద్రబాబు ద్రోహం

సాక్షి, తిరుపతి: ప్రతిపక్ష నేత చంద్రబాబు ఆయన సొంత జిల్లాకు ఏ మేలు చేశారని అడిగితే చెప్పుకునేందుకు ఒక్కటంటే ఒక్కటీ కనిపించదని సీఎం వైఎస్ జగన్ విమర్శించారు. సొంత జిల్లా చిత్తూరు జిల్లాకు చంద్రబాబు చేసిన అన్యాయాలు కోకొల్లలని వ్యాఖ్యానించారు. మంగళవారం చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ పనులకు భూమి పూజ చేసిన అనంతరం జరిగిన సభలో సీఎం జగన్ మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం ఏమన్నారంటే..

కుప్పంలోనూ బైబై బాబూ

చంద్రగిరిలో గెలవలేనని గ్రహించి కుప్పానికి వలస వెళ్లాల్సి వచ్చింది ఈ పెద్ద మనిషి! ఆ కుప్పంలో కూడా ప్రజలు బైబై బాబూ అంటున్నారు. 75 ఏళ్ల వయస్సున్న ఈ ముసలాయన రాజకీయాల్లోకి వచ్చిన ఇన్నేళ్ల తర్వాత, మూడు సార్లు ముఖ్యమంత్రి అయిన తర్వాత.. రాజకీయ జీవితం ముగిసిపోతున్న దశలో కుప్పంలో ఇల్లు కట్టుకుంటాననంటూ మరో డ్రామా ఆడుతున్నారు. కుప్పానికి 35 ఏళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తికి అక్కడ ఇల్లు లేదు. ప్రజలను మోసగించేందుకు ఇప్పుడు ఇల్లు కట్టుకుంటాననంటున్నారు. అందులోనూ చిత్తశుద్ధి లేదు. మనం పర్మిషన్ ఇవ్వడం లేదంటూ ఆ నెపాన్ని మనపై వేస్తున్నారు.

కార్మికులు బలి.. పప్పు బెల్లాలకు

చిత్తూరు డెయిరీ ఒక్కటే కాదు.. ఉమ్మడి రాష్ట్రంలో 1995–2004 మధ్య చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఏం చేశారో ఆయన భజన బృందంగా మారిన ఇతర పార్టీలు కాస్త గుర్తు తెచ్చుకోవాలి. ప్రభుత్వ రంగం, సహకార రంగాలకు చెందిన చక్కెర, నూలు ఫ్యాక్టరీలు, డెయిరీలు, పేపర్ మిల్స్, ఎలక్ట్రానిక్ పరిశ్రమలను ఒక పద్ధతి ప్రకారం నష్టాల్లోకి గెంటేసి నచ్చినవారికి, నచ్చిన రేటుకు విక్రయించి వేల మంది కార్మికుల ఉద్యోగాలను బలి తీసుకుంది ఇదే పెద్ద మనిషి చంద్రబాబే. ఉద్యోగులు, రైతులకు చెల్లించాల్సిన బకాయిలకు ఎగనామం పెట్టారు. ఈ పరిశ్రమలన్నీ దేవేందర్‌గౌడ్, నామా నాగేశ్వరరావు.. లాంటి తన వాళ్లకే విక్రయించారు. అది కూడా పప్పు బెల్లాలకే..! హెరిటేజ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా రైతుల డెయిరీలను చంపేయగా, ముడుపుల కోసం ఆల్విన్, రిపబ్లిక్ లాంటి సంస్థలతో పాటు మిగతా ప్రభుత్వ, సహకార రంగ సంస్థలన్నింటినీ విక్రయించిన చరిత్ర చంద్రబాబుది.

బాబు జమానాలో విక్రయాలకో విభాగం

మనం ప్రజల కోసం గ్రామ, వార్డు సచివాలయాలను తీసుకొస్తే చంద్రబాబు మాత్రం అప్పట్లో హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో ఇంప్లిమెంటేషన్ సెక్రటేరియట్ తెరిచాడు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహకార రంగ సంస్థలను విక్రయించేందుకే అది ఏర్పాటైంది. అలా ఆయన హయాంలో మూసినవి, అమ్మేసిన ప్రభుత్వ రంగ, సహకార రంగం సంస్థలు అక్షరాలా 54.

ఆర్టీసీ, ఆస్పత్రులు, స్కూళ్లపైనా కన్ను

2004లో చంద్రబాబు ఓడిపోకపోయి ఉంటే ఇవాళ ఆర్టీసీ ఉండేది కాదు. ప్రభుత్వ రంగంలో ఆస్పత్రులూ ఉండేవి కాదు. పేద పిల్లలు చదువుకునే స్కూళ్లు కూడా గవర్నమెంట్ రంగంలో ఉండేవి కాదు. అన్నిటినీ హోల్‌సేల్‌గా కేశినేని నానికో, నారాయణకో, చైతన్యకో లేదా హాస్పిటల్స్ అయితే తనకు నచ్చిన ఇంకొకరికో హోల్‌సేల్‌గా అమ్మేసేవారు. ఇలా ఉద్యోగాలు ఊడగొట్టడాన్ని, ప్రభుత్వ రంగాన్ని తన స్వార్థం కోసం కూల్చేయడాన్ని చంద్రబాబు గొప్ప విషయంగా భావిస్తూ ‘ప్రైవేటైజేషన్ ఏ సక్సెస్ స్టోరీ ఇన్ ఆంధ్రప్రదేశ్’ అని పుస్తకాన్ని రిలీజ్ చేశారు. తన మేనిఫెస్టో మాదిరిగా తాను ఎన్ని మోసాలు చేసినా ప్రజలు మరిచిపోతారన్నది చంద్రబాబు నమ్మకం.



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, అమూల్ డెయిరీ ప్రతినిధులు



పాడిరైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం వైఎస్ జగన్



చిత్తూరు సమీపంలోని చీలాపల్లి వద్ద సీఎంసీ మెడికల్ కాలేజీ, 300 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించిన సీఎం వైఎస్ జగన్

అల్లూరి ఒక మహోన్నత శక్తి

- శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, విప్ ప్రసాదరాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- భీమవరంలో క్షత్రియ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు
- నాడు అల్లూరి పోరాటం వల్లే మన్యం నేటికీ కొనసాగుతోంది: ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

భీమవరం(ప్రకాశం చౌక్)/కొమ్మాది: ‘అల్లూరి సీతారామరాజు ఒక మహోన్నత శక్తి. ఆయన పోరాటం ఆదర్శనీయం . ఆయన తెలుగువారు, మన ప్రాంతంవారు కావడం మన అదృష్టం. మనందరికీ గర్వకారణం’ అని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలను పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని అల్లూరి స్మృతివనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు (వాసు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశానికి బానిస సంకెళ్ల నుంచి విముక్తి కల్పించి స్వేచ్ఛను ప్రసాదించడం కోసం, గిరిజనుల హక్కుల కోసం అల్లూరి చేసిన పోరాటాలు బ్రిటీష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించాయని కొనియాడారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అల్లూరి స్మృతివనం, కాంస్య విగ్రహం ఏర్పాటుపై చొరవ చూపారని, రూ.20 కోట్ల విలువైన భూమిని కేటాయించడంతోపాటు 125వ జయంతి వేడుకలకు రూ.10 కోట్ల నిధులు కూడా అందించారని చెప్పారు. ఎమ్మెల్సీలు వంక రవీంద్రనాథ్, జయమంగళ వెంకటరమణ, కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యే మంతెన రామరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ,, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, సీనియర్ నాయకులు గోకరాజు గంగరాజు, గూడూరి ఉమాబాల పాల్గొన్నారు.



భీమవరంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

అల్లూరి లేకపోతే మన్యం లేదు : రాజన్నదొర

మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు లేకపోతే నేడు మన్యం ప్రాంతం ఉండేది కాదని, ఆయన పోరాటం వల్లే గిరిజనుల జీవన విధానం దెబ్బతినకుండా నేటికీ కొనసాగుతోందని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. అల్లూరి 126వ జయంతి వేడుకలను రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ భవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి ప్రధాన అనుచరులు గాం గంటందొర, గాం మల్లుదొర విగ్రహాలను అరకు ఎంపీ మాధవి, విశాఖ మేయర్ జి.హరివెంకటకుమారితో కలసి రాజన్నదొర ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో గిరిజన విద్యాభివృద్ధికి సీఎం జగన్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని చెప్పారు. ఎంపీ మాధవి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి పోరాటం చిరస్మరణీయమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, గిరిజన కో–ఆపరేషన్ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, డైరెక్టర్ రవీంద్రబాబు, ఈడీ చిన్నబాబు, నాగరాజు పాల్గొన్నారు.

అల్లూరి స్మృతివనం ప్రారంభించిన రాష్ట్రపతి

అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకల ముగింపు కార్యక్రమం హైదరాబాద్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అక్కడి నుంచే ఆమె భీమవరంలో అల్లూరి స్మృతివనాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

అల్లూరే అందరికీ స్ఫూర్తి

- వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి
- పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

సాక్షి,అమరావతి: బ్రిటీష్ వలస పాలకులకు వ్యతిరేకంగా, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్, జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుంబాక విజయసాయిరెడ్డి కొనియాడారు. ఇంతటి ఘనచరిత్ర కలిగిన స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరిని తరతరాలవారు స్మరించుకునేలా, సీఎం వైఎస్ జగన్ ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టారని చెప్పారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విజయసాయిరెడ్డి ప్రసంగిస్తూ అల్లూరి స్ఫూర్తితో, ఆదివాసీల హక్కుల్ని కాపాడటంలోనూ, వారికి అన్నిరకాలుగా అండదండలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుందన్నారు. గిరిజనులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామని, వారి ఆధీనంలోని పోడు భూముల వ్యవసాయాన్ని ఎవరూ ఆటంకపరచకుండా వ్యవసాయ పట్టాల్ని ఇచ్చామని వివరించారు. శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ అల్లూరి జయంతి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, వరుదు కల్యాణి, మొండితోక అరుణ్‌కుమార్, పార్టీ ఎస్టీ విభాగ అధ్యక్షుడు హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

విచారణకు రాలేం..

- ఈ–మెయిల్ ద్వారా తెలిపిన రామోజీరావు, శైలజా కిరణ్
- న్యాయ సలహా అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్న సీఐడీ

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ఏ–1 చెరుకూరి రామోజీరావు, ఏ–2 శైలజ కిరణ్ తాము గుంటూరులో సీఐడీ విచారణకు హాజరుకాలేమని తెలిపినట్లు సమాచారం. అనారోగ్య కారణాలతో రామోజీరావు, రాలేని పరిస్థితుల్లో ఉన్నందున శైలజ కిరణ్ విచారణకు హాజరుకాలేమని ఈ–మెయిల్ ద్వారా సీఐడీ అధికారులకు సమాచారం ఇచ్చారు. చందాదారుల సొమ్మును చిట్‌ఫండ్స్ చట్టానికి విరుద్ధంగా సొంత ప్రయోజనాలకు మళ్లించడం, రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్ల సేకరణ కేసులో రామోజీరావు, శైలజ కిరణ్‌తోపాటు మరికొందరిపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే రామోజీరావును ఓసారి.. శైలజ కిరణ్‌ను రెండుసార్లు హైదరాబాద్‌లోని వారి నివాసంలో సీఐడీ అధికారులు విచారించారు. కాగా.. నేరం ఏపీలో జరిగింది, ఏపీలో ఉన్న చందాదారుల నిధులను అక్రమంగా మళ్లించారు.. కాబట్టి నిందితులిద్దర్నీ ఏపీలో విచారించడం సరైందని సీఐడీ అధికారులు భావించారు. అలాగే, నిందితులు దర్యాప్తు సంస్థ కార్యాలయంలో విచారణకు హాజరుకావడమన్నది దేశవ్యాప్తంగా పాటిస్తున్న విధానమే. మరోవైపు.. హైదరాబాద్‌లో విచారణ సందర్భంగా సీఐడీ అధికారులను తమ నివాసంలోకి అనుమతించకుండా రామోజీరావు తన సిబ్బంది ద్వారా చాలాసేపు అడ్డుకోవడం గమనార్హం. దీంతో ఈ నెల 5న గుంటూరులో సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని రామోజీరావు, శైలజ కిరణ్‌లకు సీఐడీ అధికారులు సీఆర్‌పీసీ 41(ఏ) కింద గత నెల 22న నోటీసులు జారీచేశారు. కానీ, రామోజీరావు, శైలజ కిరణ్ గురించి తెలిసిన పలువురు పరిశీలకులు అనుకున్నట్లుగానే వారిరువురు విచారణకు హాజరయ్యేందుకు విముఖత చూపారు. రామోజీరావు అనారోగ్య సమస్యలను కారణంగా చూపగా.. తాను వచ్చే పరిస్థితుల్లో లేనని శైలజ కిరణ్ చెప్పడం గమనార్హం. దీనిపై న్యాయ సలహా తీసుకుని తదుపరి చర్యలు చేపట్టాలని సీఐడీ అధికారులు భావిస్తున్నారు.


మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే: నటుడు సుమన్



అంబాజీపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేయడంతో మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడుతుందని సినీనటుడు సుమన్ చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పుల్లేటికుర్రులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, తమ అభిమానులు తెలిపిన అభిప్రాయాల మేరకు మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొచ్చి వైఎస్ జగన్‌ని ముఖ్యమంత్రి చేయనున్నారన్నారు. గత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను పట్టించుకోలేదని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సముచిత న్యాయం జరిగిందని వారే చెబుతున్నారని తెలిపారు. నవరత్న పథకాలను 95 శాతం అమలు చేసి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు.

టీచర్లకు ప్రభుత్వానికి మధ్య వారధిలా వ్యవహరించండి

వైఎస్సార్ టీఎఫ్ సమావేశంలో ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి,అమరావతి: ప్రభుత్వానికి ఉపాధ్యాయులకు మధ్య వారధిలా వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ (వైఎస్సార్‌టీఎఫ్) వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన వైఎస్సార్ టీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో ప్రభుత్వం తలపెట్టిన విప్లవాత్మక మార్పులు, తద్వారా ప్రజలకు చేస్తోన్న మంచిని సహచర ఉపాధ్యాయులకు వివరించాలని సూచించారు. గతంలో మాదిరిగా కాకుండా ఉపాధ్యాయుల బదిలీల దగ్గర నుంచి ఎంఈవోల నియామకాల వరకు ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించిందని తెలిపారు. పార్టీ విభాగ ఉపాధ్యాయ సంఘంలోని నాయకులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఏర్పాటైన కొత్త కమిటీ ద్వారా ఫెడరేషన్‌ను బలోపేతం చేయాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కల్పలతరెడ్డి, ఎంవీ రామచంద్రరెడ్డి, టీచర్స్ ఫెడరేషన్ నాయకులు, శాసన మండలిలో చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె.జాలిరెడ్డి, అధ్యక్షుడిగా పి.అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి.సుధీర్, అధికార ప్రతినిధిగా కె.ఓబుళపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండ్రెడ్డి వెంకటరెడ్డి, కోశాధికారిగా టి.శేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నిక నిర్వహించారు.

రాష్ట్రంలో ఓ వర్గం మీడియా అరాచకం

స్వార్థ, రాజకీయ, వ్యాపార ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తోంది

వ్యక్తులు, ప్రభుత్వ, దర్యాప్తు సంస్థల ప్రతిష్టను దెబ్బ తీస్తోంది

అందులో భాగంగానే రామోజీరావు, ఈనాడు, మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై ఫిర్యాదు చేస్తున్నాం

గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ కోర్టును కోరిన అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓ వర్గం మీడియా అరాచకం సృష్టిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం గుంటూరు జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి కోర్టుకు నివేదించింది. స్వార్థ, రాజకీయ, వ్యాపార ప్రయోజనాలే పరమావధిగా వ్యక్తుల, ప్రభుత్వ, దర్యాప్తు సంస్థల ప్రతిష్టను దెబ్బ తీసేందుకు నిస్సిగ్గుగా ఆ మీడియా వ్యవహరిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కోర్టుకు వివరించారు. వ్యక్తులు, ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలే లక్ష్యంగా తప్పుడు కథనాలు రాయడం, మీడియా ట్రయల్ నిర్వహించడం, తీర్పులిచ్చేయడం వంటి అరాచకాలకు ఆ మీడియా అడ్డాగా మారిందన్నారు. ప్రజా ప్రభుత్వాలను కూలదోసేందుకు తప్పుడు కథనాలను వండి వారుస్తోందని చెప్పారు. దర్యాప్తు సంస్థలను సైతం వదిలిపెట్టడంలేదని, తప్పుడు, బెదిరింపు కథనాలతో వాటి మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. పత్రికా స్వేచ్ఛను అడ్డంపెట్టుకుని చట్టం నుంచి తప్పించుకునేందుకు మార్గదర్శి యాజమాన్యం ప్రయత్నిస్తోందన్నారు. వ్యక్తులను, ప్రభుత్వాన్ని, దర్యాప్తు సంస్థలను నాశనం చేయాలని చూస్తున్న ఈనాడు, దాని యాజమాన్యం విషయంలో తాము మౌనంగా చూస్తూ ఉండబోమన్నారు. చట్టానికి లోబడి ఏం చేయాలో అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో భాగంగానే మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఈనాడు, వాటి యాజమాన్యాలపై రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన కోర్టుకు వివరించారు. న్యాయ వ్యవస్థను భ్రష్టు పట్టించేందుకు కూడా ఆ మీడియా వెనుకాడటం లేదన్నారు. టీవీల్లో చర్చల పేరుతో న్యాయమూర్తులను లంచగొండులుగా చిత్రీకరిస్తోందని వివరించారు. ప్రజాస్వామ్య, ప్రజా ప్రభుత్వాల మనుగడ కోసం ఇలాంటి తీరుకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దాఖలు చేసిన ఫిర్యాదును విచారణకు స్వీకరించి, నిందితులకు సమన్లు జారీ చేయాలని అభ్యర్థించారు. ప్రభుత్వ ఫిర్యాదును పరిశీలించిన ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి వైవీఎస్‌బీజీ పార్థసారథి తదుపరి చర్యల నిమిత్తం విచారణను వాయిదా వేశారు.

వాదనల బాధ్యతను పొన్నవోలుకు అప్పగించిన ప్రభుత్వం..

ఈనాడు అధినేత చెరుకూరి రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ చట్ట విరుద్ధ కార్యకలాపాలు, నిధుల మళ్లింపుపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేపడుతున్న ఏపీ సీఐడీపై ఈనాడు దినపత్రిక యాజమాన్యం అసత్య కథనాలు ప్రచురిస్తోంది. ఇందులో భాగంగా మార్గదర్శిపై భారీ కుట్ర అంటూ ఇటీవల ఓ కథనం ప్రచురించింది. సీఐడీపై పలు అసత్య ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో ఈనాడు, రామోజీరావు, ఈనాడు ఎడిటర్, ఇతరులపై సీఆర్‌పీసీ సెక్షన్ 199(2) కింద ఫిర్యాదు చేసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. గుంటూరు కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాఖలు చేసే ఫిర్యాదులో వాదనలు వినిపించే బాధ్యతలను ఏఏజీ సుధాకర్‌రెడ్డికి అప్పగించింది.

నిందితులుగా రామోజీరావు, కిరణ్, శైలజాకిరణ్ తదితరులు

ప్రభుత్వ అనుమతులకు అనుగుణంగా గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మంగళవారం ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. ఇందులో ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, ఆ సంస్థ డైరెక్టర్ చెరుకూరి రామోజీరావు, ఆయన కుమారుడు కిరణ్, కోడలు శైలజా కిరణ్, ఈనాడు ఎడిటర్ నాగేశ్వరరావు, ఆ పత్రిక పాత్రికేయులు విశ్వప్రసాద్, ఎం.నరసింహారెడ్డి, కనపర్తి శ్రీనివాస్‌లను నిందితులుగా పేర్కొన్నారు. ఫిర్యాదుతో ఈనాడు ప్రచురించిన కథనం, ఫిర్యాదుల కాపీలు, ఎఫ్ఐఆర్‌లు, రామోజీరావు, కిరణ్‌ల వాంగ్మూలం, శైలజ రిమాండ్ రిపోర్టులు జత చేశారు.

ఫిర్యాదులోని ముఖ్యాంశాలు..

ఈనాడు ప్రచురిస్తున్న తప్పుడు, పరువు నష్టం కథనాల విషయంలో చూసీ చూడనట్లు ఉంటే, వారికి మరింత ధైర్యాన్ని ఇచ్చినట్లే అవుతుంది. నిందితులు వారికి మాత్రమే పరువు, ప్రతిష్టలున్నాయన్న భ్రమలో బతుకుతున్నారు. వారికి వారే చట్టంగా భావిస్తున్నారు. చట్ట ప్రకారం వారి ఫేమ్‌ను ఎవరు ప్రశ్నించినా వారిని ఫ్రేమ్‌లో ఇరికిస్తారు. వారిని ఎవరూ తాకకూడదన్న రీతిలో వారి తీరు ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో వారి అధికారానికి, శక్తికి కోట బురుజులా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దశాబ్దాలుగా ప్రభుత్వ యంత్రంగాలు మార్గదర్శి అక్రమాలకు ఆశ్రయం కల్పించాయి. మొదటిసారి ఏపీ సీఐడీ తనకు అందిన ఫిర్యాదుల ఆధారంగా వారి అత్యంత శక్తివంతమైన రక్షిత సామ్రాజ్యంపై దర్యాప్తు మొదలుపెట్టింది. దీని ఫలితంగానే సీఐడీపై ఈనాడు ఏప్రిల్ 13న తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ఈనాడు వంటి ఓ వర్గం మీడియాకు పాత్రికేయం వృత్తికంటే వ్యాపారం అయిపోయింది.' అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన ఫిర్యాదులో వివరించారు.

కర్త, కర్మ, క్రియ రామోజీరావే

'మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, ఉషాకిరణ్ మూవీస్, కలోరమా ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితరాలకు రామోజీరావే కర్త, కర్మ, క్రియ. ప్రజల నాడిని, మనస్సులను ఆయనకు కావాల్సిన విధంగా మార్చగలనని రామోజీరావు భావిస్తుంటారు. సీఐడీ మనోస్థైర్యాన్ని దెబ్బతీసి, దాని పేరు ప్రతిష్టలను మంటగలపడాన్ని రామోజీరావు తదితరులు పిల్లాటగా భావిస్తున్నారు. వారి ప్రయోజనాలకు అతికేలా, ప్రతిష్టాత్మక సంస్థ సీఐడీపై తప్పుడు, పరువు నష్టం కలిగించే కథనాన్ని ప్రచురించారు. సీఐడీపై యుద్ధం ప్రకటించారు. రామోజీరావు, ఆయన కుమారుడు, కోడలిని రక్షించేందుకు మిగిలిన నిందితులు సాయం చేశారు. ఈ తప్పుడు కథనంలో నిందితులందరికీ పాత్ర ఉంది.' అని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రామోజీరావును చట్టం ముందు నిలబెడతాం: ఏఏజీ

పత్రికా స్వేచ్ఛ ముసుగులో ప్రభుత్వ, ప్రజల స్వేచ్ఛను హరిస్తామంటే రామోజీరావును రాష్ట్ర ప్రభుత్వం తరఫున చట్టం ముందు నిలబెడతామని ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఎవరిపై ఎలాంటి కక్ష లేదని తెలిపారు. అక్రమ వ్యాపారం చేసినా న్యాయవ్యవస్థ, ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు గానీ ప్రశ్నించకూడదన్న రీతిలో రామోజీరావు, మార్గదర్శి యాజమాన్యం వ్యవహరిస్తున్నారన్నారు. ఎవరూ ఫిర్యాదు చేయలేదు కాబట్టి, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడానికి వీల్లేదంటూ విచిత్ర వాదన చేస్తున్నారని తెలిపారు. చిట్‌ఫండ్ సంస్థ చర్యలు అక్రమమని ప్రభుత్వం గానీ, దర్యాప్తు సంస్థలు గానీ గుర్తిస్తే ప్రజలకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టవచ్చని వివరించారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా తన అడుగులకు మడుగులొత్తాలని రామోజీ భావిస్తారని, లేదంటే తన ఈనాడు ద్వారా విషపూరిత, బ్లాక్ మెయిల్ కథనాలను ప్రచురించి, ప్రజల మనస్సులను కలుషితం చేస్తారన్నారు. రెండు రోజుల్లో మరో క్రిమినల్ కేసు కూడా దాఖలు చేస్తామని తెలిపారు.

ఎస్టేట్‌ను కాపాడుకునేందుకు ఫోర్త్ ఎస్టేట్‌ను వాడుకుంటున్నారు..

'చిట్‌ఫండ్ చట్ట నిబంధనల అమలులో భాగంగా విజయవాడ, గుంటూరు, అనంతపురం, నర్సరావుపేట, ఏలూరు, రాజమండ్రి, విశాఖపట్నంలలోని చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు మార్గదర్శి కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. పలు ఉల్లంఘనలను, అక్రమాలను గుర్తించారు. మార్గదర్శి.. చిట్ మొత్తాలను నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ ఖాతాలకు బదిలీ చేసింది. సెక్యూరిటీ ముసుగులో డిపాజిట్లు ఆమోదించింది. బ్యాలెన్స్ షీట్‌లను కూడా సమర్పించలేదు. దీంతో రిజిస్ట్రార్లు సీఐడీ అదనపు డీజీకి ఫిర్యాదులు ఇచ్చారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్, రామోజీరావు, కిరణ్, శైలజా కిరణ్ తదితరులపై కేసులు నమోదు చేశారు. దీన్ని భరించలేని రామోజీరావు తదితరులు మీడియా ముసుగులో ఈనాడులో తప్పుడు కథనాలతో సీఐడీపై విషం చిమ్మారు. తమ ఎస్టేట్‌ను కాపాడుకునేందుకు ఫోర్త్ ఎస్టేట్‌ను వాడుకుంటున్నారు. వారి అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయన్న దుగ్ధతోనే ఇదంతా చేశారు. సీఐడీకి పక్షపాతాన్ని ఆపాదిస్తున్నారు. దర్యాప్తులో అడ్డంకులు సృష్టిస్తున్నారు. వారి యజమాని, కుటుంబ సభ్యుల ప్రయోజనాలు ప్రభావితం అయినప్పుడు, వారి గొంతుక అయిన ఈనాడు క్రోధాగ్నితో వారి ప్రయోజనాలకు అతికేలా తప్పుడు, పరువు నష్టం కలిగించేలా విషపూరిత కథనాలు ప్రచురిస్తుంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించి నిందితులకు సమన్లు జారీ చేయాలని ప్రార్థిస్తున్నాం' అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన ఫిర్యాదులో వివరించారు.

రంగా పేరు తలిచే అర్హత టీడీపీకి లేదు

- పవన్ చంద్రబాబు పల్లకీ మోస్తే.. రంగా అభిమానులు మోయాలా
- రంగా పేరు కలకాలం నిలిచేలా చేస్తాం
- జయంతి సభలో వైఎస్సార్‌సీపీ నేతలు, వక్తలు



రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి, ఉదయభాను, మేయర్ భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్ తదితరులు

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): పేద, అణగారిన వర్గాలకు అండగా నిలిచిన వంగవీటి మోహనరంగాను పొట్టన పెట్టుకుంది ఎవరో అందరికీ తెలియాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. రంగా వెన్నులో దిగిన కత్తి, ఆయనపై విసిరిన బాంబు.. టీడీపీది కాదా.. చంద్రబాబుది కాదా.. సైకిల్‌ది కాదా అని ప్రశ్నించారు. రంగాను చంపిన చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీకి ఆయన బొమ్మ పెట్టుకునే అర్హత కూడా లేదన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేస్తే రంగా ఆత్మ శాంతిస్తుందా ప్రశ్నించారు. వంగవీటి మోహనరంగా 76వ జయంతి వేడుకలను ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత ఆకుల శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించన ఈ కార్యక్రమానికి మంత్రి జోగి రమేశ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, గుంటూరు మేయర్ కావటి రమేష్‌నాయుడు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

రంగా వ్యక్తి కాదు ఒక శక్తి..

ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా పేరు పలికే అర్హత పవన్‌కళ్యాణ్‌కు లేదన్నారు. చంద్రబాబు పల్లకిని పవన్ మోస్తే.. రంగా అభిమానులు కూడా మోయాలా? అని ప్రశ్నించారు. టీడీపీ నేతలు, పవన్ కళ్యాణ్ దయచేసి రంగా పేరును వాడొద్దని అన్నారు. రంగా పేరును వాడే అర్హత వైఎస్సార్ అభిమానులమైన తమకే ఉందన్నారు. రంగా పేరును కలకాలం నిలిచేలా చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ.. రంగా ఒక వ్యక్తి కాదని శక్తి అని పేర్కొన్నారు. ఆయన అందరివాడన్నారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రంగా విధానాలను ముందుకు తీసుకెళ్లిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని, కాపులకు రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచారన్నారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ అందరిలోనూ ధైర్యం నింపగల శక్తిమంతుడు రంగా అని కొనియాడారు. తాను రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యానంటే వైఎస్సార్, రంగానే కారణమన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు వంగవీటి రంగా ఒక ఐకాన్ అని పేర్కొన్నారు. మంచి చేస్తున్న వారికి అండగా నిలవాల్సిన అవసరం కాపులకు ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా రంగాతో కలిసి నడిచిన పది మందిని ఘనంగా సత్కరించారు. అనంతరం రంగా జీవిత చరిత్రలో కొన్ని అంశాలతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏపీఎండీసీ చైర్మన్ పుణ్యశీల, వైఎస్సార్‌సీపీ నేతలు భవకుమార్, మహమూద్, రాధారంగా మిత్ర మండలి నాయకులు చెన్నుపాటి శ్రీను పాల్గొన్నారు.

చంపిన వాళ్లే సానుభూతికి ప్రయత్నిస్తున్నారు

- బాబుపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం
- సత్తెనపల్లిలో వంగవీటి రంగా కాంస్య విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి: వంగవీటి మోహనరంగా తనకు ప్రాణహాని ఉందని తెలిసి రక్షణ కోరితే.. ఆనాటి ప్రభుత్వం రక్షణ కల్పించక పోగా హత్య చేశారని, చంద్రబాబు, నాటి హోంమంత్రి ప్రోద్బలంతోనే ఆ హత్య జరిగిందని రాష్ట్ర మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. పేదల పక్షపాతి రంగాను కుట్ర చేసి దారుణంగా చంపిన వాళ్లే తిరిగి సానుభూతి కోసం ఆయన జయంతి, వర్ధంతిలను నిర్వహిస్తున్నారని టీడీపీ నాయకుల తీరుపై నిప్పులు చెరిగారు. వంగవీటి మోహనరంగా జయంతిని పురస్కరించుకొని పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మంగళవారం ఆయన కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొట్టు సత్యనారాయణ, అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హుందాతనం జగన్‌లో కనిపించట్లేదు

- పవన్ చట్టపరంగా ఎన్ని పెళ్లిళ్లు చేసుకుంటే మీకెందుకు?
- నోరు జాగ్రత్త పెట్టుకుంటే మంచిది
- రాజారెడ్డి నుంచి మీ వరకూ అందరికీ దోచుకోవడం అలవాటే
- మీ అందరి అవినీతి చిట్టా ప్రజల ముందుకు తెమ్మంటారా?
- పవన్‌ను దత్తపుత్రుడంటున్నారు.. మీరు కేసీఆర్‌కు దత్తపుత్రుడా?
- సీఎంకి బహిరంగ లేఖలో మాజీ ఎంపీ చేగొండి



పాలకొల్లు సెంట్రల్: నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హుందాతనం నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో కనిపించడంలేదని కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య అన్నారు. మంగళవారం ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ప్రతిపక్ష నాయకుల పట్ల వైఎస్సార్ విమర్శలు చాలా హుందాగా ఉండేవన్నారు. ఆయన హుందాతనంలో 10వ వంతు కూడా జగన్‌కు లేదనిపిస్తోందని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్‌పై జగన్ చేస్తున్న విమర్శలు చూస్తుంటే సినిమాల్లో విలన్‌గా వర్ణించవచ్చనిపిస్తోందన్నారు. చట్టపరంగా పవన్ ఎన్ని పెళ్లిళ్లు చేసుకుంటే ప్రజలెవరికీ లేని అభ్యంతరం మీకెందుకని, ఎవరినైనా ఉంచుకుంటే తప్పుగానీ ఏవైనా కారణాల చేత భార్యాభర్తలు చట్టపరంగా విడిపోయి చట్టపరంగానే మరో పెళ్లి చేసుకుంటే తప్పేమిటని అన్నారు. పవన్‌పై బురద జల్లడానికి ఏ కారణాలూ లేక ఇలాంటి విమర్శలు చేస్తున్నారని, నోరు జాగ్రత్త పెట్టుకుంటే మంచిదని అన్నారు. పవన్‌ను చంద్రబాబుకు దత్తపుత్రుడని, ప్యాకేజీ స్టార్ అని విమర్శిస్తున్నారని, అలాగైతే మీరు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దత్తపుత్రుడా అని అన్నారు. 2019 ఎన్నికల్లో ఓటర్లను కొనుక్కునేందుకు కోట్లాది రూపాయలు ప్యాకేజీ తీసుకుని ఆంధ్రప్రదేశ్‌ను తెలంగాణకు తాకట్టు పెట్టలేదా అని ప్రశ్నించారు. మీ తాత రాజారెడ్డి దగ్గర నుంచి మీ వరకూ కుటుంబం అందరికీ దోచుకోవడం, దాచుకోవడం అలవాటే కదా, కాదని చెప్పే దమ్ము మీకుందా అని ప్రశ్నించారు. మీ అందరి అవినీతి చిట్టా మరోసారి ప్రజల ముందుకు తీసుకురమ్మంటారా అని అన్నారు. ఎదుటివారిని ఒక మాట అని వారితో పది మాటలు అనిపించుకోవడం ఏ సలహాదారులు నేర్పుతున్నారని ప్రశ్నించారు. ఇలాంటి తప్పుడు సలహాలు ఇచ్చి మిమ్మల్ని ముంచుతున్నారని అనిపిస్తోందని ఆ లేఖలో పేర్కొన్నారు.

సంచలనం కోసం అడ్డమైన వాగుడు మంచిది కాదు

- మాజీ మంత్రి చేగొండికి మంత్రి అమర్‌నాథ్ బహిరంగ లేఖ
- బాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌పై చేగొండిది ధృతరాష్ట్రుడి ప్రేమ
- పవన్ పుట్టింది బాబు కోసం.. పెరిగేది ఎల్లో మీడియా కోసమే
- పవన్ నిర్మాతలంతా బాబు మనుషులే
- పవన్ సాంగత్యంతో చేగొండి చెత్త ఉత్తరాలు రాస్తున్నారు
- స్వాతి చౌదరితో పోటీ పడుతున్నారు
- జోగయ్య కూడా మరో ప్యాకేజీ స్టార్ అవుతున్నారు
- బాబుని, బాబు మీడియాని సంతోషపరిచేలా చీప్ ట్రిక్స్ చేస్తున్నారు



సాక్షి, విశాఖపట్నం: సంచలనం కోసం, చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌పై ధృతరాష్ట్రుడి ప్రేమతో మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య వయస్సును కూడా మరిచి సీఎం జగన్‌పై దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది మంచిది కాదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. హరిరామ జోగయ్య సీఎంకు రాసిన లేఖకు స్పందిస్తూ మంత్రి అమర్‌నాథ్ మంగళవారం బహిరంగ లేఖ రాశారు. తన తండ్రి గురునాథరావుతో జోగయ్యకు ఉన్న పరిచయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన కుమారుడిగా ఇలాంటి ఉత్తరం రాస్తున్నందుకు బాధగానే ఉన్నదని, అయినా తప్పలేదని ఆ లేఖలో పేర్కొన్నారు. వయస్సు పెరిగేకొద్దీ సంస్కారం, జ్ఞానం పెరుగుతుంటాయని పెద్దలు అంటారని, కానీ జోగయ్య విషయంలో అందుకు విరుద్ధంగా ఉందని అన్నారు. పవన్ సాంగత్యంతో చెత్త ఉత్తరాలు ప్రజల మీదకు వదిలి జోగయ్య కూడా స్వాతిరెడ్డి అలియాస్ స్వాతిచౌదరితో పోటీ పడుతున్నట్లు తెలుస్తోందన్నారు. సంచలనం కోసం అడ్డమైన వాగుడువాగి, మీడియాకి, సోషల్ మీడియాకి, పచ్చ బ్యాచ్‌కు మేత అందించే దిగజారుడుతనం పగవాడికి కూడా రాకూడదని కోరుకుంటున్నానన్నారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడైన పవన్ మీద ధృతరాష్ట్రుడి ప్రేమ ఉంటే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. పవన్ పుట్టిందే బాబు కోసమని, పెరుగుతున్నదే ఎల్లో మీడియా కోసమని, పవన్ నిర్మాతలంతా బాబు మనుషులేనని చెప్పారు. జోగయ్య కూడా మరో ప్యాకేజీస్టార్ కావడానికి బాబుని, బాబు మీడియాని, బాబు వర్గాన్ని సంతోషపరిచేలా చీప్ ట్రిక్స్‌కి పాల్పడుతున్నారన్నారు. జోగయ్య పట్ల వ్యక్తిగతంగా ఎటువంటి శత్రుత్వం లేదని, ఆయన రాతలు, భావాలు పరిశీలిస్తే దిగజారుడుతనాన్ని స్పష్టంగా సూచిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఆయన పద్ధతి బాగుందో లేదో ఆయన పిల్లల్ని, శ్రేయోభిలాషులను కనుక్కుని విచక్షణతో, విజ్ఞతతో వ్యవహరించాలని మంత్రి ఆ లేఖలో పేర్కొన్నారు.

ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురందేశ్వరి

- బీజేపీ అధిష్టానం ఉత్తర్వులు
- అధ్యక్ష బాధ్యతల నుంచి సోము వీర్రాజు తొలగింపు
- ప్రస్తుతం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పురందేశ్వరి
- జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి/కారంచేడు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరి నియమితులయ్యారు. సంస్థాగతంగా పలు రాష్ట్రాల్లో చేసిన మార్పుల్లో భాగంగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పురందేశ్వరిని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలిగా బీజేపీ నియమించింది. ఇప్పటివరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సోము వీర్రాజుకు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్వయంగా ఫోన్ చేసి బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. కాగా, బీజేపీలో చేరిన ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ టీడీపీకి దగ్గరవుతుందన్న ఊహాగానాల నేపథ్యంలో పురందేశ్వరి నియామకం రాజకీయవర్గాల్లో చర్చకు దారి తీసింది.

జాతీయ ప్రధాన కార్యదర్శి నుంచి రాష్ట్ర అధ్యక్షురాలిగా

దగ్గుబాటి పురందేశ్వరి 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే సంవత్సరం బాపట్ల ఎంపీగా పోటీ చేసి సినీ నిర్మాత దగ్గుబాటి రామానాయుడుపై గెలుపొందారు. 2006లో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచే విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసి విజయం సాధించారు. యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర సహాయ మంత్రిగా 2013 వరకు పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 ఎన్నికలకు ముందు బీజేపీలో చేరి రాజంపేటలో పోటీ చేసి ఓడిపోయారు. 2020 సెప్టెంబర్ 26న పురందేశ్వరిని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బీజేపీ అధిష్టానం నియమించింది. 2020 నవంబర్‌లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా ఆమెకు బాధ్యతలు అప్పగించింది. కానీ రాష్ట్ర వ్యవహారాల్లో అధిష్టానం అంచనాలను పురందేశ్వరి అందుకోలేకపోయారన్న విమర్శలు పార్టీలో ఉన్నాయి. దీంతో ఆమెకు ఒడిశా బాధ్యతల్లో కోత విధించింది. 2022 సెప్టెంబర్ 9న ఛత్తీస్‌గఢ్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి బాధ్యతల నుంచి కూడా పురందేశ్వరిని తప్పించింది. అప్పటి నుంచి ఆమె కేవలం జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలోనే ఉన్నారు. ఏపీలో తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా అవకాశం ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సోము వీర్రాజుపై వచ్చిన ఫిర్యాదులు, ఎన్టీఆర్ చరిష్మాను తమకు అనుకూలంగా మార్చుకోగలమనే భావనతో బీజేపీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. పురందేశ్వరిని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మంగళవారం ఒక ప్రకటనలో అభినందించారు.

ఆగస్టులో విశాఖకు కేంద్ర ఎన్నికల అధికారుల రాక



మహారాణిపేట: కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఆగస్టు 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తారని విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. విశాఖలో మంగళవారం ఎన్నికల ఏఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులకు 'స్పెషల్ సమ్మరీ రివిజన్–2024'పై రెండురోజుల శిక్షణను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నామినేషన్లకు 10 రోజుల ముందు వరకు ఓటర్ల కు సంబంధించి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.

నగరి కోర్టుకు హాజరైన జీవిత



నగరి(చిత్తూరుజిల్లా): ప్రముఖ నటి, దర్శకురాలు జీవిత రాజశేఖర్ మంగళవారం నగరి కోర్టుకు హాజరయ్యారు. గరుడవేగ చిత్ర నిర్మాణానికి గానూ జరిగిన ఆర్థిక లావాదేవీల్లో నటి జీవిత అందించిన చెక్కులు బౌన్స్ అయ్యాయంటూ నగరి నియోజకవర్గం విజయపురం మండలం, మహారాజపురంలోని సాయిశక్తి ఇంజినీరింగ్ కళాశాల యజమాని కోటీశ్వర్ రాజు భార్య హేమరాజు నగరి కోర్టులో కేసు వేసిన సంగతి విదితమే. ఈ కేసు 19 నెలల నుంచి నగరి కోర్టులో నడుస్తోంది. ఫైనాన్సియర్ హేమరాజు తరఫున విచారించాల్సిన సాక్ష్యాలను విచారించారు. నటి జీవిత రాజశేఖర్ తరపు సాక్ష్యాలను విచారించాల్సి ఉంది. కేసును జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ విష్ణువర్మ ఈనెల 19వ తేదీకి వాయిదా వేశారు.



నీకు ఏం జరుగుతుందనే భయం వద్దు. ఎవ్వరి మీదా ఆధారపడవద్దు. మన మొత్తం అస్తిత్వపు రహస్యం భయం లేకుండా ఉండటం.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 5 జూలై 2023

మూలానికి మందు వేయాలి!

ఒకటి కాదు రెండు కాదు... ఇప్పటికి ఎనిమిది రోజులు. ఫ్రాన్స్ తగలబడుతూనే ఉంది. ప్యారిస్‌కు సమీపంలో ట్రాఫిక్ సిగ్నల్ అతిక్రమించినందుకు కారు ఆపమన్నప్పుడు ఆపని పాపానికి, డ్రైవింగ్ లైసెన్స్ లేని నేరానికి 17 ఏళ్ళ నల్లజాతి టీనేజర్‌ను ఓ పోలీసు అతి సమీపం నుంచి తుపాకీతో కాల్చి చంపిన వీడియో ప్రజాగ్రహం పెల్లుబికేలా చేసింది. పాశవిక చర్యకు పాల్పడ్డ పోలీసుపై సరైన చర్య తీసుకోకపోవడం అల్లర్లకు దారి తీసినట్టు పైకి కనిపిస్తున్నా, లోలోపల ఫ్రాన్స్‌ను పీడిస్తున్న అనేక అంశాలున్నాయి. ఆఫ్రికన్, అరేబియన్ మూలాలున్న నల్ల జాతీయులు, నిరుపేదలు ఏళ్ళ తరబడిగా ఎదుర్కొంటున్న జాతివివక్ష ఇలా విస్ఫోటించింది. యువత వీధుల్లోకొచ్చి కార్లు తగలబెట్టి, బడులు, ఆస్పత్రులు, పోలీస్ స్టేషన్లపై దాడి చేసి, దుకాణాల్ని లూటీ చేసే పరిస్థితి తెచ్చింది. 2018 నాటి 'ఎల్లో వెస్ట్స్' నిరసనల తర్వాత ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌ను ఎన్నడెరుగని రాజకీయ సంక్షోభంలోకి నెట్టింది. శాంతిభద్రతల పునరుద్ధరణకు వేలాది భద్రతా సిబ్బందిని బరిలోకి దింపడం సరే కానీ, ఆర్థిక – సామాజిక అసమానతల కేంద్రంగా మారిన ఆ దేశం చేయాల్సిన అసలు పని వేరే ఉంది.

సంపన్న సాంస్కృతిక వారసత్వం, చైతన్యశీలతతో ఒకప్పుడు ప్రశాంతంగా ఉండే ఫ్రాన్స్ ఇప్పుడు వీధుల్లోకి విస్తరించిన అసంతృప్తికీ, హింసాత్మక ప్రదర్శనలకూ కేంద్రమవడం గమనార్హం. ప్యారిస్ మొదలు అనేక చోట్లకు విస్తరించిన తాజా అల్లర్లే అందుకు నిదర్శనం. మెక్రాన్ సత్వరమే రంగంలోకి దిగి, పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అల్జీరియన్ సంతతికి చెందిన టీనేజర్ నహేల్ హత్య అంగీకారయోగ్యం, క్షమార్హం కాదంటూనే, మూక దాడులు, విధ్వంసం సైతం సమర్థనీయం కావన్నారు. ఆయన మాటలు పాలనా యంత్రాంగానికి దిశా నిర్దేశమే. అల్లర్లు అదుపులోకి వచ్చాక పాలకులకూ, ప్రజలకూ మధ్య చర్చకు ఆ మాటలు ఉపకరిస్తాయి. కానీ, మాటలొక్కటే సరిపోవు. 2011లో బ్రిటన్ నుంచి 2013లో అమెరికాలో 'బ్లాక్‌లైవ్స్ మేటర్' ఉద్యమం దాకా పాశ్చాత్య దేశాల్లో జాతివివక్ష పోలీసు దౌర్జన్యాలపై అల్లర్లు పదేపదే జరుగుతూనే ఉన్నాయనేది చరిత్ర పాఠం.

ఫ్రాన్స్‌లో పోలీసులు ఆదేశించినప్పుడు వాహనం ఆపకున్నా, బెదిరించినా ఆ వాహన చోదకుణ్ణి నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేసేందుకు చట్టాలు అనుమతిస్తున్నాయి. 2017లో చేసిన సవరణ అలాంటి అపరిమిత అధికారం పోలీసులకు కట్టబెట్టింది. ట్రాఫిక్ జంక్షన్ల వద్ద ఇలాంటి పోలీసు కాల్పులు, మరణాలు సంభవించడం ఈ ఏడాదిలో ఇది మూడోసారి. గత ఏడాది ఇలాంటివి 13 జరిగాయట. ఇన్నేళ్ళలో ఈ బాధితుల్లో అత్యధికులు నల్లజాతి వారే. గీత దాటితే శిక్షించాల్సిందే కానీ, కాల్చి చంపేందుకు అనుమతించడం దారుణం. ఈ చట్టాన్ని ఫ్రాన్స్ తక్షణం రద్దు చేయాలి. పోలీస్ దౌర్జన్యం, పాలనాపరమైన దీర్ఘకాలిక నిర్లక్ష్యం, వర్గ అసమానతలనేవి ఇవాళ ఫ్రాన్స్ సహా ప్రజాస్వామ్య ప్రపంచంలో అనేక ప్రాంతాలను దీర్ఘకాలంగా పీడిస్తున్న అంశాలు. సత్వరం దృష్టి పెట్టాల్సిన సమస్యలు.

ఫ్రాన్స్‌లో పట్టణాలు, నగరాల చుట్టూ శివార్లలో అల్పాదాయ వర్గాల గృహసముదాయాలైన 'బాన్ల్యూ'లు ఉంటాయి. ఒకప్పటి ఫ్రెంచ్ వలస దేశాల శరణార్థులు ప్రధానంగా ఉండే ప్రాంతాలివి. ఈ శివారు నివాస సముదాయాల, అక్కడి పరదేశీయుల కష్టనష్టాలను నివారించడం కీలకం. 2021 నాటి అంచనా ప్రకారం ఫ్రాన్స్‌లో 10.3 శాతం మంది వలస జనాభానే. అత్యధికులు అల్జీరియా, మొరాకో, ట్యునీసియాల నుంచి వచ్చినవారు. ఫ్రాన్స్ శ్రామికశక్తిలో వీరిది ప్రధాన పాత్ర. అలాగే, దేశానికి వన్నె తెచ్చే ఫుట్‌బాల్‌లోనూ వీరి ప్రతిభ వెలుగులీనుతోంది. అయినప్పటికీ అనేక యూరోపియన్ దేశాల లానే ఫ్రాన్స్ సైతం ఈ వలసదారుల్ని తమలో కలుపుకోవడంలో విఫలమవుతోంది. చట్ట సంస్థలు ఇప్పటికీ వీరిని అనుమానంగానే చూడడం విచారకరం. ఆ మాటకొస్తే, ఈ శరణార్థుల సంక్షోభానికి మానవీయ పరిష్కారం కనుగొనడంలో దేశాలన్నీ విఫలమయ్యాయి. అది విషాదం.

జీవన ప్రమాణాలు ఉన్నతంగా ఉండే ఫ్రాన్స్‌లో సమాజంలో వేర్వేరు వర్గాల మధ్య అంతరాలూ అంతే ఎక్కువ. సంపద పంపిణీలో, అవకాశాల్లో భారీ తేడా నెలకొంది. నిరుద్యోగం, పెరుగుతున్న జీవన వ్యయం, లోకువగా చూస్తూ అణచివేయడం వగైరాలన్నీ వలసదారుల్లో ఆశాభంగం, ఆగ్రహం కలిగించి, అలజడి రేపుతున్నాయి. ఇవాళ ఫ్రాన్స్ సహా అనేక దేశాల్లో రాజకీయ, సామాజిక చీలికలకు ఇవి ప్రధాన కారణం. అణగారిన ప్రజలు సామాజిక అసమానత, ఆర్థిక అసంతృప్తితో తమ బాధల్ని పాలకుల దృష్టికి తీసుకురావడానికి అల్లర్లను సాధనంగా ఎంచుకుంటున్నారు. జాతి వివక్షతో పోలీసులు జరుపుతున్న దాష్టీకం మారాలని కోరుతున్నారు. సమాజంలో లోతుగా పాతుకుపోయిన ఈ అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. పౌర సమాజం, ప్రజలు సమగ్ర పరిష్కారానికి చేయూత నివ్వాలి.

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలే మూలస్తంభాలనే పరిణత ప్రజాస్వామ్యమైన ఫ్రాన్స్‌లోనే పరిస్థితి తద్విరుద్ధంగా ఉండడం చేదు నిజం. అక్కడి పరిణామాలు ఇతర ప్రజాస్వామ్య దేశాలకు కనువిప్పు. వివిధ జాతులు, మతాలు, వర్ణాలు, వర్గాలతో వైవిధ్యభరితమైన ప్రజానీకమున్న దేశాలు ఆ విభిన్న ప్రజానీకపు అవసరాలు, ఆకాంక్షలకు తగ్గట్టు వ్యవహరించాలి. ప్రభుత్వ సంస్థల విధి విధానాలను అందుకు తగినట్టు మార్చుకోవాలి. పాలనలో దీన్ని తక్షణ ప్రాధాన్యంగా పెట్టుకోవాలి. లేదంటే, ఇవాళ ఫ్రాన్స్‌లో జరిగినట్టే రేపు తమ దేశంలో జరగదన్న గ్యారెంటీ ఏమీ లేదు. వివక్ష పెంచిన సామాజిక ఉద్రిక్తతలతో చేతులు కాలకముందే మేల్కోవడం వివేకవంతులైన పాలకుల లక్షణం!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి: బ.విదియ ప.1.04 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ.8.56 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం: ప.12.37 నుండి 2.07 వరకు, దుర్ముహూర్తం: ప.11.36 నుండి 12.31 వరకు, అమృతఘడియలు: రా.9.34 నుండి 11.02 వరకు.

సూర్యోదయం: 5.33
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే ఆర్డినెన్స్

విశ్లేషణ



జస్టిస్ మదన్ బి లోకూర్

'ఢిల్లీ ఆర్డినెన్స్' పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. జాతీయ రాజధాని ప్రాంత ప్రభుత్వ (సవరణ) చట్టం, 2023, ఢిల్లీలో పరిపాలనా రూపాన్ని మారుస్తుంది. ఈ ఆర్డినెన్స్, స్పష్టమైన కారణం లేకుండా, 'సేవలకు' సంబంధించి అధికారాలను వినియోగించుకునే వీలును ఢిల్లీ ప్రభుత్వానికి లేకుండా చేస్తోంది. దీనికి బదులుగా, ఇది భారత ప్రభుత్వానికి అపరిమిత అధికారాన్ని ఇచ్చింది. పైగా ఢిల్లీ ముఖ్యమంత్రిని, మంత్రులను రబ్బర్ స్టాంప్ కంటే తక్కువ స్థాయికి కుదించింది. దీంతో ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వం చుక్కాని లేనిదిగా మిగిలిపోయింది. పైగా, ప్రజల అభీష్టం అనేది ఏ మాత్రం విలువ లేనిదిగా మారిపోయింది. ఈ పరిస్థితుల్లో ఢిల్లీ పాలన ఎలా ఉంటుందనేది ఆశ్చర్యంగానే ఉంది. అంబేడ్కర్, సుప్రీంకోర్టు అభిప్రాయాలను కలిపి చదివినట్లయితే, దురదృష్టవశాత్తు ఆర్డినెన్స్ రాజ్యాంగ నైతికతను విస్మరించిందని స్పష్టమవుతోంది.

బాబాసాహెబ్ అంబేడ్కర్ 1948 నవంబర్ 4న రాజ్యాంగ సభలో రాజ్యాంగ నైతికత గురించి ప్రసంగించారు. ఆయన ఇలా అన్నారు: ''ప్రజాస్వామ్య రాజ్యాంగం శాంతియుతంగా పనిచేయడానికి రాజ్యాంగ నైతికత వ్యాప్తి ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించినప్పటికీ, దానితో పరస్పరం అనుసంధానితమైన రెండు అంశాలను దురదృష్టవశాత్తు సాధారణంగా గుర్తించలేదు. ఒకటి, పరిపాలనా రూపానికి రాజ్యాంగ రూపంతో దగ్గరి సంబంధం ఉంది. రెండోది, దాని రూపాన్ని మార్చకుండా కేవలం పరిపాలనా రూపాన్ని మార్చడం ద్వారా రాజ్యాంగాన్ని వక్రీకరించగలగడం. ఇలా చేయడం ద్వారా రాజ్యాంగాన్ని అస్థిరపర్చి, రాజ్యాంగ స్ఫూర్తిని వ్యతిరేకించడం కచ్చితంగా సాధ్యమవుతుంది.''

ఇంత తొందరేల?

జాతీయ రాజధాని ప్రాంత ప్రభుత్వ (సవరణ) చట్టం, 2023, ఢిల్లీలో పరిపాలనా రూపాన్ని మారుస్తుంది. అలాగే ఇది రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లేదు. ఆర్డినెన్స్ రాజ్యాంగ చెల్లుబాటును సుప్రీంకోర్ట్ నిర్ణయిస్తుంది. పైగా దాని ప్రస్తుత రూపాన్ని సవాలు చేసినప్పుడు, 1991లో జాతీయ రాజధాని ప్రాంత ప్రభుత్వ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి కనీసం ఢిల్లీలో అమలులో ఉన్న పరిపాలనా రూపాన్ని అది అధిగమిస్తుందనడంలో సందేహం లేదు.

ఒక మార్పు తీసుకురావడంలో ఇంత తొందరపాటు అవసరమా? రాజ్యాంగం ఇచ్చిన అసాధారణ అధికారాన్ని వినియోగించుకోవాల్సిన తక్షణ అవసరం ఉందా? ఢిల్లీ ప్రభుత్వంతో కలిసి పనిచేసే అధికారుల నియామకం, నియంత్రణకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వానికీ, భారత ప్రభుత్వానికీ మధ్య ఉన్న వివాదాన్ని, ఆర్డినెన్స్ ప్రకటించడానికి కేవలం ఒక వారం ముందు సుప్రీంకోర్టు పరిష్కరించింది. రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా ఢిల్లీ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చింది.

అంతకుముందు, రెండు ప్రభుత్వాల మధ్య జరిగిన వివాదంలో, సుప్రీంకోర్టు (2018) రాజ్యాంగ నైతికతను ఈ పదాలలో ప్రస్తావించింది. ''రాజ్యాంగ నైతికత అనేది ఉన్నత స్థాయి సిబ్బందిపై, పౌరులపై ఒక ముఖ్యమైన తనిఖీ వ్యవస్థగా పనిచేస్తుంది. అపరిమితమైన శక్తిని కలిగివుండి, ఎటువంటి తనిఖీలు, నియంత్రణలు లేకపోతే ప్రజాస్వామ్య ఆలోచనకు విరుద్ధమైన నిరంకుశ పరిస్థితి ఏర్పడుతుంది. అదే మొత్తం ప్రజాస్వామ్య భావనకే విరుద్ధమైనది.''

కాలు చేతులు లేకుండా...

ఈ ఆర్డినెన్స్, స్పష్టమైన కారణం లేకుండా, 'సేవలకు' సంబంధించి అధికారాలను వినియోగించుకునే వీలును ఢిల్లీ ప్రభుత్వానికి లేకుండా చేస్తోంది. దీనికి బదులుగా, ఇది భారత ప్రభుత్వానికి అపరిమిత అధికారాన్ని ఇచ్చింది. పైగా ఢిల్లీ ముఖ్యమంత్రిని, మంత్రులను రబ్బర్ స్టాంప్ కంటే తక్కువ స్థాయికి కుదించింది.



ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా

అంబేడ్కర్, సుప్రీంకోర్టు అభిప్రాయాలను కలిపి చదివినట్లయితే, దురదృష్టవశాత్తు ఆర్డినెన్స్ రాజ్యాంగ నైతికతను విస్మరించిందని స్పష్టమవుతుంది.

ఇతర నిబంధనలను చూస్తే, ఆర్డినెన్స్ ఢిల్లీ ముఖ్యమంత్రి అధ్యక్షతన ఒక అథారిటీని ఏర్పాటు చేసే వీలు కల్పిస్తుంది. దీనిని నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీ అని పిలుస్తారు. ఈ అథారిటీకి పబ్లిక్ ఆర్డర్, పోలీస్, ల్యాండ్, అంటే భారత రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లోని జాబితా పరిధిలోకి వచ్చే ఎంట్రీలు కాకుండా, ఢిల్లీ ప్రభుత్వ వ్యవహారాల్లో పనిచేస్తున్న గ్రూప్-ఏ అధికారులకు సంబంధించి హాస్యాస్పదమైన సిఫార్సులు చేసే అధికారాలు మాత్రమే ఉన్నాయి. అథారిటీకి ముఖ్యమంత్రి అధ్యక్షత వహించినప్పటికీ, సీనియర్ బ్యూరోక్రాట్‌లుగా ఉన్న మరో ఇద్దరు అధికార సభ్యులు ముఖ్యమంత్రిని తోసిరాజనవచ్చు.

అందువల్ల, ముఖ్యమంత్రి పేరుకు నామమాత్రపు అధిపతి. పైగా ఆయన ఢిల్లీ ప్రజల ఎన్నికైన ప్రతినిధి అయినప్పటికీ, ఆయన కేవలం సున్నాకు తగ్గించబడ్డారు. అంతే కాకుండా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నరుకి అథారిటీ సిఫార్సును ఆమోదించాల్సిన అవసరం లేదు.

ప్రజాభీష్టం మాటేమిటి?

మరొక క్రూరమైన కోత ఏమిటంటే, సాక్షాత్తూ మంత్రుల మండలి అభిప్రాయాలను ఒక కార్యదర్శి నిరోధించగలగడం. అప్పటికి అమలులో ఉన్న చట్టానికి అనుగుణంగా మంత్రుల మండలి అభిప్రాయం లేకపోతే గనక, తానుగా ఒక అభిప్రాయాన్ని ఏర్పరుచుకోగలిగే అధికారం ఈయనకు దఖలు పడింది.

పైగా ఆ అభిప్రాయాన్ని ఆయన తప్పనిసరిగా లెఫ్టినెంట్ గవర్నర్ దృష్టికి తెచ్చి, దానిమీద ఆయన నిర్ణయాన్ని తీసుకునే వీలు కల్పిస్తాడు. మరో మాటలో చెప్పాలంటే, మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాల చట్టబద్ధతను పరీక్షించే ఇన్విజిలేటర్ లేదా ఎగ్జామినర్ పాత్రను కార్యదర్శి స్వీకరిస్తాడు. కాబట్టి ముఖ్యమంత్రి పాత్ర శూన్యంగా మారిపోవడమే కాకుండా, మంత్రి మండలి కూడా ఆ స్థాయికి దిగజారిపోతుంది. ఈ పరిస్థితుల్లో ఢిల్లీ పాలన ఎలా ఉంటుందనేది ఆశ్చర్యంగానే ఉంది.

ఆర్డినెన్స్ ద్వారా న్యాయం ప్రభావితం అవుతుందా? అవును, ఆర్డినెన్స్‌లోని సెక్షన్ 45 డి ప్రకారం, ఏదైనా కమిషన్, చట్టబద్ధమైన అధికార వ్యవస్థ, బోర్డు, కార్పొరేషన్‌లో ఎవరైనా ఛైర్‌పర్సన్, సభ్యుడు లేదా ఆఫీస్ బేరర్‌ను నియమించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. అంటే తద్వారా భారత ప్రభుత్వానికి ఆ అధికారం ఉంటుంది. పర్యవసానంగా, ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ఢిల్లీ మహిళా కమిషన్, ఢిల్లీ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఛైల్డ్ రైట్స్, ఢిల్లీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ మొదలైన వాటితో సహా పాక్షిక-న్యాయ అధికారాలను అమలు చేసే చట్టబద్ధమైన సంస్థల నియామకాన్ని భారత ప్రభుత్వమే చేపడుతుంది. ఇది బాలల హక్కులు, స్త్రీల హక్కులు, రవాణా, నీరు, విద్యుత్ మొదలైన రంగాలకు విస్తరించింది. ప్రభావవంతంగా, ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వం చుక్కానిలేనిదిగా మిగిలిపోయింది. పైగా, ప్రజల అభీష్టం అనేది ఏమాత్రం విలువ లేనిదిగా మారిపోయింది.

ఆర్డినెన్స్ ఆమోదం పొందిన నేపథ్యంలో, సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన ఏకగ్రీవ తీర్పును రద్దు చేయడమే ఆర్డినెన్స్ ఉద్దేశ్యం, లక్ష్యం అని చాలా స్పష్టంగా అర్థమవుతోంది. ఈ ఆర్డినెన్స్ ఢిల్లీ ప్రజలపై, దాని ఎన్నికైన ప్రజాప్రతినిధులపై, రాజ్యాంగంపై కూడా రాజ్యాంగ వంచన రూపంలో వచ్చింది.

ఈ మొత్తం కసరత్తు బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని ఆవాహన చేసుకోవడం, ''ప్రజాస్వామ్య రాజ్యాంగం శాంతియుతంగా పనిచేయడానికి రాజ్యాంగ నైతికత విస్తరణ ఆవశ్యకతను'' అంగీకరించడంలో పొరబడ్డారా అనే ఆశ్చర్యానికి దారి తీస్తుంది.

వ్యాసకర్త సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మళ్లీ మొదలెట్టాలి



ఒక్కసారి బీజేపీ వెళ్లిపోతే, ఈ దేశం, దాని విలువల ప్రమాణాలు, దాని సంస్థలు అన్నింటినీ పునాది నుంచి నిర్మించుకుంటూ రావాల్సి ఉంటుంది. వాళ్లు ప్రతిదాన్నీ విషపూరితం చేశారు.
– అర్పితా ఛటర్జీ, సినిమా రచయిత్రి

నేరపూరితం



శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత దౌత్య కార్యాలయం మీద శనివారం జరిగినట్టు తెలిసిన దాడి, దహన ప్రయత్నాలను యునైటెడ్ స్టేట్స్ తీవ్రంగా ఖండిస్తోంది. దౌత్య కార్యాలయాలు, విదేశీ దౌత్యవేత్తలకు వ్యతిరేకంగా జరిగే విధ్వంసం, లేదా హింస అమెరికాలో నేరపూరిత చర్య.
– మాథ్యూ మిల్లర్, అమెరికా విదేశాంగ ప్రతినిధి

వాడకూడని మాట



ఖలిస్తాన్ అనేదే లేనప్పుడు ఖలిస్తానీ అనే మాటను ఎలా వాడుతున్నారు? వాళ్లను అతివాదులు అనండి, మిలిటెంట్లు అనండి, వేర్పాటువాదులు అనండి. వాళ్లను ఏమైనా అనండి కానీ ఖలిస్తానీ అనొద్దు. అసంభవం అయినదానికి లేనిపోని చట్టసమ్మతి కల్పించవద్దు.
– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

దార్శనికుడు



పాఠం చెప్పడం కోసం టాగూర్ నవల 'గోరా'ను మళ్లీ చదువుతున్నాను. కొన్ని వాక్యాలైతే ఇప్పటి కాలం గురించి భవిష్యత్ దర్శనం చేసి రాసినట్టుగా ఉన్నాయి. అతివాద హిందూయిజం, కుల విభేదాలు, సామాజిక సంస్కరణలు, లింగ రాజకీయాలు! తన కాలానికి ఎంతో ముందున్న మనిషి ఆయన.
– అమృతా ఘోష్, అసిస్టెంట్ ప్రొఫెసర్

వీటికీ రుజువులా?



అంటే... కొబ్బరినీళ్లు ఆరోగ్యానికి మంచివి కావు, పసుపు వేసిన పాలు ఆరోగ్యానికి మంచివి కావు; ఎందుకంటే దానికి 'రుజువులు' లేవు కాబట్టి! అలాగే డైట్ కోక్ ఆరోగ్యానికి చెడ్డది కాదు; ఎందుకంటే దానికి కూడా 'రుజువు' లేదు కాబట్టి! కొంతమంది కనీస ఇంగితం లేకుండా మాట్లాడుతుంటారు.
– శివమ్ దా, క్యాన్సర్ స్పెషలిస్ట్

ఖాళీ లేదు



ముస్లింలకు అద్దెలు ఇవ్వడానికి ఇష్టపడని వాళ్ల సంఖ్య భయపెడుతోంది, నిరాశ కలిగిస్తోంది. అది కూడా రాజధాని నగరంలోని కులీన ప్రాంతాల్లో. పైగా వీళ్లంతా బాగా చదువుకున్నవారు. బ్రోకర్లు, వాళ్ల సహాయకుల ద్వారా అద్దెకు దిగేవాళ్ల మతం ఏమిటో నిర్ధరించుకుంటారు. వాళ్ల నుంచి మనం వినేదల్లా 'సారీ' మాత్రమే!
– జిన్నీ తస్‌కీన్, జర్నలిస్ట్

అదీ కారణం



ముంబయికి మేము మారినప్పుడు ముస్లింలం అయిన కారణంగా ఇల్లు దొరకని విషయం పట్ల మా 'చాచీ(చిన్నమ్మ)' ఇప్పటికీ కోపంగా ఉంటుంది. అల్హమ్దులిల్లాహ్ (అల్లాను శ్లాఘిస్తూ)! ఇప్పుడు మేము ఓనర్ల మయ్యాం. కానీ మేము కూడా అద్దెకు ఇవ్వడానికి హిందువులనే ఇష్టపడతాం. అద్దె సమయానికి వస్తుంది; ఆయుధాలు, మిలిటెంట్లు, మేకలు దాగివున్నాయేమో అనే భయం ఉండదు.
– యానా మీర్, మీడియా ప్యానెలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఎంతకాలం ఈ అన్యాయం?

అభిప్రాయం



శ్రీనివాస్ తిపిరిశెట్టి

కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లను అర్హులైనవారందరికీ అందించడంలో విఫలమవుతోంది. ముఖ్యంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న వెనుకబడిన కులాల (బీసీ)వారిని ఇతర వెనుకబడిన కులాలు (ఓబీసీ)లుగా గుర్తించడంలో తగినంత శ్రద్ధ చూపడం లేదు. దీంతో రాజ్యాంగం, చట్టాలు ప్రసాదించిన హక్కును ఇప్పటికీ వేలాది వెనుకబడిన కులాలు పొందలేక పోతున్నాయి. ఆ మేర వారు మరింత వెనుకబడి పోతున్నారు. ఇంకో గుండెలు బరువెక్కే నిజం ఏమిటంటే... ఇలా కేంద్రం బీసీలుగా గుర్తించని కులాల్లో ఎక్కువ మంది ఆశ్రిత కులాలవారే. అంటే వీరు ఏదో ఒక కులం వారిపై ఆధారపడి బతుకుతూ ఉంటారు. ఊళ్ల వెంట తిరుగుతూ ఆయా కులాలవారి చరిత్ర, గోత్రాలు చెబుతూ... వారిచ్చే కొద్దిపాటి ధాన్యం, డబ్బులతో బతుకు వెళ్లదీస్తూ ఉంటారు. అంటే వీరు సంచార జాతులవారన్నమాట. కాలంతో పాటూ ఆచార, సంప్రదాయాలూ మారిపోవడంతో ఇప్పుడు కుల గోత్రాల చరిత్ర, వారి కథలు చెప్పించుకునేవారు తగ్గిపోవడంతో ఈ ఆశ్రిత కులాల వారు జీవనోపాధిని పూర్తిగా కోల్పోయారు. అందుబాటులో ఉన్న పనిచేసుకుంటూ అర్ధ సంచార జీవులుగా బతుకుతున్నారు. కులవృత్తికి దూరమైనా వీరికి ఉన్న సామాజిక, ఆర్థిక హోదాలు ఏమాత్రం మారలేదు.

ఇటువంటి కులాలవారు దేశంలో చాలా ఉన్నట్లే మన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనూ ఉన్నాయి. వాటిలో కొన్నే ఓబీసీ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. తెలంగాణలోని 40 కులాలతో కలిపి దేశ వ్యాప్తంగా దాదాపు 3867 వెనుకబడిన కులాలకు కేంద్ర ఓబీసీ జాబితాలో చోటు దక్కలేదనేది ఒక అంచనా. నిజానికి ఈ సంఖ్య మరింత ఎక్కువగానే ఉండవచ్చు. ఓబీసీ జాబితాలో చోటు దక్కని తెలంగాణ రాష్ట్రానికి చెందిన 40 కులాల వారితో 2021 డిసెంబర్ 21 నుంచి 24 తేదీ వరకు 'జాతీయ బీసీ కమిషన్' ఢిల్లీ కార్యాలయంలో సంభాషించింది. ఆ సందర్భంగా ఈ కులాలన్నిటినీ ఓబీసీ జాబితాలో చేర్చుతామనీ, ఇందుకు సంబంధించిన విచారణ నివేదికను భారత సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖకు పంపుతామనీ జాతీయ బీసీ కమిషన్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యుల బృందం హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు ఈ కులాలవారిని ఆ జాబితాలో చేర్చలేదు.

తెలంగాణలో బుక్క అయ్యవారు, గోత్రాల, బొందిలి, ఆరె మరాఠీ, ఆరె, అఘుముడియార్, సుంది, వారాల, సిస్టకరణ, వీరశైవ లింగాయత్, అచ్చుకట్ల వారు, అద్దపువారు, బాగోతుల, బైలు కమ్మర, ఏనూటి, గంజికూటి, గౌడజెట్టి, కాకిపడిగల, పటంవారు, ఓడ్, సన్నాయిల, శ్రీ క్షత్రియ రామజోగి, బైకాని/తెరచీరల, తోలుబొమ్మలవారు, ఆహీర్ యాదవ్, గౌలి, కుల్లకడిగి, అత్తర్ సాయిబ్‌లు, దోబీ ముస్లిం, పఖ్కీర్ సాయిబ్‌లు, గారడీ ముస్లిం, గోసంగి ముస్లిం, గుడ్డెలుగులవారు, నాయీ ముస్లిం, లబ్బాయి పకీర్లు, తురుక కాశా, సరోళ్ల వంటి కులాలకు కేంద్ర ఓబీసీ జాబితాలో చోటు దక్కలేదు.

పరిస్థితి ఇలా ఉంటే... ఓబీసీలను ఉపవర్గాలుగా వర్గీకరించడానికి నియమించిన 'జస్టిస్ రోహిణి కమిషన్' నివేదిక సమర్పించడానికి సిద్ధపడుతోంది. 2017 అక్టోబర్‌లో ఈ కమిషన్‌ను కేంద్రం నియమించింది. దీని కాల పరిమితిని ఇప్పటికే 14 సార్లు ప్రభుత్వం పొడిగించింది. చివరిసారిగా పొడిగించిన కాలం 2023 జూలై 31తో



ముగియనుంది.

మండల్ కమిషన్ సిఫార్స్ మేరకు కేంద్ర విద్యాసంస్థల్లో సీట్లు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు ఓబీసీలకు లభిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ అవకాశాన్ని అర్హులైన బీసీలు అందరూ అందుకున్నప్పుడే సరైన సామాజిక న్యాయం జరిగినట్లు. ప్రస్తుతం 2,633 కులాలు మాత్రమే కేంద్ర ఓబీసీ జాబితాలో ఉన్నాయి. వీటిలోనూ కొన్ని కులాల వారే రిజర్వేషన్ ఫలాలు అధికంగా పొందుతున్నారని రోహిణి కమిషన్ పరిశీలనలో తేలింది. 2018లో కమిషన్ ఓబీసీ కోటాకింద భర్తీ అయిన 1.3 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కేంద్ర విద్యాసంస్థల్లో పొందిన సీట్లను విశ్లేషించింది. ఈ మొత్తం ఉద్యోగాలు, సీట్లలో 97 శాతం ఓబీసీలోని 25 శాతం ఉపకులాలవారే పొందారని తేలింది. ఇందులో 24.95 శాతం అవకాశాలు కేవలం 10 కులాలవారే పొందారని కమిషన్ కనుగొంది. ఓబీసీల్లో 37 శాతం కులాలు... అంటే 983 కులాలు అసలు ఒక్క అవకాశాన్నీ పొందలేదు. 994 ఉపకులాల వారు కేవలం 2.68 శాతం అవకాశాలు మాత్రమే పొందారు. అనేక ఓబీసీ కులాలవారిలో అర్హత సాధించిన వారు లేకపోవడంతో విద్యా సంస్థల్లోని సీట్లను జనరల్ కేటగిరీ వారికి కేటాయించారు. ఇటువంటి పరిస్థితుల్లో అసలు కేంద్ర జాబితాలో చోటు సంపాదించని సంచార జాతులు, ఆశ్రిత కులాల వారికి కేంద్రం సమకూర్చిన రిజర్వేషన్ ఫలాలు ఎలా అందుతాయనేది పెద్ద ప్రశ్న.

ప్రస్తుతం తెలంగాణలో మొత్తం 130 బీసీ కులాలు ఉంటే కేవలం 90 కులాలు మాత్రమే కేంద్ర ఓబీసీ జాబితాలో ఉన్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 146 బీసీ కులాలు ఉంటే 108 కులాలు మాత్రమే ఓబీసీ జాబితాలో ఉన్నాయి. మిగిలిన కులాలు అన్యాయానికి గురవుతున్నాయి.

ఒక రాష్ట్ర ప్రభుత్వం బీసీలుగా గుర్తించి ఆ కులాల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపి ఓబీసీ జాబితాలో చేర్చమని సిఫార్సు చేస్తే కేంద్రం చేర్చకపోవడం దారుణం. కేంద్రం రాష్ట్రాన్ని నమ్మకుంటే ఎలా? ఈ అన్యాయం ఇంకెన్నాళ్లు?

వ్యాసకర్త రాష్ట్ర అధ్యక్షులు, గోత్రాల సంఘం, తెలంగాణ । 99494 26536

జెన్ బౌద్ధం

'జెన్' అనేది మహాయాన బౌద్ధానికి చెందిన ఒక రూపం, ఒక శాఖ. జెన్ అనే పదం సంస్కృత పదం 'ధ్యాన' నుండి వచ్చింది. ధ్యాన చైనాలో 'చాన్'గా జపాన్‌లో 'జెన్'గా మారింది. ధ్యానం ద్వారా మనస్సు నిజమైన స్వభావాన్ని గ్రహించటం ఇందులోని ప్రధానాంశం. బుద్ధుడు జ్ఞానోదయాన్నీ, సంయక్ సంబుద్ధినీ పొందినప్పటి మనస్సు ప్రతి ఒక్కరిలో దాగి ఉంటుందనీ, దాన్ని తెలుసుకొని ధ్యానం అనే సాధన ద్వారా వెలికి తీయటమే జెన్ బౌద్ధం లక్ష్యమనీ చెప్తారు.

జెన్ బౌద్ధానికి చైనాలో మూల పురుషుడు 'బోధిధర్ముడు'. ఈయన పల్లవ రాజకుమారుడు. క్రీ.శ. 440లో కాంచీపురంలో జన్మించాడు. యౌవనంలో బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. గురువు ఆదేశం మేరకు చైనా వెళ్ళి అక్కడ జెన్ బౌద్ధాన్ని



జ్యోతిర్మయం

ప్రవేశపెట్టాడు. బోధిధర్ముని రాకకు పూర్వమే ఒకటో శతాబ్దంలోనే చైనాలో బౌద్ధం వేళ్ళూనుకొని ఉన్నది. అయితే, చైనాలో బౌద్ధాన్ని ప్రవేశపెట్టిన వాళ్ళెవరికీ, బోధిధర్మునికి వచ్చినంత ఖ్యాతి రాలేదు. జెన్ బౌద్ధానికే కాదు, యుద్ధ కళగా ప్రాచుర్యం పొందిన 'కుంగ్-ఫూ'కు కూడా తొలి గురువు ఆయనే. ఇంతే కాదు, టీ పానీయాన్ని చైనాలో తొట్టతొలుత ప్రవేశపెట్టింది కూడా బోధిధర్ముడే అంటారు.

నిజానికి, జెన్ సంప్రదాయం బోధిధర్మునితో మొదలు కాలేదు. అది బుద్ధునితోనే ప్రారంభమయింది. ఓ రోజు సాయంత్రం సభలో బుద్ధుడు చేతివేళ్ళ మధ్య పువ్వుకాడను పుచ్చుకొని ఆ పువ్వును గుండ్రంగా తిప్పుతున్నాడు. అలా ఎందుకు తిప్పుతున్నాడో, దాని అర్థం ఏమిటో అక్కడ ఉన్న వాళ్ళెవరికీ అంతుబట్టలేదు. ప్రియ శిష్యుడు మహాకాశ్యపుడు ఒక్కడికే అర్థమయింది. గురుశిష్యుల మధ్య జరిగిన అవగాహనకు మాటల అవసరం లేకపోయింది. జ్ఞాన ప్రసరణకు మాధ్యమంగా అంతర్‌దృష్టి పని చేసింది. ఆ విధంగా మహాకాశ్యపుడు జెన్ బౌద్ధానికి మొట్టమొదటి గురువు అనుకొంటే, బోధిధర్ముడు ఆ సంప్రదాయానికి చైనాలో మొదటి గురువు.

జెన్ తాత్విక చింతన జీవితంలోని అనేక పార్శ్వాలపై ప్రభావం చూపింది. చిత్రలేఖనం, కవిత్వ రచన, తోటపని, పూల అమరిక – ఇలా అన్నీ కళాత్మకమైన చర్యలుగా గుర్తింపు పొందాయి. వాటిల్లో ముఖ్యంగా జెన్ కథలు... చైనా, జపాన్ దేశాల్లోని జెన్ గురువుల జీవితానుభవాల మీద ఆధారపడి చెప్పినవి. అవి కేవలం కల్పిత గాథలు కావు.

– దీవి సుబ్బారావు

తిరుమలలో పార్వేట మండపం తొలగింపు


మండపాన్ని తొలగిస్తున్న దృశ్యం కూలీలు

తిరుమల: తిరుమల పాపవినాశనం రోడ్డులో ఉన్న పురాతన పార్వేట మండపం తొలగింపు పనులు టీటీడీ ఇంజినీరింగ్ శాఖ అధికారులు మంగళవారం చేపట్టారు. ప్రస్తుతం ఈ మండపం మరమ్మతులకు గురికావడంతో మండపాన్ని తొలగించాలని గత సంవత్సరం జూలైలో టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయించి తీర్మానించింది. ఈ మేరకు నూతన మండపం నిర్మాణానికి రూ.2.07 కోట్ల నిధులను కేటాయించింది.

దారిదోపిడీల సూత్రధారి సీఆర్‌పీఎఫ్ జవాన్

- ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో ఇద్దరు నిందితుల అరెస్టు

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): పోలీసులమని చెబుతూ ఆంధ్రా ఒడిశా సరిహద్దులో దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను ఒడిశా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారిలో ఒకరు రాజమండ్రికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ కావడంతో పోలీసులు నివ్వెరపోయారు. ఇటీవల కాలంలో అరకు, పాడువా పోలీసులమని బెదిరించి దారి దోపిడీలకు పాల్పడుతున్న ఘటనలపై ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో కేసులు నమోదయ్యాయి. దీంతో నిఘా పెట్టిన పోలీసులు సోమవారం అరకులోయ నుంచి స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరిపై అనుమానంతో వెంబడించారు. పాడువా పోలీసు స్టేషన్ పరిధి బలడ ప్రాంతంలో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా, దోపిడీ ముఠా గుట్టురట్టయ్యింది. వీరిలో ఒకరు రాజమండ్రిలోని సీఆర్‌పీఎఫ్ 42వ బెటాలియన్‌లో జవానుగా పనిచేస్తున్న రాజ్‌కుమార్ జైనీగా గుర్తించారు. కోరాపుట్ ప్రాంతానికి చెందిన సయ్యద్‌బాజి నూరుద్దీన్ రెండో నిందితుడు. వీరిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

రావమ్మా మహాలక్ష్మి..



ఏపీలో పెరుగుతున్న అమ్మాయిల సంఖ్య

- ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,046 మంది అమ్మాయిల జననం
- దేశంలో కేరళ తర్వాత ఏపీలోనే అమ్మాయిలు అధికం
- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో దశాబ్దాల తరబడి అబ్బాయిలే అధికంగా ఉంటున్నారు. కానీ.. 2021 తర్వాత అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తాజా నివేదిక వెల్లడించింది. గ్రామిక శక్తికి సంబంధించి 2021– 22 నివేదిక లో ఈ విషయాలను వెల్లడించింది. గతంలో వెయ్యి మంది అబ్బాయిలకు 977 మంది అమ్మాయిలు మాత్రమే ఉండేవారు. ఇప్పుడా సంఖ్య 1,046కు పెరిగినట్టు నివేదికలో వెల్లడించింది.

ఆరోగ్య కార్యక్రమాల అమలు భేష్

రాష్ట్రంలో ఆరోగ్య కార్యక్రమాలు బాగా అమలు చేస్తుండటం వల్లే అమ్మాయిల సంఖ్య పెరుగుతున్నట్టు నివేదిక వెల్లడించింది. సాధారణంగా ఆరేళ్ల నిండకముందే బాలికల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తి మృతి చెందేవారు. కానీ.. ఈ పరిస్థితులు తలెత్తకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, క్రమం తప్పకుండా యాంటీనేటల్ చెకప్, వ్యాధి నిరోధక టీకాల అమలు అద్భుతంగా ఉండటం వంటి పరిస్థితుల వల్ల మంచి ఫలితాలు వస్తున్నా యి. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల స్థాయిలోనే ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ఇటీవల చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థ కూడా సత్ఫలితాలు ఇస్తోంది. అమ్మాయిల సంఖ్య పెరగడానికి ఇవి కూడా కారణాలని నివేదిక వెల్లడించింది.

కేరళ తర్వాత ఏపీలోనే అధికం

దేశంలో అమ్మాయిలు ఎక్కువగా నమోదవుతున్న రాష్ట్రాల్లో కేరళ మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉండటం గమనార్హం. కేరళలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,114 మంది అమ్మాయిలు నమోదవుతుండగా.. ఆంధ్రప్రదేశ్‌లో 1,046 మంది నమోదయ్యారు. అత్యల్పంగా హర్యానాలో 887 మంది అమ్మాయిలు మాత్రమే నమోదయ్యారు. ఏపీలో పట్టణ ప్రాంతాల్లో వెయ్యి మందికి 1,063 మంది, గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి మందికి 1,038 మంది అమ్మాయిలు ఉన్నట్టు నివేదికలో వెల్లడైంది. 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతుండటం వల్ల మెరుగైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు. ఇండియాలో సగటున ప్రతి వెయ్యిమంది అబ్బాయిలకు 968 మంది అమ్మాయిలు నమోదయ్యారు.



వివిధ రాష్ట్రాల్లో వెయ్యి మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య ఇలా..

రాష్ట్రం	కేరళ	ఆంధ్రప్రదేశ్	హిమాచల్‌ప్రదేశ్	తమిళనాడు	ఛత్తీస్‌గఢ్	జార్ఖండ్	కర్ణాటక	ఒడిశా	ఉత్తరప్రదేశ్	తెలంగాణ
అమ్మాయిలు	1,114	1,046	1,031	1,026	1,016	1,001	991	988	971	955

అల్లూరి స్ఫూర్తితో బహుజన ఉద్యమం

- 1,010వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో బహుజన పరిరక్షణ సమితి ఉద్యమం సాగించి విజయం సాధిస్తామని బహుజన నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,010వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. పెత్తందారుల పోకడలను తట్టుకుని బాబా సాహెబ్ అంబేడ్కర్ సూచించిన బహుజన సామ్రాజ్యం కోసం పోరాటం చేస్తున్న తమపై కులవాదులు చేసిన అరాచకాలు అంతా ఇంతా కాదన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తూ సమన్యాయం పాటిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు తన హయాంలో పేదలకు చేసిన మేలు ఏంటో చెప్పి ఎన్నికలకు రావాలి కానీ, ఇంకా మేనిఫెస్టో పేరుతో ప్రజలను మోసగించేందుకు తిరగడం సిగ్గుచేటన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరును ఒక జిల్లాకు పెట్టడం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బహుజనులపై ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. రాజధాని పేరుతో అవినీతికి పాల్పడిన చంద్రబాబు, నారాయణ అండ్ కోలను అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. నాయకులు బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, కారుమూరి పుష్పరాజ్, బొలిమేర శ్యామ్యూల్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో వైభవంగా స్వామివారి కళ్యాణం

- డల్లాస్‌లో నాటా మహాసభల్లో నిర్వహణ
- భారీగా హాజరైన ఎన్‌ఆర్‌ఐ భక్తులు



సాక్షి, అమరావతి: అమెరికాలోని డల్లాస్ నగరంలో నిర్వహిస్తున్న నాటా మహాసభల్లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి కళ్యాణం వైభవంగా జరిగింది. టీటీడీ నుంచి వెళ్లిన అర్చకులు, వేద పండితులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారి కళ్యాణ తంతు నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఐ భక్తు లు భారీగా హాజరై స్వామివారి కళ్యాణం వీక్షించారు. కాగా, అట్లాంటాలోనూ మలయప్ప స్వామి కళ్యాణ క్రతువు నిర్వహించారు.

ప్రపంచ వ్యాప్తంగా వెంకన్న కళ్యాణోత్సవాలు : వైవీ సుబ్బారెడ్డి

ప్రపంచ వ్యాప్తంగా శ్రీవేంకటేశ్వరస్వామి వారి కళ్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గత 13 నెలల కాలంలో వివిధ దేశాల్లో 30 చోట్ల స్వామి వారి కళ్యాణ క్రతువు జరిపించామని చెప్పారు. ఆదివారం అమెరికాలోని డల్లాస్‌లో నాటా మహాసభల్లో నిర్వహించిన శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో భారతదేశంలోని పలు ప్రాంతాలతో పాటు వివిధ దేశాల్లోని తెలుగు భక్తులు, ధార్మిక సంస్థల విజ్ఞప్తి మేరకు కళ్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీఎన్‌ఆర్టీఎస్ అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ కెనడా, అమెరికాలోని 14 నగరాలకు గాను ఇప్పటికే 9 చోట్ల కళ్యాణోత్సవాలు పూర్తయ్యాయన్నారు. ఈ నెల 22వ తేదీ వరకు అమెరికాలోని మరో ఐదు నగరాల్లో స్వామి వారి కళ్యాణ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. శ్రీధర్, మల్లిక్, గౌతమ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మీడియా, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సజ్జల భార్గవ్, ఢిల్లీలోని టీటీడీ లోకల్ ఏరియా కమిటీ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కెనడాలో బందరు యువకుడి మృతి

మచిలీపట్నం చింతగుంటపాలెంలో విషాదం


రోదిస్తున్న తల్లి మీనాకుమారి (ఇన్‌సెట్‌లో) నాగకుమార్ (ఫైల్)

మచిలీపట్నంటౌన్: కెనడాలోని సిల్వర్ ఫాల్స్‌లో ఈతకొడుతూ నీటిలో మునిగిపోయి బందరుకు చెందిన ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కృష్ణాజిల్లా మచిలీపట్నం చింతగుంటపాలెంలో నివాసం ఉంటున్న పోలుకొండ శ్రీనివాసరావు, మీనా కుమారి దంపతులకు ముగ్గురు కొడుకులు. వారిలో పెద్దవాడైన లెనిన్ నాగకుమార్ కెనడాలోని లేక్‌హెడ్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తి చేసి.. ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. నాగకుమార్ స్నేహితులతో కలిసి భారతకాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి కెనడాలోని సిల్వర్ ఫాల్స్‌లో ఈతకొడుతూ నీటిలో మునిగిపోయాడు. హెలికాప్టర్ ద్వారా నాగకుమార్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లి రక్షించేందుకు రెస్క్యూ టీమ్ ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని తెలిపారు. కాగా, కెనడాలోని థండర్‌బే ప్రాంతంలో నివాసం ఉంటున్న నాగకుమార్ సోమవారం రాత్రి 8 గంటల సమయంలో తల్లి మీనాకుమారితో ఫోన్‌లో మాట్లాడారు. అదే సమయంలో వర్షం పడుతుండడంతో తరువాత మాట్లాడుతానని తల్లి చెప్పడంతో ఫోన్ కట్ చేసిన నాగకుమార్ అర్ధరాత్రి స్నేహితులతో కలిసి సిల్వర్ వాటర్ ఫాల్స్‌లో సరదాగా గడిపేందుకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. దీంతో చింతగుంటపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. నాగకుమార్ మృతదేహాన్ని త్వరితగతిన స్వస్థలానికి చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే పేర్ని నానిని కోరారు. దీనికి స్పందించిన ఆయన మృతదేహాన్ని త్వరితగతిన స్వస్థలానికి రప్పించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. కాగా, భారత రాయబారి సంజయ్‌వర్మతో బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన మృతదేహాన్ని పంపించాలని కోరారు.

అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి

- ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి



అనకాపల్లి టౌన్: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్ఈజెడ్ పరిధిలోని పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లతో రెండు ఎకరాల్లో 30 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి చెప్పారు. తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. ఆస్పత్రి నిర్మాణం టెండర్ దశలో ఉందని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను విశాఖ కేజీహెచ్‌కు తరలించాల్సి వస్తోందని, ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటైతే వారికి సకాలంలో అత్యున్నత వైద్యం అందుతుందని ఆమె చెప్పారు. దశల వారీగా 30 పడకలను 100 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆధ్వర్యంలో ఆస్పత్రి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఏజెన్సీలో లక్ష్మీపురం గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేసినట్లు ఎంపీ చెప్పారు.

పార్లమెంట్‌లో పది రోజులపాటు నిరసన తెలిపాం..

ఏపీలో గల పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు, ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీలమంతా 10 రోజులపాటు ప్లకార్డులతో నిరసన తెలియజేశామని ఎంపీ సత్యవతి చెప్పారు. అనకాపల్లిలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని తామంతా డిమాండ్ చేశామన్నారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టుకు కొద్దిమేర నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని.. కేంద్రం ఏపీ విభజన హామీ నిధులు ఇచ్చేవరకూ రానున్న రోజుల్లో ఎంపీలమంతా పోరాడతామన్నారు.

బాలిక ఘటనలో అవాస్తవాల ప్రచారం

- సంచలనాల కోసమే అసత్య కథనాలు
- ప్రకాశం ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: ఒంగోలులోని బిలాల్‌నగర్‌కు చెందిన బాలికపై అత్యాచారం విషయంలో వస్తున్న ఆరోపణలు అవాస్తవమని, వాస్తవాలు తెలుసుకోకుండా సంచలన వార్తగా ప్రచారం చేశారని ఎస్పీ మలికా గర్గ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిలాల్‌నగర్‌కు చెందిన యువకుడు ఖలీల్‌కు స్థానికంగా ఉండే బాలికతో పరిచయం ఏర్పడినట్లు విచారణలో తేలిందని తెలిపారు. బాలికకు తండ్రి లేకపోవడం, జీవనోపాధి కోసం తల్లి ఇతర ప్రాంతాలకు పనికి వెళ్లడం, అన్నలతో కలిసి ఉండడం గమనించిన ఖలీల్ గతనెల 15న బాలికను మాయమాటలతో తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. 16వ తేదీ సాయంత్రం బాలిక సోదరుడు తాలుకా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడని, అయితే బాలిక ఎవరో గుర్తుతెలియని వ్యక్తితో మోటారు బైక్ మీద వెళ్లినట్లు ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశాడని తెలిపారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు, అతడిచ్చిన ప్రాథమిక సమాచారంతో పోలీసులు చుట్టుపక్కల వారిని విచారించడమేగాక కుటుంబసభ్యుల కాల్స్, సెల్‌ఫోన్ సీడీఆర్‌లు, సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించినట్లు వివరించారు. బాలిక కోసం ముమ్మరంగా గాలింపు జరుగుతున్న సమయంలో జూన్ 30వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో బాలికను ఆమె కుటుంబసభ్యులు తీసుకొచ్చి ఖలీల్ మీద ఫిర్యాదు చేశారని తెలిపారు. నిందితుడు ఖలీల్ బాలికను తన ఇంట్లో నిర్బంధించి 13 రోజులుగా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్చామని, వెంటనే ఖలీల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని వివరించారు. చట్ట ప్రకారం కేసు విచారణ త్వరగా పూర్తిచేసి శిక్షపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రకాశం ఎస్పీ, కలెక్టర్, డీజీపీ సహా 14 మందికి హెచ్‌ఆర్‌సీ నోటీసులు

కర్నూలు(సెంట్రల్): ఒంగోలులో బాలికపై అత్యాచారం, నిర్బంధం ఘటనపై రాష్ట్ర మానవహక్కుల సంఘం (హెచ్‌ఆర్‌సీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. డీజీపీ, ప్రకాశం జిల్లా ఎస్పీ, కలెక్టర్‌తో పాటు 14 మందికి నోటీసులు జారీచేసింది. డీఎస్పీతో విచారణ జరిపించి ఈ నెల 24వ తేదీన నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.


లంకమలలో చీతా బేస్ క్యాంపు ప్రారంభం


చీతా బేస్ క్యాంపును ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ మధుసూదన్‌రెడ్డి

బద్వేలు అర్బన్: వైఎస్సార్ జిల్లా లంకమల అభయారణ్యంలో ఏర్పాటు చేసిన చీతా (చిరుత) బేస్ క్యాంపును ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎస్) వై.మధుసూదన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అడవులలో భాగమైన వృక్షజాతులు, వన్యప్రాణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఎర్రచందనం స్మగ్లర్లు ప్రవేశిస్తున్న మార్గాలను గుర్తించి బేస్‌క్యాంపులు పటిష్టం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అభయారణ్యంలోని ఆలయ పరిసరాల్లో ఎకో టూరిజం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. గోపవరం మండలంలోని సెంచూరీ ప్యానల్ సమీపంలో నగరవనం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నల్లమల అటవీ ప్రాంతం నుంచి బద్వేలు, సిద్ధవటం మీదుగా శేషాచలం అటవీ ప్రాంతానికి టైగర్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అనంతరం లంకమలలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో నాగార్జునరెడ్డి, ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్‌వో దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం అదుర్స్

- 14 రోజుల్లో రూ.2.05 కోట్లు



సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం లభించింది. కేవలం 14 రోజుల్లో రూ.2,05,72,705 ఆదాయం చేకూరింది. దేవస్థానం చరిత్రలో 14 రోజుల్లో ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం రావడం ఇదే తొలిసారి. సింహగిరిపై ఆలయ బేడామండపంలో మంగళవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 100.500 గ్రాముల బంగారం, 13.500 కిలోల వెండి సమకూరాయి. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు పర్యవేక్షించారు. ఈ నెల 2, 3 తేదీల్లో జరిగిన గిరి ప్రదక్షిణ, ఆలయ ప్రదక్షిణలకు లక్షలాదిగా భక్తులు తరలిరావడం హుండీ ఆదాయం పెంపునకు కారణంగా భావిస్తున్నారు.

రాష్ట్ర స్థాయిలో స్పోర్ట్స్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

- 'ఆడుదాం ఆంధ్రా' పోటీల విజయవంతానికి కార్యాచరణ సిద్ధం చేయండి
- రాష్ట్ర నూతన క్రీడా విధానంపై సమీక్షలో సీఎస్ జవహర్ రెడ్డి

సాక్షి, అమరావతి: క్రీడలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర నూతన క్రీడా విధానం-2023-28పై ఆయన సచివాలయంలో మంగళవారం క్రీడల శాఖ అధికారులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, మంగళగిరిలలో క్రీడా అకాడమీలు ఏర్పాటు చేసేలా నూతన క్రీడా విధానంలో పొందుపరచాలని సూచించారు. వివిధ జిల్లాల్లో 16 క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ఎంత భూమి, నిధులు, ఇతర అవసరాలు కావాలనేదానిపై పూర్తిస్థాయిలో అంచనా వేసి నివేదిక సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి అన్ని విధాలా ప్రోత్సహించాలని చెప్పారు. గ్రామ, మండల, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో క్రీడాపరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' పేరిట గ్రామస్థాయి నుంచి నిర్వహించనున్న క్రీడా పోటీలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేసేందుకు సిద్ధం కావాలని ఆదేశించారు. తొలుత రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి వాణీమోహన్ 2023-28 రాష్ట్ర క్రీడా విధానానికి సంబంధించిన ముఖ్య అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. స్పోర్ట్స్ క్లబ్‌లు, యోగా అసోసియేషన్ల సహకారంతో అన్ని విశ్వవిద్యాలయాల్లో యోగాపథం శిక్షణను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడా పోటీల నిర్వహణకు క్యాలెండర్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. శాప్ ఎండీ హర్షవర్ధన్, ఏవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో 11న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 11న టీటీడీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనుంది. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు ఆలయ అర్చకులు ఆగమోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. తిరుమంజనం కారణంగా మంగళవారం నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

• తెలంగాణ

మాజీ ఎంపీ మాగుంట హత్య కేసులో... దోషికి మధ్యంతర బెయిల్

సాక్షి, హైదరాబాద్: మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి హత్య కేసులో దోషి, మాజీ నక్సలైట్ పీబీవీ గణేశ్‌ను నెలపాటు మధ్యంతర బెయిల్‌పై విడుదల చేయాలని జైలు అధికారులను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అలాగే ఆగస్టు 4న జైలు సూపరింటెండెంట్ ముందు లొంగిపోవాలని ఆయన్ను ఆదేశించింది. 1995లో జరిగిన ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి హత్య కేసులో పీబీవీ గణేశ్‌ను 2000 సంవత్సరంలో కోర్టు దోషిగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దీనిపై ఆయన అప్పీల్‌కు వెళ్లినా ఉపశమనం కలగలేదు. దీంతో రెండు దశాబ్దాలకుపైగా జైల్లో ఉంటున్న గణేశ్‌ను సత్ప్రవర్తనగల ఖైదీగా పరిగణించి విడుదల చేయాలని 2016లో రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అయితే ఈ కేసులో సీబీఐ ఇంకొందరిపై దర్యాప్తు కొనసాగిస్తోందంటూ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గణేశ్ భార్య జోషి మాధవి 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. సత్ప్రవర్తన నిబంధనలన్నీ గణేశ్‌కు వర్తిస్తే ఆయన్ను వారంలో విడుదల చేయాలని 2022 సెప్టెంబర్‌లో ఆదేశించారు. కానీ నెలలు గడిచినా కేంద్రం ఏ నిర్ణయం తీసుకోక పోవడంతో ఏప్రిల్‌లో మాధవి అప్పీల్ దాఖలు చేశారు. అలాగే తన భర్తకు బెయిల్ ఇవ్వాలని మధ్యంతర అప్లికేషన్ వేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ వాదిస్తూ సీబీఐ పరిధిలోని కేసు కనుక గణేశ్ విడుదలపై కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున జీపీ సామల రవీందర్ వాదనలు వినిపిస్తూ సీబీఐ విచారణ జరిపిన కేసు అయినా సరే.. ఒకసారి శిక్ష పడిన తర్వాత దోషి విడుదల రాష్ట్ర సర్కార్‌కు సంబంధించిన అంశం అవుతుందన్నారు. చట్టప్రకారం అన్నీ సరిగ్గా ఉన్నప్పుడు ఈ ప్రతిపాదనను తిరస్కరించే అధికారం కేంద్రానికి లేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి దోషిని నెల రోజుల కోసం బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించారు.

గిరిజన కాఫీ ప్రాజెక్ట్‌కు రూ.5 కోట్లు

- డౌనూరులో కాఫీ క్యూరింగ్ ప్లాంట్‌కు రూ.3 కోట్లు
- కాఫీ కొనుగోలుకు రూ.2 కోట్లు కేటాయింపు

సాక్షి, అమరావతి/సాక్షి, పాడేరు: గిరిజన సహకార సంస్థకు రూ.5 కోట్లు విడుదల చేస్తూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.వెంకట మురళి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులలో అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం డౌనూరులో జీసీసీ నిర్మించనున్న కాఫీ క్యూరింగ్ సెంటర్‌కు రూ.3 కోట్లు, వచ్చే ఏడాది కాఫీ మార్కెటింగ్, ఇతర అవసరాలకు గాను రూ.2 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. కాఫీ క్యూరింగ్ సెంటర్ ఏర్పాటుతో గిరిజనుల నుంచి కొనుగోలు చేసిన కాఫీ గింజలను త్వరితగతిన శుద్ధి చేసి, మరింత నాణ్యమైన కాఫీ గింజలను తయారు చేసి వెనువెంటనే అమ్మకాలు చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుంది. గిరిజనులకు మరింత లాభాలు వస్తాయి. నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి గిరిజన కాఫీ రైతుల తరఫున మంగళవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

మావోయిస్టుల శిబిరంపై పోలీసుల దాడి

- ఇరువరాల నడుమ హోరాహోరీ కాల్పులు
- నలుగురీ మృతి!

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల శిబిరంపై పోలీసు బలగాలు దాడి చేశాయి. జిల్లాలోని ఇసల్నార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారన్న పక్కా సమాచారంతో సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ, కోబ్రా 210వ బెటాలియన్ల బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇసల్నార్ సమీపంలోని అటవీ ప్రాంతంలో తారసపడిన మావోయిస్టులు నేరుగా పోలీసు బలగాలపైకి కాల్పులు జరిపారు. దీంతో ఆత్మరక్షణార్థం పోలీసులు సైతం ఎదురు కాల్పులకు దిగారు. హోరాహోరీగా జరిగిన కాల్పుల్లో పలువురు మావోయిస్టులు గాయపడ్డారు. అయితే మావోయిస్టులు అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం ఘటనాస్థలం నుంచి మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యంతో పాటు నిత్యావసర సరుకులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఘటన అనంతరం పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు. ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడిన నలుగురు మావోయిస్టులు మృతి చెంది ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

స్కూళ్లలో పిల్లల భద్రతకు చర్యలు

- నాడు-నేడు పనులు జరుగుతున్న స్కూళ్లపై ప్రభుత్వ ఆదేశాలు
- ప్రమాదాలు జరగకుండా పలు సూచనలు
- భద్రత చర్యలతో నివేదిక పంపాలని జిల్లాల విద్యా శాఖ అధికారులకు ఆదేశం



సాక్షి, అమరావతి: మన బడి నాడు-నేడు రెండో దశ పనులు జరుగుతున్న స్కూళ్లలో పిల్లల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పాఠశాలలు తెరిచినందున రెండో దశ పనులు జరుగుతున్న స్కూళ్లలో ప్రత్యేక భద్రత చర్యలపై పలు సూచనలు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కాటంనేని భాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల విద్యా శాఖ అధికారులకు జారీ చేసిన ఆదేశాలివీ..

- పాఠశాలల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జిల్లా, మండల అధికారులు స్వయంగా స్కూళ్లకు వెళ్లి పరిశీలించాలి
- తల్లిదండ్రుల కమిటీ, ఇంజనీర్‌తో కలిసి హెడ్ మాస్టర్ పాఠశాల ఆవరణ మొత్తం తిరిగి ప్రమాదాలు జరిగే ప్రదేశాలను, పరికరాలను గుర్తించాలి
- ఆ ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా చూడాలి. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పిల్లలు, సిబ్బంది వెళ్లకుండా సేఫ్టీ టేపులతో కంచెలు వేయాలి
- కూల్చివేతలు చేపట్టినప్పుడు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. చుట్టుపక్కల ఆస్తులకు నష్టం కలగకుండా చూడాలి
- వ్యర్థాలను పాఠశాలలకు దూరంగా వేయాలి
- పనులు చేస్తున్న కార్మికులు, ఇంజనీర్లు జాగ్రత్తలు పాటించాలి. హెల్మెట్, స్టీల్ టోడ్ బూట్లు, ఫేస్ మాస్కులు వంటివి ధరించాలి
- పని ప్రదేశంలో ప్రథమ చికిత్స కిట్ ఉంచాలి
- విద్యుత్ లైన్లు ఎక్కడ పడితే అక్కడ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- అగ్నిప్రమాదాలు, ఇతర సందర్భాల్లో అత్యవసర నిష్క్రమణ ప్రణాళికలు రూపొందించాలి
- పాఠశాల ఆవరణలో గుంతలన్నీ పూర్తిగా పూడ్చివేయాలి. ఎక్కడా నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి
- ఈ జాగ్రత్తలన్నీ తీసుకుని ఫొటోలతో సహా విద్యా శాఖకు నివేదికలు పంపించాలి
- పిల్లలు, సిబ్బంది రాకపోకలకు సురక్షిత మార్గాలు ఏర్పాటు చేయాలి
- స్కూలు తెరవడానికి ముందు లేదా స్కూలు సమయం ముగిసిన తరువాతే యంత్రాలు, పరికరాలు, మెటీరియల్ తొలగించాలి

వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు, కుమారుడిపై టీడీపీ హత్యాయత్నం

తూర్పుగోదావరి జిల్లా ముక్కామలలో దారుణం

పెరవలి: తూర్పుగోదావరి జిల్లా ముక్కామలలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు గండేపల్లి రామకృష్ణ, ఆయన కుమారుడు శేషవర్ధన్‌లపై మంగళవారం తెలుగుదేశం శ్రేణులు హత్యాయత్నం చేశాయి. తీవ్రంగా గాయపడిన శేషవర్ధన్‌ను తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ హత్యాయత్నానికి సంబంధించి ఆరుగురు తెలుగుదేశం వర్గీయుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. పెరవలి మండలం ముక్కామల ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ బైక్‌పై పంచాయతీ కార్యాలయానికి వెళుతుండగా సుమారు 25 మంది తెలుగుదేశం వర్గీయులు ఒక్కసారిగా అడ్డగించారు. కులం పేరుతో, పరుష పదజాలంతో దూషించారు. అందరూ ఒక్కసారిగా దాడిచేసి కొట్టసాగారు. ఈ విషయం తెలిసి రామకృష్ణ కుమారుడు శేషవర్ధన్ పరుగున అక్కడకు చేరుకుని తన తండ్రిని కొట్టకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో టీడీపీ వర్గీయులు ఆయనపై కొడవలితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయం తెలుసుకున్న రామకృష్ణ సోదరులు, ఆయన కుటుంబసభ్యులు అక్కడకు చేరుకున్నారు. పెరవలి పోలీసులకు సమాచారం అందించారు. కొద్దిసేపటికే పెరవలి ఎస్ఐ సూర్యభగవాన్ సిబ్బందితో అక్కడికి వచ్చారు. రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఈ హత్యాయత్నానికి సూత్రధారులైన తెలుగుదేశం వర్గీయులు నల్లా విశ్వనాథం, వాసంశెట్టి సన్నీ, వేంద్ర వెంకటరమణమూర్తి, జక్కంశెట్టి మహేష్, బాలం వెంకటరెడ్డి, కాలిదాసు వీరేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని పెరవలి పోలీసు స్టేషన్‌కు తరలించారు. రామకృష్ణ వర్గీయులు కూడా పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిడదవోలు సీఐ వెంకటేశ్వరరావు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసు అధికారులు రెండువర్గాలను శాంతింపజేశారు. తీవ్రంగా గాయపడిన శేషవర్ధన్‌ను చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్న నిందితులను విచారిస్తున్నామని ఎస్ఐ సూర్యభగవాన్ చెప్పారు.

ముందురోజు కూడా..

గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయుడు నల్లా విశ్వనాథం కొంతకాలంగా తరచు పంచాయతీ కార్యాలయానికి వచ్చి ఇష్టం వచ్చినట్టు దుర్భాషలాడుతున్నాడు. సోమవారం కూడా అతడు పంచాయతీ ఆఫీసుకు వచ్చి అధికారులను తిడుతుండటంతో ఎంపీటీసీ సభ్యుడు గండేపల్లి రామకృష్ణ మందలించారు. దీంతో విశ్వనాథం పరుష పదజాలంతో దూషిస్తూ రామకృష్ణపై కొడవలితో దాడి చేయబోయాడు. చుట్టుపక్కలవారు సర్దిచెప్పి ఇద్దరినీ అక్కడి నుంచి పంపించేశారు. ఈ క్రమంలో మంగళవారం రామకృష్ణ, ఆయన కుమారుడిపై హత్యాయత్నం చేశారు.

క్లుప్తంగా...

ఉమ్మడి పౌరస్మృతి అమలుకు టైమొచ్చింది

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

గువాహటి: దేశంలో ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)ని అమలు చేయడానికి సమయం వచ్చిందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చెప్పారు. యూసీసీని అమలు చేయాలని రాజ్యాంగ నిర్మాతలు సైతం అభిప్రాయపడ్డారని గుర్తుచేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 ఇదే విషయం చెబుతోందని అన్నారు. మంగళవారం ఐఐటీ-గువాహటి 25వ స్నాతకోత్సవంలో జగదీప్ ధన్‌ఖడ్ ప్రసంగించారు. యూసీసీ అమలుకు ఎలాంటి అడ్డంకులు లేవని, ఇక జాప్యం చేయొద్దని పేర్కొన్నారు. అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని సూచించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని యూసీసీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి పౌరస్మృతి మన దేశాన్ని ఐక్యంగా మారుస్తుందని అభిప్రాయపడ్డారు.

'కులవ్యవస్థ' పిల్‌ల కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: కులవ్యవస్థను పునర్విభజన చేయాలని, ప్రత్యామ్నాయ రిజర్వేషన్ విధానం రూపొందించడానికి వీలుగా క్రమంగా రిజర్వేషన్లను తొలగించాలని కోరుతూ దాఖలైన వేర్వేరు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. న్యాయవాది సచిన్ గుప్తా దాఖలు చేసిన పిటిషన్లను మంగళవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం విచారించింది. ''రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం కులవ్యవస్థ పునర్విభజన నిమిత్తం ఓ విధానాన్ని రూపొందించేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరడం చట్ట ప్రక్రియను దుర్వినియోగపరచడమే. ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం. ఇటువంటి పిల్‌లను వెంటనే ఆపేయాలి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.25 వేలు చెల్లించాలని పిటిషనర్‌ను ఆదేశిస్తున్నాం. పిటిషనర్ రెండు వారాల్లో రశీదు సమర్పించాలి''అని సీజేఐ చంద్రచూడ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎం స్టాలిన్‌కు రెండు రోజుల విశ్రాంతి

సాక్షి, చెన్నై: తమిళనాడు సీఎం, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ చెన్నై అపోలో ఆస్పత్రి నుంచి మంగళవారం డిశ్చార్జి అయ్యారు. ఆయనకు కనీసం రెండు రోజులు విశ్రాంతి తప్పనిసరి అని వైద్యులు సూచించినట్టు తెలిసింది. ఇక సోమవారం సాయంత్రం స్టాలిన్ అపోలో ఆస్పత్రిలో జాయినైన విషయం తెలిసిందే. సాధారణ వైద్య పరీక్షల కోసమే ఆయన ఆస్పత్రిలో చేరినట్లు వైద్యులు ప్రకటించారు. మంగళవారం ఉదయం 9.50 గంటలకు డిశ్చార్జి అయ్యారు. వైద్యుల సూచనల మేరకు సీఎం స్టాలిన్‌కు రెండు రోజులపాటు అన్ని కార్యక్రమాలను రద్దు చేసినట్లు సీఎంవో తెలిపింది.

సమయం ఆదియందు... మెల్లిగా సాగెను...!

ఎంతకూ రాని బస్సు కోసం అసహనంగా ఎదురు చూస్తున్నప్పుడో, చేస్తున్న పని పరమ బోరుగా అనిపిస్తున్నప్పుడో ఎలా ఉంటుంది? టైం అస్సలు సాగడం లేదని అనిపిస్తుంది. కదూ! కానీ ఆదియందు, అంటే బిగ్ బ్యాంగ్ జరిగి, ఆ మహా విస్ఫోటనం నుంచి ఈ మహా సృష్టి పురుడు పోసుకుంటున్న తొలినాళ్లలో సమయం నిజంగానే నింపాదిగా సాగేదట! ఎంతగా అంటే, ఇప్పటి వేగంలో అది కేవలం ఐదో వంతు మాత్రమేనని అంతరిక్ష శాస్త్రవేత్తలు తాజాగా సూత్రీకరించారు...!

- సాక్షి, నేషనల్ డెస్క్

సృష్టి తొలినాళ్లలో సమయ విస్తరణ (టైం డైలేషన్) తీరుతెన్నులపై సిడ్నీ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తాజాగా ఓ అధ్యయనం జరిపారు. కాసర్స్ అని పిలిచే సృష్టిలోకెల్లా అతి తేజోమయమైన, అత్యంత చురుకైన బృహత్ కృష్ణబిలాల సమూహాలను లోతుగా పరిశీలించారు. దాదాపు 1,230 కోట్ల ఏళ్ల క్రితం కాలం ఇప్పుడు సాగుతున్న వేగంలో కేవలం ఐదో వంతు వేగంతో నడిచేదని తేల్చారు.

ఇలా చేశారు: పరిశోధక బృందం తమ అధ్యయనానికి కాసార్స్‌ను కాలమానినిగా మార్చుకుంది. బిగ్ బ్యాంగ్ తరువాత దాదాపు 150 కోట్ల ఏళ్ల కాల పరిధిలోని మొత్తం 190 కాసర్స్ నుంచి వెలువడే దురిక్షీణ్య కాంతులను పరిశోధనలో వాడుకుంది. పలు తరంగదైర్ఘ్యాల్లో వాటి ప్రకాశాన్ని నేడు ఉనికిలో ఉన్న కాసర్స్‌తో సరిపోల్చారు. కాల ప్రవాహ గతిలో చోటు చేసుకునే కీలక నిర్దిష్ట మార్పుల్లో కొన్ని నేటితో పోలిస్తే అప్పట్లో కేవలం ఐదో వంతు వేగంతో జరిగేవని తేల్చారు.



'కాలమనే కాన్సెప్ట్ మనకింకా పూర్తిగా అర్థమే కాలేదని చెబితే అతిశయోక్తి కాబోదు. కాలం తీరుతెన్నులు, పరిమితులు తదితరాల గురించి కూడా మనకు తెలిసింది బహు స్వల్పం. అందుకే టైం ట్రావెల్ (భూత, భవిష్యత్తులోకి వెళ్లగలగడం) వంటివి సాధ్యం కాదని చెబితే అది తొందరపాటే అవుతుంది'

- గెరైంట్ లెవిస్, అధ్యయన బృంద సారథి, సిడ్నీ యూనివర్సిటీ

కోటి సూర్య సమప్రభలు...

కాసర్స్ అని పిలిచే కాంతిపుంజ సమూహంలోని ఒక్కో కృష్ణ బిలం పరిమాణం అత్యంత భారీగా ఉంటుంది. ఎంతగా అంటే, కొన్ని కృష్ణ బిలాలు సూర్యుని కంటే ఏకంగా కొన్ని వందల కోట్ల రెట్లు పెద్దవి! అవి తమ పరిధిలోకి వచ్చిన ఎంతటి పదార్థాన్ని అయినా అనంత ఆకర్షణ శక్తితో లోనికి లాగేసి అమాంతంగా మింగేస్తాయి. ఆ క్రమంలో లెక్క లేనన్ని వెలుతురు పుంజాలను సృష్టి మూలమూలలకూ వెదజల్లుతుంటాయి. చుట్టూ అనంత కాంతి వలయాలతో వెలుగులు విరజిమ్ముతూ ఉంటాయి.

ఉగ్రపోరులో ద్వంద్వ ప్రమాణాలొద్దు

సీమాంతర ఉగ్రవాదానికి మద్దతిచ్చే దేశాలను విమర్శించాల్సిందే ● ఎస్సీఓ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఉగ్రవాద కార్యకలాపాలను కఠినంగా అణచివేసే విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించవద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హితవు పలికారు. పాకిస్తాన్‌కు పరోక్షంగా చురకలు అంటించారు. కొన్ని దేశాలు ప్రభుత్వ విధానాల్లో భాగంగానే సీమాంతర ఉగ్రవాదానికి నిస్సిగ్గుగా మద్దతిస్తున్నాయని, అలాంటి దేశాలను విమర్శించడానికి ఎవరూ సంకోచించవద్దని సూచించారు. మంగళవారం షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) వర్చువల్ సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఉగ్రవాదాన్ని, ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చే శక్తులను అణచివేయడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతికి ఉగ్రవాదం ఒక పెనుముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ముప్పు తొలగిపోవాలంటే ఎస్సీఓ సభ్యదేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాలని, పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నప్పటికీ అంతం చేయాల్సిందేనని మోదీ స్పష్టం చేశారు.

ఎస్సీఓలో సంస్కరణలకు మద్దతు

ప్రపంచ దేశాలన్నీ ఎన్నో సంక్షోభాలు ఎదుర్కొంటున్నాయని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఆహారం, ఇంధనం, ఎరువుల కొరత పెద్ద సవాలుగా మారిందన్నారు. పొరుగు దేశాలతో వివాదాలు, అంతర్గతంగా ఉద్రిక్తతలు, మహమ్మారులతో ఎన్నో దేశాలు అల్లాడిపోతున్నాయని చెప్పారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి ఉమ్మడి ప్రయత్నాలు అవసరమని తెలిపారు. ఆసియా, ఐరోపా ఖండాల్లో శాంతికి, సౌభాగ్యానికి, అభివృద్ధికి ఎస్సీఓ అనేది ఒక కీలకమైన వేదికగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీఓ సభ్య దేశాలతో సహకారం మరింత పెంపొందించుకుంటామని అన్నారు. స్టార్టప్‌లు, నవీన ఆవిష్కరణలు, సంప్రదాయ వైద్యం, యువజనం సాధికారత, డిజిటలీకరణ వంటి రంగాల్లో ఇతర దేశాలతో సంబంధాలు పెంచుకుంటామని వెల్లడించారు. ఎస్సీఓలో సంస్కరణలు, ఆధునీకరణ ప్రతిపాదనకు తమ మద్దతు ఉంటుందని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. షాంఘై సహకార సంస్థలో ఇరాన్ సైతం సభ్యదేశంగా చేరుతుండడం ఆనందంగా ఉందన్నారు. ఎస్సీఓ వర్చువల్ సదస్సులో పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్‌తోపాటు కజకిస్తాన్, కిర్గిజిస్తాన్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ తదితర దేశాల నాయకులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఎస్సీఓ 2001లో షాంఘైలో ఏర్పాటయ్యింది. భారత్ 2005లో ఈ సంస్థలో పరిశీలక దేశంగా చేరింది. 2017లో పూర్తిస్థాయి సభ్యదేశంగా మారింది.



సదస్సులో మోదీ, పుతిన్, జిన్‌పింగ్, పాక్ ప్రధాని షరీఫ్, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసి

ఆసియాలో కొత్త ప్రచ్ఛన్న యుద్ధం వద్దు: జిన్‌పింగ్

బీజింగ్: ఆసియా ప్రాంతంలో కొత్తగా ప్రచ్ఛన్న యుద్ధాన్ని సృష్టించేందుకు బయటి శక్తులు కుట్ర పన్నుతున్నాయని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పరోక్షంగా అమెరికాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఎస్సీఓ వర్చువల్ సదస్సులో మాట్లాడారు. ప్రాంతీయంగా శాంతిని కాపాడుకోవడానికి ఎస్సీఓ సభ్యదేశాలన్నీ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఉగ్రవాదంపై కలిసి పోరాడుదామని పిలుపునిచ్చారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడుతూ... ఇటీవల జరిగిన సాయుధ తిరుగుబాటును రష్యా సమాజం మొత్తం ఒక్కటై వ్యతిరేకించిందని చెప్పారు. మాతృదేశాన్ని కాపాడుకోవడానికి ప్రజలంతా కంకణబద్ధులై ఉన్నారని తెలిపారు. వాగ్నర్ గ్రూప్ యత్నాలను ఆయన ప్రస్తావించారు.

మళ్లీ పేలిన తూటా..

అమెరికాలో 8 మంది మృతి



ఫిలడెల్ఫియాలో ఘటనాస్థలిలో పోలీస్ వాహనాలు

ఫిలడెల్ఫియా: అమెరికాలో 24 గంటల వ్యవధిలోనే మరో రెండు కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆదివారం రాత్రి బాల్టిమోర్‌లో బ్లాక్‌పార్టీపై జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా 28 మంది గాయాలపాలైన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి టెక్సాస్, ఫిలడెల్ఫియాల్లో జరిగిన కాల్పుల ఘటనల్లో 8 మంది ప్రాణాలు కోల్పోగా ఇద్దరు బాలురు సహా మరో 10 మంది గాయపడ్డారు. ఫిలడెల్ఫియాలోని కింగ్‌సెస్సింగ్‌లో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించిన సాయుధుడు వీధుల్లో తిరుగుతూ కనబడిన వారిపైకి కాల్పులు సాగించాడు. సమాచారం అందుకుని పోలీసులు చుట్టుముట్టడంతో అతడు లొంగిపోయాడు. ఆగంతకుడి వద్ద నుంచి ఏఆర్ రైఫిల్, హ్యాండ్‌గన్ స్వాధీనం చేసుకున్నారు. అతడి కాల్పుల్లో అయిదుగురు చనిపోయారు. మరో ఇద్దరు 2, 13 ఏళ్ల బాలురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని పోలీసులు తెలిపారు. మరో ఘటన..టెక్సాస్‌లోని ఫోర్ట్‌వర్త్‌లోస్థానిక ఉత్సవం కోమోఫెస్ట్‌లో పాల్గొన్న జనంపైకి గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా 8 మంది గాయపడ్డారు.

ట్విట్టర్‌కు పోటీగా మెటా 'థ్రెడ్స్'



లండన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమ వేదిక ట్విట్టర్‌కు మరో సవాల్ ఎదురవనుంది. ట్విట్టర్‌ను ఢీకొట్టేందుకు మెటా తాజాగా థ్రెడ్స్ అనే యాప్‌ను సిద్ధం చేసింది. యాపిల్‌కు చెందిన యాప్ స్టోర్‌లో ఇది కనిపిస్తోంది. ట్విట్టర్‌లో మాదిరిగానే దీనిలోనూ టెక్ట్స్ రూపంలో మెసేజీలను లైక్ చేయవచ్చు. షేర్, కామెంట్ కూడా చేయవచ్చని యాప్ స్టోర్ లిస్టింగ్‌లోని స్క్రీన్‌షాట్‌ను బట్టి తెలుస్తోంది. ఒకట్రెండు రోజుల్లోనే ఈ విషయాన్ని మెటా అధికారికంగా ప్రకటించనుందని సమాచారం. ఇది ఇన్‌స్టాగ్రామ్‌కు లింకై ఉన్న 'టెక్ట్స్ బేస్డ్ కన్వర్జేషన్ యాప్'. 'నేటి నుంచి రేపటి ట్రెండింగ్‌లో ఉండే అన్ని అంశాల వరకు చర్చించుకునే సమూహాల కోసమే థ్రెడ్స్' అని మెటా తెలిపింది. ఇన్‌స్టాగామ్ యూజర్లు అదే అకౌంట్లతో కొత్త యాప్‌లోనూ కొనసాగవచ్చునని చెబుతున్నారు. దీనిపై మెటా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఎలాన్ మస్క్ గత ఏడాది ట్విట్టర్‌ను కొనుగోలు చేశాక చేపట్టిన పలు మార్పులపై యూజర్లు అసంతృప్తితో ఉన్న సమయంలో మెటా 'థ్రెడ్స్'ను తేనుండటం గమనార్హం.



ఈ తినుబండారం పేరు ' కీ లైమ్ పై'. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో మన్రో కౌంటీ ఏర్పాటై 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 13 అడుగుల వ్యాసంతో ఇలా భారీ 'కీ లైమ్ పై' తయారుచేశారు. ఇది ప్రపంచ రికార్డు సాధిస్తుందని భావిస్తున్నారు. గుడ్లు, పాలు, నిమ్మరసం తదితరాలను కలిపి లైవ్ పైని తయారు చేశారు.

బీజేపీ రాష్ట్ర శాఖలకు కొత్త సారథులు

ఎన్నికల వేళ బీజేపీ కీలక మార్పులు

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని అధికార బీజేపీ సంస్థాగతంగా కీలక మార్పులు చేపట్టింది. దీంతో, త్వరలోనే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందంటూ కొన్ని రోజులుగా వస్తున్న ఊహాగానాలకు బలం చేకూరినట్లయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో పార్టీకి కొత్త సారథులను నియమించింది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని, ఏపీ చీఫ్‌గా కేంద్ర మాజీ మంత్రి డి.పురందేశ్వరిని నియమించింది. అదేవిధంగా, పంజాబ్ బాధ్యతలు సునీల్ జాఖడ్‌కు, జార్ఖండ్ చీఫ్‌గా బాబూలాల్ మరాండీకి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు బీజేపీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్ బాధ్యతలను ఓబీసీ నేత ఈటెల రాజేందర్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపింది. మరికొద్ది నెలల్లో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండగా అధికార భారత రాష్ట్ర సమితిని దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా ఈ మార్పులు చేపట్టినట్లు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు స్థానంలో కేంద్ర మాజీ మంత్రి డి.పురందేశ్వరికి బాధ్యతలు అప్పగించింది. ఈమె యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. అలాగే, పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు దీపక్ ప్రకాశ్ స్థానంలో రాష్ట్ర కాంగ్రెస్ మాజీ చీఫ్ సునీల్ జాఖడ్‌కు పగ్గాలు అప్పగించింది. అదేవిధంగా, జార్ఖండ్‌లో గిరిజన నేత, సీఎం హేమంత్ సోరెన్‌ను ఢీకొట్టేందుకు అదే వర్గానికి చెందిన మాజీ సీఎం మరాండీని రంగంలోకి దించింది. మరాండీ తన జార్ఖండ్ వికాస్ మోర్చా(ప్రజాతాంత్రిక్)ను 2020లో బీజేపీలో విలీనం చేశారు.



బాబూలాల్



సునీల్ జాఖడ్

అజిత్ పవార్‌కు చేదు అనుభవం

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) చీలికవర్గం నేత అజిత్ పవార్‌కు చేదు అనుభవం ఎదురైంది. రాష్ట్ర సచివాలయం సమీపంలోని రాష్ట్రవాది భవన్‌ను పార్టీ వ్యవహారాల కోసం నూతన కార్యాలయంగా వాడుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. భవనాన్ని స్వాధీనం చేసుకోవడానికి అజిత్ పవార్ వర్గం నేతలు మంగళవారం అక్కడికి వెళ్లగా తలుపులకు తాళంవేసి ఉండడంతో నిరాశ చెందారు. కొందరు యువకులు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. కానీ లోపలి గదులకు తాళాలు వేసి ఉండడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. రాష్ట్రవాది భవన్‌లో గతంలో మహారాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత అయిన అంబదాస్ దన్వే నివసించారు. ప్రభుత్వం మరో భవనం కేటాయించడంతో ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఇలాఉండగా, అసలైన ఎన్సీపీ తమదేనని అజిత్, శరద్ పవార్ వర్గాలు వాదిస్తున్నాయి. ఏ వర్గంలో ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

సెంథిల్ కేసులో హైకోర్టు భిన్న తీర్పులు

కేసును త్రిసభ్య ధర్మాసనం విచారించాలని సుప్రీం ఆదేశం

సాక్షి, చెన్నై: 'క్యాష్ ఫర్ జాబ్స్'ఆరోపణలతో మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ విడుదలకు సంబంధించి మద్రాస్ హైకోర్టు ద్విసభ్య బెంచ్ మంగళవారం భిన్న తీర్పులు వెలువరించింది. దీంతో, త్రిసభ్య ధర్మాసనాన్ని త్వరగా ఏర్పాటు చేసి, విచారణ ముగించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మంత్రి సెంథిల్ అరెస్టు చట్ట విరుద్ధమంటూ ఆయన భార్య మేఘల హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. దీనిపై గత వారం జస్టిస్ నిషా భాను, జస్టిస్ భరత చక్రవర్తిల బెంచ్ ఎదుట వాదనలు ముగిశాయి. మంగళవారం వీరు పరస్పర విరుద్ధమైన తీర్పు ఇచ్చారు. మనీ లాండరింగ్ కేసులో కస్టడీ కోరే అధికారం ఈడీకి లేదని, ఈ పిటిషన్ చెల్లుబాటు అవుతుందని జస్టిస్ నిషా భాను తీర్పు వెలువరించారు. జస్టిస్ భరత చక్రవర్తి మాత్రం.. మేఘల దాఖలు చేసిన పిటిషన్ చెల్లుబాటు కాదన్నారు. కస్టోడియల్ గడువును పెంచడంతోపాటు, అరెస్టులను చట్టబద్ధంగానే భావిస్తున్నామని తీర్పిచ్చారు. దీంతో, వారంలోగా త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి, విచారణను త్వరితగతిన ముగించాలని సుప్రీంకోర్టు మద్రాసు హైకోర్టును ఆదేశించింది.

రాహుల్ గాంధీపై చర్యలు వద్దు

పరువు నష్టం కేసులో జార్ఖండ్ హైకోర్టు ఆదేశాలు

రాంచీ: గతంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇంటి పేరు వ్యవహారంలో పరువు నష్టం కేసును ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి జార్ఖండ్ హైకోర్టు ఊరట కలిగించింది. ఈ కేసు విచారణ కోసం వ్యక్తిగతంగా రాంచీ కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం లేదంటూ మినహాయింపు ఇచ్చింది. ప్రస్తుతానికి రాహుల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌కే ద్వివేదీ ఆదేశాలు జారీ చేశారు. పరువు నష్టం కేసులో తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ రాంచీ ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ రాహుల్ వేసిన పిటిషన్‌పై జార్ఖండ్ హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. తదుపరి విచారణను ఆగస్టు 16వ తేదీకి వాయిదా వేసింది. 2019 ఏప్రిల్‌లో కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ప్రదీప్ మోదీ అనే వ్యక్తి రాంచీ కోర్టులో పరువు నష్టం దావా వేశారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన ట్రక్కు..

10 మంది మృతి, మరో 26 మందికి గాయాలు

ముంబై: అదుపుతప్పిన ఓ ట్రక్కు నాలుగు వాహనాలను ఢీకొట్టి, హోటల్‌లోకి దూసుకెళ్లిన ఘటనలో 10 మంది చనిపోయారు. ఈ ఘటన మహారాష్ట్రలోని ధులే జిల్లాలో చోటుచేసుకుంది. ముంబై-ఆగ్రా హైవేపై ఉన్న పలస్నేర్ గ్రామం వద్ద మంగళవారం ఉదయం ఓ ట్రక్కుకు బ్రేకులు ఫెయిలయ్యాయి. అదుపు తప్పి రెండు బైక్‌లు, ఒక కారు, మరో కంటెయినర్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. ఆపై రహదారి పక్కనే ఉన్న హోటల్‌లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో పది మంది చనిపోగా మరో 26 మంది గాయాలపాలయ్యారు.

తల్లి కొడుతుంటే తట్టుకోలేక..

బీజింగ్: తల్లి కొడుతుంటే తట్టుకోలేని ఓ ఆరేళ్ల బాలుడు బాల్కనీలోకి వెళ్లి అయిదో అంతస్తు నుంచి కిందికి దూకేశాడు. దీంతో ఆ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన జూన్ 25వ తేదీన చైనాలోని అన్హుయి ప్రావిన్స్‌లో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తల్లి కొడుతుండటంతో తాళలేని బాలుడు బాల్కనీలోని ఎయిర్ కండిషనర్‌పైకి చేరుకున్నాడు. అది చూసిన పొరుగువారు కొట్టడం ఆపాలని తల్లిని పదేపదే కోరారు. కిందపడతావు..లోపలికి రమ్మంటూ తల్లి కూడా బాలుడిని గద్దించింది. తీవ్రంగా భయపడిన బాలుడు మాత్రం ఎవరూ ఊహించని విధంగా అంత ఎత్తు నుంచి కిందికి దూకేశాడు. వెంటనే బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాణాపాయం లేదని, పలు చోట్ల ఎముకలు విరిగాయని డాక్టర్లు తెలిపారు. బాలుడు దూకుతున్న ఘటన వీడియోను పొరుగింటి వ్యక్తి చిత్రీకరించి చైనా వెర్షన్ ట్విట్టర్ 'వీబో'లో అప్‌లోడ్ చేయగా కోటి మందికి పైగానే వీక్షించారు. అధికారులు మాత్రం.. బాలుడు బాల్కనీ నుంచి ఇంట్లోకి రావాలనే తల్లి కొట్టిందని, కానీ అతడు ప్రమాదవశాత్తు కింద పడి పోయి ఉంటాడని అంటున్నారు. వారి వైఖరిని నెటిజన్లు తీవ్రంగా తప్పుబడుతున్నారు.



మాస్కోపై డ్రోన్ల దాడి యత్నం భగ్నం

ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేశామన్న రష్యా

మాస్కో: రష్యా రాజధాని మాస్కోపై దాడి చేసేందుకు ఉక్రెయిన్ సైన్యం డ్రోన్లను ప్రయోగించిందా? నిజమేనని చెబుతోంది రష్యా వైమానిక దళం. ఉక్రెయిన్ ప్రయత్నాన్ని భగ్నం చేశామని వెల్లడించింది. ఉక్రెయిన్ సైన్యం మంగళవారం ఐదు డ్రోన్లు ప్రయోగించిందని, వెంటనే ఈ విషయం గుర్తించి మాస్కోలో ఒక విమానాశ్రయాన్ని మూసివేశామని రష్యా ఆర్మీ తెలియజేసింది. మరికొన్ని విమానాలను దారి మళ్లించామని పేర్కొంది. మాస్కోలో గతంలోనూ పలుమార్లు డ్రోన్ దాడులు జరిగిన ఉదంతాలు ఉన్నాయి. రష్యా కిరాయి సైన్యమైన వాగ్నర్ గ్రూప్ చీఫ్ ప్రిగోజిన్ తిరుగుబాటు యత్నం విఫలమైన తర్వాత డ్రోన్‌తో దాడి చేసేందుకు ఉక్రెయిన్ ప్రయత్నించడం ఇదే మొదటిసారి. ఉక్రెయిన్ సైన్యం ఐదు డ్రోన్లను ప్రయోగించగా, వాటిలో నాలుగింటిని కూల్చివేశామని, మరో డ్రోన్‌ను సురక్షితంగా కిందికి దింపామని రష్యా రక్షణ శాఖ తెలియజేసింది. ఈ దాడులతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని మాస్కో మేయర్ సెర్గీ సొబ్‌యానిన్ చెప్పారు. అయితే, ఈ వ్యవహారంపై ఉక్రెయిన్ ఇంకా స్పందించలేదు.

ఇజ్రాయెల్ భారీ సైనిక ఆపరేషన్

జెనిన్: శరణార్థుల శిబిరాల్లో మాటు వేసిన పాలస్తీనా ఉగ్రవాదులను ఏరివేయడం, వారి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయెల్ సేనలు విరుచుకుపడుతున్నాయి. వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థుల క్యాంప్‌లో సోమవారం నుంచి విస్తృతంగా సోదాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం సైతం దాడులు కొనసాగాయి. దీంతో వేలాది మంది పాలస్తీనా శరణార్థులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. దాదాపు 4,000 మంది పాలస్తీనా శరణార్థులు బయటకు వెళ్లిపోయారని జెనిన్ నగర మేయర్ నిడాల్ అల్-ఒబిడీ చెప్పారు. మరోవైపు ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో ఇప్పటిదాకా 10 మంది మరణించారు. వారంతా ఉగ్రవాదులేనని ఇజ్రాయెన్ సైన్యం చెబుతున్నప్పటికీ ఇంకా నిర్ధారణ కాలేదు. పెద్ద సంఖ్యలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని, జెనిన్ క్యాంప్‌లో మసీదు కింద ఉన్న సొరంగాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. జెనిన్ క్యాంప్‌లో ఈ స్థాయిలో సైనిక ఆపరేషన్ జరుగుతుండడం గత 20 ఏళ్లలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వెస్ట్‌బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ వాసులపై ఇటీవలి కాలంలో దాడులు జరుగుతున్నాయి. గతనెలలో జరిగిన కాల్పుల్లో నలుగురు మృతిచెందారు. అంతేకాకుండా పాలస్తీనా ఉగ్రవాదుల కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. దీంతో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూపై అంతర్గతంగా ఒత్తిడి పెరిగింది. తమ పౌరులకు ముప్పుగా పరిణమించిన ఉగ్రవాదులను ఏరివేయాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు తమ సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు. ఇజ్రాయెల్ దాడులను వ్యతిరేకిస్తూ వెస్ట్‌బ్యాంక్‌లు పాలస్తీనా పౌరులు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. జెనిన్ సిటీపై పాలస్తీనాకు చెందిన హమాస్ ఉగ్రవాదులకు గట్టిపట్టుంది. వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలేం, గాజా స్ట్రిప్‌ను 1967లో జరిగిన యుద్ధంలో పాలస్తీనా నుంచి ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. వాటిని తిరిగి తమకు అప్పగించాలని పాలస్తీనా డిమాండ్ చేస్తోంది.



ఇజ్రాయెల్ సైనిక వాహనం వద్ద బాంబు పేలుడు దృశ్యం

భారత కాన్సులేట్‌పై ఖలిస్తానీల దాడి

ఖండించిన అమెరికా ప్రభుత్వం

న్యూయార్క్: అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్‌పై ఖలిస్తానీ మద్దతుదారులు దాడి చేశారు. కార్యాలయానికి నిప్పు పెట్టేందుకు ప్రయత్నించారు. ఇక్కడి కాన్సులేట్‌పై మార్చి 19వ తేదీన కూడా ఖలిస్తానీ వాదులు దాడి చేసిన విషయం తెలిసిందే. తాజా ఘటనను అమెరికా ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. దీనిని నేరపూరిత చర్యగా పేర్కొంది. శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్‌పై దాడికి సంబంధించిన వీడియోను ఖలిస్తానీ వాదులు ఈ నెల 2న ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'హింస హింసను ప్రేరేపిస్తుంది'అంటూ అందులో ఉంది. కెనడా కేంద్రంగా పనిచేసే ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్(కేటీఎఫ్)చీఫ్ హర్దీప్ సింగ్ నిజ్జర్ మృతికి సంబంధించిన వార్తా కథనాలు అందులో ఉన్నాయి. భారత్‌లో మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న నిజ్జర్ తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది. కెనడాలోని ఓ గురుద్వారా వద్ద ఉన్న అతడిని గత నెలలో దుండగులు కాల్చి చంపారు. కాగా, తాజా ఘటనపై అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ సోమవారం ట్వీట్ చేశారు. 'ఈ ఘటనను అమెరికా ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోంది. దౌత్య కార్యాలయాలపై జరిగే దాడులు అమెరికాలో నేరపూరిత చర్యల కిందికి వస్తాయి'అని పేర్కొన్నారు. దాడి ఘటన వీడియోను దక్షిణాసియాకు సంబంధించిన దియా టీవీ ప్రసారం చేసింది. 'ఆదివారం 1.30-2.30 గంటల మధ్య భారత కాన్సులేట్‌కు నిప్పుపెట్టారు. వెంటనే ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. నష్టం స్వల్పం. సిబ్బందికి ఎటువంటి హాని జరగలేదు'అని తెలిపింది. ఇలా ఉండగా, ఈ నెల 8న కాలిఫోర్నియాలోని బర్కెలీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత ఎంబసీ వరకు 'ఖలిస్తాన్ ఫ్రీడం ర్యాలీ'ఉంటుందని సోషల్ మీడియాలో ఒక పోస్టర్ షేర్ అవుతోంది.



కాన్సులేట్‌లో చెలరేగుతున్న మంటలు

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
బుధవారం : 5 : జూలై : 2023

ఆధ్యాత్మికతను చాటుతున్న తంజావూరు పెయింటింగ్స్



కొరుక్కుపేట: తమిళనాడు హ్యాండీ క్రాఫ్ట్స్ ఆర్టిసన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన సృష్టి హస్త కళాకారులు వినూత్నశైలిలో రూపొందించిన తంజావూరు కలెక్షన్స్‌ను చెన్నైలోని ఆళ్వార్ పేట చామియర్స్ రోడ్డులో సుదర్శన్ బిల్డింగ్‌లో కొలువు తీర్చారు. ఈ పెయింటింగ్స్ సందర్శకులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. ప్రత్యేకించి దేవతల పెయింటింగ్స్ ఆధ్యాత్మిక శోభను తలపిస్తున్నాయని, నగరవాసులు ఈ తంజావూరు పెయింటింగ్స్‌ను చూసి తరించాలని అసోసియేషన్ అధ్యక్షులు డి.జగదీషన్ మంగళవారం కోరారు.

న్యూస్‌రీల్

చెన్నై ఎగ్మోర్- తూత్తుకుడి మధ్య ప్రత్యేక రైలు

కొరుక్కుపేట: తూత్తుకుడిలోని పనిమాయ మాత ఆలయ రథోత్సవం సందర్భంగా చెన్నై ఎగ్మోర్ నుంచి తూత్తుకుడికి ప్రత్యేక రైలు నడపనున్నారు. వివరాలు.. తూత్తుకుడి బీచ్ రోడ్డులో ప్రసిద్ధి చెందిన పనిమయ మాతా ఆలయం ఉంది. ఇక్కడ ఏటా 10 రోజుల పాటు ప్రత్యేక ఉత్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 441వ ఉత్సవాన్ని ఈ నెలాఖరు నుంచి 10 రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో రథోత్సవం కోసం సదరన్ రైల్వే చెన్నై నుంచి ప్రత్యేక రైలును నడుపుతోంది. ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై ఎగ్మోర్ - తూత్తుకుడి, తూత్తుకుడి - చెన్నై ఎగ్మోర్ మధ్య రైళ్లు నడుపనున్నారు. ప్రత్యేక రైళ్లను కూడా ఏర్పాటు చేశారు. దీని ప్రకారం, ఆగస్టు 3వ తేదీ గురువారం సాయంత్రం 4.15 గంటలకు చెన్నై ఎగ్మోర్ నుంచి బయలుదేరే ప్రత్యేక రైలు (రైలు నంబర్ 06005) తాంబరం, చెంగల్పట్టు చేరుకుంటుంది. రైలు తరువాత రోజు తెల్లవారుజామున 3.10 గంటలకు విల్లుపురం, తిరుచ్చి, దిండుక్కల్, మదురై, విరుదునగర్, చతుర్, కోవిల్‌పట్టి, తూత్తుకుడి మేలూర్‌కు చేరుకుంటుంది. ప్రత్యేక రైలు (రైలు నెంబర్. 06006) ఆగస్టు 4వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2.15 గంటలకు తుత్తుకుడి నుంచి బయలుదేరి శనివారం తెల్లవారుజామున 2.45 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది. ఈ రైళ్లకు టిక్కెట్లు ముందుగానే బుక్ చేసుకోవచ్చని రైల్వే అధికారులు వెల్లడించారు.

కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న ప్రహరీ

- నలుగురు కార్మికులు మృతి
- మరో ఇద్దరు పరిస్థితి విషమం
- కోయంబత్తూరులో ఘటన

సాక్షి, చెన్నై: కోయంబత్తూరులోని ప్రముఖ విద్యా సంస్థ ఆవరణలో నిర్మాణంలో ఉన్న ప్రహరీ మంగళవారం సాయంత్రం కుప్పకూలింది. పనుల్లో ఉన్న కార్మికులు ఆ శిథిలాల కింద చిక్కున్నారు. ఈ ప్రమాదంలో నలుగురు కార్మికులు బలి అయ్యారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కోయంబత్తూరు కునియా ముత్తురులో ప్రముఖ విద్యా సంస్థ ఉంది. ఇక్కడ కొన్ని భవన నిర్మాణ పనులు, ప్రహరీ నిర్మాణం జరుగుతోంది. ఈ పనుల్లో ఆంధ్రా, ఉత్తరాదికి చెందిన కార్మికులు అధికంగా ఉన్నారు. ఈ పరిస్థితులలో మంగళవారం సాయంత్రం ప్రహరీ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ప్రమాదం జరిగింది. కాసేపు ఆ పరిసరాల్లో వర్షం పడి ఆగింది. అనంతరం పనులు జరుగుతుండగా హఠాత్తుగా నిర్మాణంలో ఉన్న ఎత్తయిన ప్రహరీ కుప్పకూలింది. వీటి శిథిలాల కిందకార్మికులు చిక్కుకున్నారు. స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీశారు. అయితే ఈ ప్రమాదంలో నలుగురు కార్మికులు ఘటనా స్థలంలోనే మరణించారు. మరో ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో చికిత్స నిమిత్తం కోయంబత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రహరీ నిర్మాణ సమయంలో వర్షం పడటం, ఆగటం, ఆ తర్వాత కార్మికులు పనుల్లోకి వెళ్లడంతో తేమ కారణంగా కూలి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ప్రమాద ఘటనపై విచారణ జరుగుతోంది.

గవర్నర్ తీరును ఖండిస్తూ డీఎంకే ఐటీ విభాగం పోస్టర్ల వార్



గవర్నర్‌కు వ్యతిరేకంగా వెలసిన పోస్టర్లు

కొరుక్కుపేట: రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి మాటలను ఖండిస్తూ డీఎంకే ఐటీ టీమ్ సేలంలో పోస్టర్ ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. వివరాలు.. గవర్నర్‌గా ఆర్‌ఎన్ రవి బాధ్యతలు స్వీకరించిన్నప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వంతో విభేదాల పర్వం కొనసాగుతోంది. ఆయన పాల్గొనే కార్యక్రమాల్లో సనాతనకు అనుకూలంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ ద్రవిడ నమూనా పై ప్రశ్నలు సంధిస్తూ గవర్నర్ తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. కాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిన మంత్రి సెంథిల్ బాలాజీ శాఖ లేకుండానే మంత్రిగా కొనసాగేందుకు గవర్నర్ ఆమోదం లభించలేదు. తదనంతరం మంత్రి సర్ సెంథిల్ బాలాజీ రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు. ఈక్రమంలో మా మంత్రిని తొలగించడానికి మీరెవరు..? అంటూ పలు ప్రశ్నలతో కూడిన పోస్టర్లతో గవర్నర్ ఆర్‌ఎన్ రవిని ఖండిస్తూ సేలం నగరమంతా అంటించిన పోస్టర్లు తీవ్ర కలకలం రేపుతున్నాయి.

ధర్మ సంకటం!



మంత్రి సెంథిల్ బాలాజీ కేసులో మద్రాసు హైకోర్టులో బుధవారం 'ధర్మ'సంకటం ఏర్పడింది. ద్విసభ్య ధర్మాసనంలోని న్యాయమూర్తులు మంగళవారం భిన్న తీర్పులను వెలువరించారు. ఒకరు సెంథిల్ అరెస్టు చట్ట విరుద్ధం కాదని, మరొకరు చట్ట విరుద్ధమేనంటూ వేర్వేరు తీర్పులు ఇవ్వడంతో మూడో న్యాయమూర్తి ప్రమేయం తప్పనిసరిగా మారింది. దీంతో ఈ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చినట్లయ్యింది.

భిన్న తీర్పు

- మంత్రి సెంథిల్ బాలాజీ కేసులో కొత్త ట్విస్టు
- ద్విసభ్య ధర్మాసనంలో పరస్పర విరుద్ధంగా తీర్పులిచ్చిన న్యాయమూర్తులు
- మూడో న్యాయమూర్తి రాక అనివార్యం
- వారంలోపు నియమించి తొలి ప్రాధాన్యతగా పరిష్కరించాలన్న సుప్రీంకోర్టు



సాక్షి, చెన్నై: మనీలాండరింగ్ కేసులో మంత్రి సెంథిల్ బాలాజీని గత నెల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తీవ్ర ఉత్కంఠ, నాటకీయ పరిణామాల మధ్య ఈ వ్యవహారం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. విచారణ సమయంలో గుండె పోటు రావడంతో సెంథిల్ బాలాజీని తొలుత ఓమందూరార్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చివరకు హైకోర్టు ఆదేశాలతో కావేరి ఆసుపత్రికి తరలించి బైపాస్ సర్జరీ చేశారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు. ఆయనకు విధించిన రిమాండ్ కాలాన్ని ఈనెల 12వ తేదీ వరకు పొడించారు. అదే సమయంలో సెంథిల్‌ను ఎలాగైనా తమ కస్టడీకి తీసుకోవాలనే ఉద్దేశంతో ఈడీ వర్గాలు తీవ్రంగానే న్యాయ పోరాటం చేస్తూ వస్తున్నాయి. ఇక, తన భర్తను ఈడీ చట్ట విరుద్ధంగా అరెస్టు చేసినట్టు సెంథిల్ సతీమణి మేఘల కోర్టును ఆశ్రయించారు. ఈమేరకు ఆమె హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అలాగే గత నెల 13వ తేదీ రాత్రే విచారణ ముగించినట్టు ఈడీ పేర్కొందని, అయితే మరుసటి రోజు ఉదయం రెండు గంటల అనంతరం అరెస్టు చూపించారని కోర్టుకు వివరించారు. ఈ రెండుగంటల పాటు తన భర్తను ఎక్కడ ఉంచారో..? ఏం చేశారో..? అన్ని వివరాలను కోర్టుకు ఈడీ తెలియజేయాలని, తన భర్త అరెస్టును రద్దు చేయాలని కోర్టులో వాదనలు తమ న్యాయవాదుల ద్వారా వినిపించారు. ఈడీ సైతం బలమైన వాదనలను కోర్టు ముందు ఉంచింది. సెంథిల్‌ను చట్టబద్ధంగానే అరెస్టు చేశామని వివరించారు. మెమో తీసుకోక పోవడంతో ఎస్‌ఎంఎస్, ఈమెయిల్ ద్వారా అరెస్టు సమాచారాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశామని వాదించారు. ఆయన్ని ఇంత వరకు తాము విచారించ లేదని పేర్కొంటూనే, ఆయనకు వ్యతిరేకంగా అన్ని ఆధారాలు తమ వద్ద ఉందని కోర్టుకు వివరించారు. వీటిని తారు మారు చేసే పరిస్థితులు ఉన్నట్లు వాదించారు. వారం రోజులు ఈ వాదనలు జరగ్గా, తీర్పు తేదీని ప్రకటించకుండా న్యాయమూర్తులు నిషా భాను, భరత చక్రవర్తి వాయిదా వేశారు.

ఆసక్తికరంగా..

వాదనలను పరిశీలించిన అనంతరం మంగళవారం న్యాయమూర్తులు తీర్పు వెలువరించారు. నిషా భాను తన తీర్పులో ఈ పిటిషన్ విచారణ యోగ్యమేనని పేర్కొన్నారు. సెంథిల్ బాలాజీ అరెస్టును చట్ట విరుద్ధంగా భావిస్తున్నామని ప్రకటించారు. సెంథిల్ ఆస్పత్రిలో ఉన్న కాలాన్ని కస్టోడియల్ గడువు నుంచి మినహాయించాలని ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసి పుచ్చారు. అదే సమయంలో ఈ తీర్పునకు భిన్నంగా న్యాయమూర్తి భరత చక్రవర్తి తీర్పు వెలువరించారు. మేఘల పిటిషన్ విచారణ యోగ్యం కాదని స్పష్టం చేశారు. అరెస్టు అనంతరం సెంథిల్ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని, ఈ వ్యవహారాలన్ని చట్టబద్ధంగానే జరిగినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. అలాగే కస్టోడియల్ గడువును పెంచుతున్నట్టు ప్రకటించారు. కావేరి ఆస్పత్రిలో వైద్యుల సూచన మేరకు ఆయన చికిత్సలో ఉన్నారని , ఆతదుపరి పరిణామాలతో జైలుకు పంపించడం లేదా, ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకోవచ్చు అని సూచించారు. ఒకరు చట్ట విరుద్ధమని, మరొకరు చట్టబద్ధంగానే అరెస్టు జరిగినట్టు భిన్న తీర్పు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. భిన్న తీర్పుల నేపథ్యంలో ఈకేసులోకి మూడో న్యాయమూర్తి ప్రమేయం అవశ్యమైంది. దీనిపై హైకోర్టు సీజే ఎస్వీ గంగాపూర్వాలకు ద్విసభ్య బెంచ్ సిఫార్సు చేసింది. న్యాయమూర్తుల మధ్య భిన్న తీర్పుపై సీనియర్ న్యాయవాది ఎన్ఆర్ ఇలంగో స్పందిస్తూ, కొన్ని కేసుల్లో భిన్న తీర్పులు సహజమేనని, ఇది వరకు భిన్న తీర్పులు వెలువరించిన కేసులను గుర్తు చేశారు. మూడో న్యాయమూర్తి ఎదుట బలమైన వాదనలు ఉంచుతామన్నారు.

వారంలో మూడో న్యాయమూర్తి నియామకం

సెంథిల్ బాలాజీ సతీమణి మేఘల దాఖలు చేసిన పిటిషన్‌పై ఓ వైపు హైకోర్టులో భిన్న తీర్పు వెలువడిన నేపథ్యంలో ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు సైతం చేరింది. సెంథిల్ బాలాజీని కావేరి ఆసుపత్రికి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో ఈడీ దాఖలు చేసిన అప్పీలు పిటిషన్ కూడా మంగళవారమే విచారణకు వచ్చింది. కేసులో ఆధారాలను తారు మారు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, విచారణలో జాప్యం జరిగే కొద్ది కేసు వీగి పోయే పరిస్థితులు ఉన్నాయని ఈడీ తరపు న్యాయవాదులు సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంలో హైకోర్టు సైతం భిన్న తీర్పును వెలువరించిన విషయాన్ని ప్రస్తావించారు. వాదనల అనంతరం వారం రోజుల్లో మూడో న్యాయమూర్తి నియామకం జరగాలని, తొలి ప్రాధాన్యతగా పరిగణించి కేసును త్వరితగతిన విచారించి తీర్పు వెలువరించాలని హైకోర్టుకు సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కాగా, సెంథిల్ వ్యవహారంలో మూడో న్యాయమూర్తి ప్రమేయంతో మళ్లీ కేసు మొదటికి వచ్చినట్లయ్యిందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

మరింతగా 'సీఎం అల్పాహారం' విస్తరణ

- రూ. 404 కోట్ల నిధుల కేటాయింపు
- మరో 31 వేల బడుల్లో అమలుకు నిర్ణయం

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో సీఎం అల్పాహార పథకాన్ని మరింతగా విస్తరించనున్నారు. ఇందుకోసం రూ. 404 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. మంగళవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులలో అధిక శాతం మంది ఉదయం వేళల్లో అల్పాహారం తీసుకోవడం లేదనే విషయం ఇటీవల ఓ సర్వేలో వెలుగు చూసిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వ బడుల్లో ఉదయం వేళల్లో విద్యార్థులకు అల్పాహారం అందించాలని సీఎం స్టాలిన్ నిర్ణయించారు. తొలి విడతగా ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు గత ఏడాది 1,541 పాఠశాల్లో ఈ పథకం అమల్లోకి వచ్చింది. సీఎం అల్పాహారం(బ్రేక్‌ఫాస్ట్) పేరిట ఈ పథకం విజయవంతంగా అమలవుతోంది. ఈ పథకంలో భాగంగా రోజూ పిల్లలకు ఉప్మా, కిచ్చడి, పొంగల్ వంటి పదార్థాలను అల్పాహారంగా అందజేస్తూ వస్తున్నారు.



అల్పాహార పథకం ప్రారంభోత్సవంలో సీఎం స్టాలిన్ (ఫైల్)

15.75 లక్షల మందికి..

ఈ పథకాన్ని మరింత విస్తరించాలని సీఎం స్టాలిన్ నిర్ణయించారు. ఇందు కోసం రూ. 404 కోట్లను కేటాయించారు. ఇదివరకు 1,545 ప్రాథమిక పాఠశాలలో ఈ పథకం అమలుకు రూ. 33. 56 కోట్లు కేటాయించారు. తాజాగా పథకం విస్తరణకు రూ. 404 కోట్లను కేటాయిస్తూ కార్పొరేషన్, మునిసిపాలిటీ, పట్టణ పంచాయతీల పరిధి 31 వేల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పథకం అమలుకు చర్యలు తీసుకున్నారు. తద్వారా 15.75 లక్షల మంది విద్యార్థులకు దీని ద్వారా లబ్ధి చేకూరనుంది.

వైగై నదిలో అమ్మవారి విగ్రహం లభ్యం

అన్నానగర్: వైగై నదిలో అమ్మవారి విగ్రహం, దీపపు స్తంభాన్ని అధికారులు గుర్తించారు. వివరాలు.. శివగంగై జిల్లా తిరుప్పువనం వైగై నదిపై హైలెవల్ ఫ్లైఓవర్ నిర్మించి ఏళ్లు గడిచాయి. ఈ స్థితిలో వంతెన కింద స్తంభాల పగుల ప్రాంతంలో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. సోమవారం జేసీబీతో తవ్వకాలు చేస్తుండగా దాదాపు 10 అడుగుల లోతులో ఓ అమ్మవారి విగ్రహం, దీపం బయల్పడ్డాయి. తిరుపువనం తహసీల్దార్ కణ్ణన్ వాటిని స్వాధీనం చేసుకుని పురావస్తుశాఖకు అప్పగించారు. పరిశోధనల తర్వాత ఇవి ఏ కాలానికి సంబంధించినవో అధికారులు తేల్చనున్నారు.

ఔరా.. ఎలుకల మహత్యం!



- గంజాయి కేసులో ఇద్దరు నిందితుల విడుదల

సాక్షి, చెన్నై: ఎలుకల పుణ్యమా అంటూ గంజాయి కేసు నుంచి ఇద్దరు నిందితులు విడుదలయ్యారు. పట్టుబడ్డ గంజాయిలో సగానికి సగం ఎలుకలు తినేయడం, పోలీసులు కోర్టుకు ఆధారాలు సమర్పించక పోవడంతో కేసు కొట్టి వేస్తూ నిందితులను మంగళవారం మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలు.. రెండేళ్ల క్రితం మెరీనా బీచ్ పరిసరాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లుగా ఆ ప్రాంతానికి చెందిన రాజగోపాల్, నాగేశ్వరరావును పోలీసులు అరెస్టు చేశారు. వీరిని కటకటాల్లోకి నెట్టారు. ఈ కేసు విచారణ చెన్నై హైకోర్టు ఆవరణలోని మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రత్యేక కోర్టులో సాగుతూ వచ్చింది. చార్జ్‌షీట్‌లో ఆ ఇద్దరి నుంచి 22 కేజీలు పట్టుకున్నట్లు మెరీనా పోలీసులు కోర్టుకు వివరించారు. ఇందులో కొంత పరిశోధనకు పంపించగా, మిగిలిన 21 కేజీల 900 గ్రాములను భద్రత పరిచామని పేర్కొన్నారు. అయితే కోర్టుకు విచారణ సమయంలో పట్టుబడ్డ మొత్తం గంజాయి కాకుండా కేవలం 11 కేజీలు మాత్రమే సమర్పించారు. మిగిలిన గంజాయి ఎక్కడఅని కోర్టు ప్రశ్నించగా, ఎలుకలు తినేసినట్టు మెరీనా పోలీసులు సమాధానం ఇవ్వడం ఇటీవల చర్చకు దారి తీసింది. ఈ పరిస్థితుల్లో ఈకేసు తుది విచారణ ముగియడంతో మంగళవారం తీర్పు వెలువడింది. చార్జ్‌షీట్‌లో పేర్కొన్నట్లుగా గంజాయిని కోర్టులో సమర్పించక పోవడం, ఆధారాలు సరిగ్గా లేక పోవడంతో కేసును కోర్టు కొట్టి వేసింది. ఇద్దరు నిందితులను విడుదల చేసింది. ఎలుకల పుణ్యమా ఈఇద్దరు జైలు శిక్ష నుంచి బయట పడటం గమనార్హం. ఇదిలా ఉండగా ఇటీవల కోయంబేడు పోలీసులు పట్టుకున్న 33 కేజీల గంజాయిలో 19 కేజీలను ఎలుకలు తినేసినట్టుగా కోర్టుకు వివరాలు సమర్పించిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులు బయట పడ్డారు. అదే సమయంలో పట్టుబడ్డ గంజాయిని భద్ర పరచడంలో పోలీసులు విఫలమయ్యారా? లేక ఎలుకల పేరిట గంజాయిని బయటకు పంపించి సొమ్ము చేసుకున్నారా? అనే పోస్టులు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్నాయి.

చౌక దుకాణాల్లో కిలో టమాటా రూ. 60

- చెన్నైలో 82 చోట్ల విక్రయాలకు శ్రీకారం

సాక్షి, చెన్నై: చౌక దుకాణాల్లో టమాటా విక్రయాలకు ప్రభుత్వం మంగళవారం శ్రీకారం చుట్టింది. తొలి విడతగా చెన్నైలో 82 చోట్ల విక్రయాలు జరుగుతున్నాయి. కిలో టమాటా ధర రూ. 60గా నిర్ణయించారు. వివరాలు.. గత వారం రోజులుగా రాష్ట్రంలో టమాటా ధర అమాంతం పెరుగుతూ వచ్చిన విషయం తెలిసిందే. బయటి మార్కెట్‌లో మంగళవారం కొన్ని చోట్ల కిలో రూ. 110, మరి కొన్ని చోట్ల రూ. 120 వరకు ధర పలికింది. దీంతో ధర కట్టడే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయినా, బయటి మార్కెట్‌లో ధర దిగి రావడం లేదు. దీంతో ప్రభుత్వమే టమాటా విక్రయాలపై దృష్టి పెట్టింది. తోట, ఉద్యానవన శాఖ నేతృత్వంలో పండించిన పంటలు, ఇతర ప్రాంతాలలో, రైతుల వద్ద నేరుగా ప్రభుత్వమే టమాటాలను కొనుగోలు చేసి ప్రజలకు తక్కువ ధరకు అందించేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా తొలి విడతగా చెన్నైలోని చౌక(రేషన్) దుకాణాలలో టమాటా విక్రయాలకు శ్రీకారం చుట్టారు. ఉత్తర, మధ్య, దక్షిణ చెన్నై పరిధిలోని 82 చౌక దుకాణాలను ఎంపిక చేసి కిలో టమాటా రూ. 60కు విక్రయిస్తున్నారు. ఒకరికి ఒక కేజీ చొప్పున మాత్రమే అందజేస్తున్నారు. ఒక్కో దుకాణంలో 50 నుంచి 100 మందికి తొలి రోజు విక్రయాలు జరిగాయి. టమాటా విక్రయాలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో చెన్నైలో ముందుందు ధర దిగి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా టమాటా విక్రయాలకు చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా, టమాటాను తలదన్నే విధంగా బయటి మార్కెట్‌లో చిన్న ఉల్లి, అల్లం, పచ్చి మిరప ధరలు అమాంతంగా పెరగడం గమనార్హం. మంగళవారం పచ్చి మిరప కిలో రూ.120, అల్లం రూ. 250, చిన్న ఉల్లి రూ. 150 ధర పలికింది.




రేషన్ దుకాణంలో విక్రయిస్తున్న టమాటాలు

ఎడతెగని 'వాటా' పంచాయితీ

- 'కావేరి' కోసం డెల్టా రైతుల ఎదురు చూపు
- రాష్ట్ర నీటి వాటా కోసం యత్నాలు ముమ్మరం
- యాజమాన్య బోర్డు వద్దకు చేరిన వ్యవహారం
- కర్ణాటక తీరుపై తమిళ నేతల గరంగరం



డ్యాం నుంచి కాలువలకు వదులుతున్న నీరు



మేట్టూరు జలాశయం (ఇన్‌సెట్‌లో) మీడియాతో మాట్లాడుతున్న మంత్రి దురై మురుగన్

సాక్షి, చెన్నై: కావేరి జలాల కోసం డెల్టా రైతులలో ఎదురు చూపులు పెరిగాయి. వాట నీటి పంపిణీ కోసం రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రయత్నాలు చేపట్టింది. కావేరి యాజమాన్య సంస్థ వద్ద పంచాయతీకి సిద్ధమయ్యారు. వివరాలు.. కావేరి ఒప్పందం మేరకు ఏటా తమిళనాడుకు 177.25 టీఎంసీల నీటిని కర్ణాటక విడుదల చేయాల్సి ఉంది. గత మూడేళ్లుగా నీటి కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. కర్ణాటకలో వర్షాలు సంమృద్ధిగా పడడంతో తమిళనాడు వైపుగా ఉబరి నీరు ఉధృతంగా ప్రవహించింది. గత ఏడాది పలు మార్లు డెల్టా వర ప్రదాయిని మేట్టూరు జలాశయం నిండింది. దీంతో ఈ ఏడాది వేసవిలోనూ జలాశయంలో నీటి మట్టం తగ్గలేదు. దీంతో నిర్ణీత సమయం మేరకు గత నెల 12వ తేదీన జలాశయం నుంచి సాగుకు నీటిని విడుదల చేశారు. నీటి విడుదల రోజున డ్యాంలో నీటిమట్టం 103 అడుగులు ఉండేది. గత 23 రోజులలో డ్యాంలో నీటి మట్టం క్రమంగా తగ్గింది. సాగు నిమిత్తం డెల్టా జిల్లాల వైపునా సెకనుకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో లక్షలాది ఎకరాల్లో రైతులు సాగుబడిపై దృష్టి పెట్టారు. అయితే ప్రస్తుతం డ్యాం నీటిమట్టం తగ్గడంతో రైతుల్లో కలవరం బయలుదేరింది. అదే సమయంలో కర్ణాటక నుంచి వాటాగా జూన్‌లో 9.19 టీఎంసీలు నీరు రావాల్సి ఉంది. అయితే, కేవలం 2.83 టీఎంసీలు మాత్రమే ఇచ్చారు. జూలైలో 31.24 టీఎంసీల నీళ్లు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఇంత వరకు కర్ణాటక నుంచి నీటి జాడ కానరావడం లేదు. ఇది రైతుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. మరో మూడు నెలలకు సరి పడ్డట్టుగా నీళ్లు సంమృద్ధిగా దక్కేనా అన్న ఎదురు చూపుల్లో పడ్డారు.

ఒత్తిడి తెచ్చేందుకు నీటిపారుదల శాఖ ప్రయత్నాలు

మంగళవారం నాటికి మేట్టూరు జలాశయం నీటి మట్టం 86.77 అడుగులుగా ఉంది. జలాశయంలోకి సెకనుకు 130 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోంది. దీంతో వ్యవసాయానికి నీటి శాతం తగ్గించారు. ప్రస్తుతం సెకనకు 10 వేల క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగిన పక్షంలో డ్యాంలో నీటిమట్టం మరింత తగ్గి రైతులను కలవరంలో పడేసే ప్రమాదం నెలకొంది. దీంతో జూన్ బకాయి. జూలై వాటను కర్ణాటక నుంచి పంపిణీ చేయించుకునేందుకు ప్రయత్నాలపై నీటి పారుదల శాఖ దృష్టి పెట్టింది. అధికారులతో సమావేశానంతరం ఆ శాఖ మంత్రి దురై మురుగన్ మీడియాతో మాట్లాడుతూ, జూలైలో 31. 24 టీఎంసీలు, ఆగస్టులో 45.95 టీఎంసీల నీటిని కర్ణాటక విడుదల చేసిన పక్షంలో మేట్టూరు జలాశయం త్వరితగతిన నిండే అవకాశాలు ఉన్నాయన్నారు. అయితే, ఇంత వరకు నీటిని కర్ణాటక విడుదల చేయలేదని, ఈ వ్యవహారాన్ని కావేరి యాజమాన్య సంస్థ దృష్టికి తీసుకెళ్తూ లేఖ పంపించామన్నారు. నీటి విడుదలే లక్ష్యంగా కర్ణాటకపై ఒత్తిడి తెచ్చే విధంగా యాజమాన్య సంస్థను ఆశ్రయించే పనులు వేగవంతం చేశామన్నారు.

ఎమ్మెల్యే వానతీపై ఫిర్యాదుల హోరు



వానతీ శ్రీనివాసన్

సాక్షి, చెన్నై: బీజేపీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్‌పై కోయంబత్తూరు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో డీఎంకే వర్గాలు ఫిర్యాదులతో హోరెత్తిస్తున్నాయి. ఆమెపై చర్యలకు పట్టుబడుతున్నాయి. వివరాలు.. కోయంబత్తూరు దక్షిణ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ గత వారం జరిగిన ఓ సభలో డీఎంకేపై వ్యాఖ్యల తూటాలను పేల్చారు. డీఎంకే ఎమ్మెల్యేలను, నాయకులను, మహిళా నాయకులను కించపరిచే విధంగా వ్యాంగ్యాస్త్రాలు సంధించారు. ఆ వ్యాఖ్యల వీడియోల ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకోవాలని, కేసులు నమోదు చేయాలని పట్టుబడుతూ జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదులు చేసే పనిలో పడ్డారు. మంగళవారం పొల్లాచ్చి డీఎస్పీని డీఎంకే నాయకులు కలిసి కేసు నమోదు చేయాలని, అరెస్టు చేయాలని పట్టుబట్టారు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రజా ప్రతినిధులను కించ పరిచే విధంగా, అనాగరికంగా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయని వివరించారు. ఫిర్యాదులు హోరెత్తుతుండటంతో ఉన్నతాధికారులతో చర్చించి కేసుల నమోదుపై దృష్టి పెట్టేందుకు కోయంబత్తూరు పోలీసులు సిద్ధమవుతున్నారు.

క్లుప్తంగా

దివ్యాంగ యువతికి గృహ సదుపాయం

సేలం: ప్రమాదంలో తల్లిదండ్రులు, సోదరిని కోల్పోయిన సేలం దివ్యాంగ విద్యార్థిని వైద్య, విద్యా ఖర్చులను ప్రభుత్వమే భరించింది. అంతే కాకుండా ఉచిత గృహ సదుపాయం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, ఆ ఉత్తర్వులను కలెక్టర్ కార్మేగం విద్యార్థినికి అందజేశారు. సేలం జిల్లా కల్పరపట్టి సెవ్వైకాడు ప్రాంతానికి చెందిన వెంకటాచలం మగ్గం కార్మికుడు. అతని భార్య మరియమ్మాళ్. ఈ దంపతులకు పూంగొడి, అముద అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కూతురు అముద దివ్యాంగురాలు. కాగా ఇటీవల సంభవించిన ప్రమాదంలో తల్లిదండ్రులు చెల్లెలు మృతి చెందారు. వెంకటాచలం గత జూన్ 6వ తేదీ అత్త గారింటికి వెళ్లాడు. తన భార్య మరియమ్మాళ్, కూతురు పూంగోడి మరో కుమార్తె ముగ్గురు మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా కారు ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందారు. చిన్న కూతురు అముద మాత్రమే ఇంట్లో ఉండడంతో ప్రాణాలతో బయటపడింది. ప్లస్-2 పరీక్షలో అముద మొదటి మార్కులు సాధించింది. అయితే తల్లిదండ్రులను కోల్పోవడంతో చదువు కొనసాగించలేక పోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విద్యార్థిని అముదకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆమెకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ క్రమంలో ఆ ఉత్తర్వులను కలెక్టర్ కార్మేగం మంగళవారం అముదకు కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

కార్మికుడి హత్య

కొరుక్కుపేట: తిరుచెంగోడ్‌లోని కారికుట్టైలో ఓ యువకుడిని స్నేహితులు హత్య చేసి నీటి గుంటలో మృతదేహాన్ని పడేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. వివరాలు.. నామక్కల్ జిల్లా, తిరుచెంగోడ్ క్రివాలప్ రోడ్డులోని మలైయాడి కుట్టై ప్రాంతంలో నివాసం ఉండే రాజశేఖర్ (28) రిక్షా కార్మికుడు. అతనికి పెళ్లి కాలేదు. సోమవారం రాత్రి తన స్నేహితులతో మాట్లాడుతుండగా వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కోపోద్రిక్తులైన అతని స్నేహితులు రాజశేఖర్‌పై రాళ్లతో దాడి చేసి కత్తులతో నరికి చంపారు. ఆ తర్వాత హత్యను దాచిపెట్టేందుకు శవాన్ని రాళ్లతో కొట్టి కొండపాకలో పడేసి అక్కడి నుంచి పరారయ్యారు. కాగా, నిన్న సాయంత్రం రాజశేఖర్ స్నేహితులు ఐదుగురు ఇన్‌స్పెక్టర్ సెంథిల్‌కుమార్ ఎదుట పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తమ స్నేహితున్ని చంపామని లొంగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేశారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు మలైయాడి కుట్టైకి వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది బావిలో పడిన రాజశేఖర్ మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుచెంగోడు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరువణ్ణామలైలో వస్త్ర సంచులనే ఉపయోగించాలి


భక్తులకు వస్త్ర సంచులను అందజేస్తున్న మంత్రి ఏవా వేలు

వేలూరు: పర్యావరణ పరిరక్షణ కోసం తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయానికి వచ్చే భక్తులకు గుడ్డ సంచులనే అందజేయాలని మంత్రి ఏవా వేలు సూచించారు. చెన్నై నేచర్ సరీవస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు లక్ష గుడ్డ సంచులను అందించే కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అరుణాచలేశ్వరాలయానికి వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నందున ప్లాస్టిక్ కవర్‌లను ఇవ్వకుండా గుడ్డ సంచులను మాత్రమే అందజేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత జిల్లాగా తయారు చేసేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మాణ పనులు జరుగుతున్నాయని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అరుణై మెడికల్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ ఎవా కంభన్, మున్సిపల్ చైర్మన్ తిరుమగన్, ఎక్స్‌నోరా ఇంద్రరాజన్, రెడ్‌క్రాస్ కార్యదర్శి మదియగన్, రచయిత షణ్ముగం, వెంకటేశ పెరుమాల్, పారిశ్రామిక వేత్త విజయరంగన్ పాల్గొన్నారు.

పళ్లిపట్టులో భారీ వర్షం



పళ్లిపట్టు: పళ్లిపట్టు పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం గంట పాటు భారీ వర్షం కురిసింది. పాఠశాలలు ముగిసే సమయానికి జోరు వాన కుమ్మరించడంతో వర్షంలో తడుస్తూ విద్యార్థులు ఇళ్లకు వెళ్లారు. పళ్లిపట్టు, పొదటూరుపేట పరిసర ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకు గాలీవానతో గంటపాటు కురిసిన వర్షానికి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు పంట సాగుకు సమాయత్తమవుతున్నారు. ఇదే విధంగా తిరుత్తణి పరిసర ప్రాంతాల్లో సాయంత్రం 5 గంటల సమయంలో వర్షం కురిసింది.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

వేలూరు: వేలూరు జిల్లాలోని జాతీయ రహదారులకు ఇరు పక్కలా మొక్కలు నాటేందుకు స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అన్నారు. మేల్ మనూరులో జాతీయ రహదారుల శాఖ అద్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పర్యావరణం కాలుష్యం కాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ విధిగా చెట్లు నాటాలని ఇప్పటికే ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే అన్ని పాఠశాల ఆవరణలో విద్యార్థులచే చెట్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించామని, ప్రస్తుతం జాతీయ రహదారులకు ఇరు పక్కలా చెట్లు నాటడం వల్ల రానున్న తరాలకు కాలుష్యం లేకండా స్వచ్ఛమైన గాలిని అందించొచ్చని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల శాఖ చీఫ్ ఇంజినీర్ జయకుమార్, తహసీల్దార్ సెంథిల్ తదితరులున్నారు.

లంచం కేసులో ఉద్యోగి అరెస్టు

కొరుక్కుపేట: వండలూరు సమీపంలోని రత్నమంగళానికి చెందిన రవి చంద్రన్ తనకు చెందిన 61.5 సెంట్ల భూమికి సంబంధించిన పట్టాను మంజూరు చేయాలని రెవెన్యూ శాఖకు అర్జీ పెట్టుకున్నాడు. అయితే ఈ కార్యాలయంలో అసిస్టెంట్ అధికారి రాజా పట్టా ఇచ్చేందుకుగాను రూ. 20 వేలు లంచం అడిగాడు. ఈ డబ్బును చంద్రన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే తర్వాత కూడా అసిస్టెంట్ రాజా మరో రూ.20 వేలు అడగటంతో రవిచంద్రన్ అవినీతి నిరోధక శాఖకు సమాచారం అందించారు. దీంతో వారి సూచనల మేరకు సోమవారం సాయంత్రం రూ. 20 వేలను అసిస్టెంట్ అధికారి తీసుకుంటుండగా దాడి చేసి అరెస్టు చేశారు.

ఘనంగా అల్లూరి జయంతి


అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలుగు వికాససమితి నేతలు

తిరువళ్లూరు: భారతస్వాతంత్ర్య ఉద్యమంలో సాయుధ పోరాటం నడిపిన అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకలను తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలోని పాపన్‌కుప్పంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి వెలుగుల కృష్ణమోహన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగువారి పోరాట సత్తాను ఆంగ్లేయులకు చాటిన గొప్ప యోధుడు అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు. అల్లూరి పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి అల్లూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెలుగు పారిశ్రామికవేత్తలు తోట కృష్ణ, నటరాజన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి


ట్యాంకు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు: అనకట్టు నియోజక వర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నందకుమార్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని మేల్ మనూరు, హూసూరు, తెల్లారు, అరియూర్‌కుప్పం వంటి గ్రామ పంచాయతీల్లో తాగునీటి ట్యాంకులు, బస్ షెల్టర్, పాఠశాల భవణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే ప్రస్తుతం తాగునీటి ట్యాంకులకు భూమి పూజ చేస్తున్నామన్నారు. ఈ పనులను వేగవంతం చేసి ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తమ ప్రభుత్వంలో ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలను చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ పనులను అధికారులతో పాటు ఆయా గ్రామ పంచాయతీలోని ప్రజా ప్రతినిధులు తరచూ తనిఖీ చేసి పనులను వేగవంతం చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో యూనియన్ చైర్మన్ అముద, బీడిఒ విల్సన్, డీఎంకే పార్టీ యూనియన్ కార్యదర్శి జ్ఞానశేఖరన్, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

• ఈవీఎంల పరిశీలన


ఈవీఎంలను పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ స్వర్ణసింగ్, అధికారి విక్రమ్‌ఖాన్

తిరువళ్లూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తిరువళ్లూరులోని గోడౌన్‌లో ఉంచిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లను ఫస్ట్‌లెవల్ చెకింగ్ అబ్జర్వర్ స్వర్ణసింగ్ మంగళవారం పరిశీలించారు. 2024లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం తమ కార్యకలాపాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే ప్రతి జిల్లాలో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లను తనిఖీ చేస్తోంది. రీసెట్టింగ్ చేసి భద్రపరచాలని.. మరమ్మతులకు గురైన వాటిని సరి చేయాలని ఆదేశించింది. అబ్జర్వర్‌గా నియమితులైన స్వర్ణసింగ్, ఎన్నికల విభాగం సెక్షన్ అధికారి విక్రమ్‌ఖాన్, కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీస్, డీఆర్వో ఆశోకన్ తదితరులు తనిఖీ చేశారు. ఈవీఎంల పనితీరుతో పాటు మరమ్మతులకు గురైన వాటిని సరి చేసేలా చర్యలు చేపట్టారు.

గంజాయి సాగు.. రైతు అరెస్టు

అన్నానగర్: నాచియార్ కుప్పం ప్రాంతంలో అరటితోట మధ్యలో గంజాయి సాగు చేసిన రైతును పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. తిరుపత్తూరు సమీపంలోని నాచియార్ కుప్పం ప్రాంతానికి చెందిన రామన్ (62). నాగరాజ్‌కు చెందిన భూమిని కౌలుకు తీసుకుని అరటి సాగు చేస్తున్నాడు. ఈ తోట మధ్యలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు తిరుపత్తూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆల్బర్ట్ జాన్‌కు రహస్య సమాచారం అందింది. దీంతో కురిసిలపట్టు పోలీసులు మంగళవారం ఉదయం అరటి తోట వద్దకు వెళ్లి సోదాలు చేశారు. అప్పుడు రామన్ అరటితోట మధ్యలో ఏడు గంజాయి మొక్కలు పెంచుతున్నాడని తెలిసింది. వెంటనే గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని తొలగించారు. రామన్‌పై కురిసిలపట్టు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోలీవుడ్ టాక్స్

శివభక్తి అధికం అందుకే..!

తమిళసినిమా: పెళ్లయ్యి, బిడ్డకు తల్లి అయిన తరువాత కూడా కథానాయకిలుగా రాణిస్తున్న నటీమణుల్లో కాజల్ అగర్వాల్ ఒకరు. తమిళం, తెలుగు భాషల్లో ప్రముఖ కథానాయికగా నటిస్తున్న సమయంలోనే ఆమె గౌతమ్ కిట్లు అనే వ్యక్తిని 2020లో పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. వీరికి నీల్ అనే కొడుకు కూడా ఉన్నాడు. అయితే బిడ్డకు జన్మనిచ్చిన రెండు నెలలకే కాజల్ అగర్వాల్ నటించడానికి సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఈమె ఇండియన్-2 చిత్రంలో కమల హాసన్ సరసన నటిస్తున్నారు. శంకర్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్ర షూటింగ్ చివరి దశకు చేరుకుంది. అదే విధంగా తెలుగులో బాలకృష్ణకు జంటగా భగవంత్ కేసరి చిత్రంలో నటిస్తున్నారు. కాగా ఇటీవల ఓ భేటీలో పేర్కొంటూ తనకు శివభక్తి అధికమని చెప్పారు. ఎక్కువగా శివుడినే కొలుస్తానన్నారు. అందుకే తన బిడ్డకు శివుని పేరు పెట్టాలని ముందుగానే నిర్ణయించుకున్నానన్నారు. బిడ్డ పుట్టిన తరువాత తన భర్త పిలవడానికి అనువుగా, రాయడానికి సులభంగా ఉండేలా పేరు పెడుతామని చెప్పారన్నారు. దీంతో నీలకంఠుడైన శివుని పేరు లోని రెండు అక్షరాలను తీసుకుని నీల్ అనే పేరును తమ బిడ్డకు నామకరణం చేసినట్లు చెప్పారు. ఇంతకుముందు చంటి పిల్లల తల్లులను చూసినప్పుడల్లా అద్భుతమైన అనుభూతి కలిగేదన్నారు. తాను తల్లినైనా తరువాత నీల్‌ను పెంచుతున్నప్పుడు అలాంటి అనుభూతినే అనుభవిస్తున్నట్లు పేర్కొన్నారు. కొంచెం సమయం తన బిడ్డను వదిలి షూటింగ్‌లకు, జిమ్‌లకు వెళ్లటం చాలా కష్టంగా ఉందన్నారు. అయితే తిరిగి రాగానే బిడ్డ చిరునవ్వులు చూస్తే అంతా పోతుందని కాజల్ అగర్వాల్ పేర్కొన్నారు.



ఏక పాత్రతో మరో ప్రయోగం


ఓంగి అడిచ్చా ఒండ్రాటన్ వెయిటు డా చిత్రంలో ఓ సన్నివేశం

తమిళసినిమా: కొత్తదనాన్ని సినీ ప్రేక్షకులు ఎప్పుడు ఆదరిస్తారు. అలాంటి ఒక ప్రయోగాత్మక చిత్రం 'ఓంగి అడిచ్చా ఒండ్రాటన్ వెయిటు డా'. నటుడు దర్శక నిర్మాత జి.శివ ఒక్కడే నటించిన చిత్రం ఇది. ఈయన ఇంతకు ముందు విరుగం అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. నాగిరెడ్డి శివకుమార్, అరుణ్ సుశీల్ ద్వయం ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి మణి శేఖరన్ సెల్వ సంగీతాన్ని అందించారు. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ.. ఇది మర్డర్ మిస్టరీ కథా చిత్రమని చెప్పారు. సమాజంలో జరుగుతున్న నేర సంఘటనలను ఆవిష్కరించే చిత్రంగా ఉంటుందన్నారు. చిత్రంలో ఒకే పాత్ర నటించినా, ఆ వ్యక్తి శత్రువులతో పోరాడే సన్నివేశాలు విభిన్న తరహాలో ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా చిత్ర క్లైమాక్స్ సన్నివేశాలు అనూహ్య స్థాయిలో ఉంటాయన్నారు. మరో విశేషం ఏమిటంటే ఇందులో మహాశివుడి ప్రత్యక్షం ప్రేక్షకులను అబ్బుర పరుస్తుందన్నారు. ఇది ప్రతీకారం తీర్చుకునే కథా చిత్రం అయినా, ఏకపాత్రతో రూపొందించిన ఈ చిత్రం జనరంజకంగా ఉంటుందన్నారు. త్వరలో తెరపైకి రానున్న ఈ చిత్రాన్ని అర్ధ నారీశ్వర్ మీడియా వర్క్స్ పతాకంపై శ్రీమతి బాల జ్ఞానసుందరం నిర్మించారు. దీని నిర్మాణంలో సాయిబాబా పిక్చర్స్ సంస్థ భాగస్వామ్యం పంచుకుంది. కాగా ఈ చిత్రం ప్రేక్షకులకు కచ్చితంగా సరికొత్త అనుభూతిని కలిగిస్తుందని నిర్మాతలు పేర్కొన్నారు.

డబ్బింగ్ పూర్తి చేసుకున్న అరుణ్ చిత్రం


డబ్బింగ్ చెబుతున్న అరుణ్ విజయ్

తమిళ సినిమా : నటుడు అరుణ్ విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం అచ్చమ్ ఎంబదు ఇల్లయే మిషన్ చాప్టర్ 1. నటి ఎమి జాక్సన్ నాయకిగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎంఎల్ విజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. జీవి ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ఇటీవలే పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఎం.రాజశేఖర్, ఎస్.స్వాతి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. కాగా, ఇటీవలే నటుడు అరుణ్ విజయ్ డబ్బింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా చిత్రానికి సంబంధించిన అప్‌డేట్‌ను ఆయన తన ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. అచ్చమ్ ఎన్బదు ఇల్లయే చిత్ర డబ్బింగ్ పూర్తయిందని.. ప్రస్తుతం సెన్సార్‌కు వెళ్లే ముందు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం మీద ఈ చిత్రంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఇది దర్శకుడు ఏఎల్ విజయ్‌కు నటుడు అరుణ్ విజయ్‌కు చాలా కీలక చిత్రం అవుతుంది. మీరు సరైన సక్సెస్ చూసి చాలా కాలమే అయ్యింది. అదే విధంగా నటి ఎమి జాక్సన్‌కు ఇది కమ్ బ్యాక్ చిత్రం. త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతున్న ఈ చిత్రం తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం భాషల్లో విడుదల హక్కులను లైకా ప్రొడక్షన్స్ సంస్థ పొందడం విశేషం. దీంతో ఈ చిత్రంపై మంచి అంచనాలు నెలకొన్నాయి.

సాల్ట్ అండ్ పెప్పర్ గెటప్‌లో విజయ్ ఆంటోని


వివరాలు వెల్లడిస్తున్న కొలై చిత్ర యూనిట్

తమిళసినిమా: వైవిధ్య భరిత కథా చిత్రాలను చేస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సంగీత దర్శకుడు, నటుడు, నిర్మాత విజయ్ ఆంటోని. ఈయన ఇటీవల పిచ్చైక్కారన్-2 చిత్రంతో దర్శకుడిగా అవతారమెత్తి సక్సెస్ అయ్యారు. కాగా తాజాగా ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రాల్లో కొలై ఒకటి. నటి రిత్విక సింగ్, మీనాక్షి చౌదరి నాయకలుగా నటించిన ఇందులో రాధిక శరత్ కుమార్, మురళీ శర్మ, సిద్ధార్థ శంకర్ , కిషోర్ కుమార్, జాన్ విజయ్, అర్జున్ చిదంబరం తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఇన్ఫినిటి ఫిలిం వెంచర్స్, లోటస్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి బాలాజీ కె.కుమర్ దర్శకుడు. ఈయన ఇంతకు ముందు విడియుమ్ వరై అనే చిత్రాన్ని తెరకెక్కించారన్నది గమనార్హం. కాగా నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న కొలై చిత్రం ఈనెల 21వ తేదీన తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాతలు సోమవారం సాయంత్రం చెన్నైలోని మార్క్ స్టూడియోలో మీడియాతో సమావేశమయ్యారు. నిర్మాతల్లో ఒకరైన ధనుంజయన్ మాట్లాడుతూ కొలై చిత్రం 2021 లోనే నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుందని అయితే నటుడు విజయ్ ఆంటోనీ తాను దర్శకత్వం వహించిన పిచ్చైక్కారన్ -2 చిత్రం తర్వాత విడుదల చేయాలని చెప్పడంతో తాము వేచి ఉన్నామని చెప్పారు. మరో విషయం ఏమిటంటే ఈ చిత్ర సీజీ వర్క్ సుమారు ఏడాది పాటు నిర్వహించినట్లు చెప్పారు. చిత్రం చాలా బాగా వచ్చిందని చెప్పారు. దర్శకుడు బాలాజీ కె కుమార్ మాట్లాడుతూ తనకు క్రైమ్ థ్రిల్లర్ కథా చిత్రాలు అంటే ఇష్టం అన్నారు. అందుకే అలాంటి నేపథ్యంలో చిత్రాలు చేస్తున్నట్లు చెప్పారు. తనకు పుస్తకాలు చదివే అలవాటు ఉందన్నారు. వాటి ఇన్స్పిరేషన్ తో ఒక యదార్థ ఘటనతో పోలీసులు పరిష్కరించలేని సంఘటన ఆధారంగా తెరకెక్కించిన చిత్రం కొలై అని తెలిపారు. ఇందులో నటుడు విజయ్ ఆంటోని ఇన్వెస్టిగేషన్ డిటెక్టివ్ గా నటించారని, ఆయన గెటప్ సాల్ట్ అండ్ పెప్పర్ గా కొత్తగా ఉంటుందని చెప్పారు.

మరో లేడీ ఓరియంటెడ్ చిత్రంలో నయన్



తమిళ సినిమా: నటి నయనతారకు అవకాశాలు తగ్గేదెలా అంటున్నాయి. ఇటీవల ఆశించిన విజయాలు లేకపోయినా చేతినిండా చిత్రాలతో ఈ సంచలనటి బిజీగా ఉన్నారు. షారుక్ ఖాన్‌కు జతగా నటించిన తొలి హిందీ చిత్రం జవాన్ సెప్టెంబర్ 7వ తేదీన తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. అంతకుముందుగా అంటే ఆగస్టు 25న తమిళంలో జయం రవి సరసన నటించిన ఇరైవన్ చిత్రం విడుదలకు సిద్ధం అవుతోంది. తని బరువన్ వంటి విజయవంతమైన చిత్రం తర్వాత నయనతార జయం రవి కలిసి నటించిన చిత్రం ఇది. కాగా ప్రస్తుతం నవదర్శకుడు నీలేష్ కృష్ణ దర్శకత్వంలో నయనతార తన 75వ చిత్రంలో నటిస్తున్నారు. ఇది లేడీ ఓరియంటెడ్ కథా చిత్రం ఇందులో నటుడు జయ్ హీరోగా నటిస్తున్నారు. రత్నకుమార్ దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రాన్ని ఇంతకుముందు కార్తీ కథానాయకుడిగా సర్దార్ వంటి పలు సక్సెస్ ఫుల్ చిత్రాలను నిర్మించిన ప్రిన్స్ పిక్చర్స్ సంస్థ నిర్మించనుందని తెలిసింది.

నయనతార

క్లుప్తంగా

నీరు అనుకుని రసాయనిక మందు తాగి..

అన్నానగర్: నీరు అనుకుని ఎద్దుల కాళ్లకు వాడే మందును తాగి వ్యక్తి మృతిచెందాడు. రామనాథపురం జిల్లా తిరువాడన్ తాలూకా అట్టకుడి గ్రామంలో సోమవారం ఎడ్ల బండ్ల పోటీలు జరిగాయి. ఇందులో పాల్గొనేందుకు శివగంగై జిల్లా వలమూతికి చెందిన ఇళంగో (55) వెళ్లాడు. ఇందు కోసం ఎండ్ల కాళ్లకు స్ప్రే చేసే మందు తీసుకెళ్లాడు. పొరపాటున నీరు అనుకుని దాన్ని తాగేశాడు. కొద్దిసేపటి తర్వాత స్పృహతప్పి పడిపోయాడు. అక్కడున్న వాళ్లు గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. తిరువాడనై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంపతుల దారుణ హత్య

అన్నానగర్: ప్రేమ వివాహం చేసుకున్న జంటను కత్తులతో నరికి హత్య చేసిన ఘటన ఉప్పిలియాపురంలో సోమవారం రాత్రి జరిగింది. తిరుచ్చి జిల్లా ఉప్పిలియపురం సమీపంలోని బి.మేట్టూరు ప్రాంతానికి చెందిన రాజ్‌కుమార్ (29) రైతు. సోఫానాపురానికి చెందిన శారద(20) రెండేళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు పిల్లలు లేరు. తోటలోని ఇంట్లో ఈ దంపతులు నివసిస్తున్నారు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో విజయశేఖరన్ మోటార్ సైకిల్ పై తోట మీదుగా వెళ్లాడు. అక్కడ రక్తపు మడుగులో పడి ఉన్న రాజ్‌కుమార్, శారదలను చూసి షాక్‌కు గురయ్యాడు. వెంటనే ఉప్పిలియపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ సుజిత్ కుమార్ ఆధ్వర్యంలో లాల్‌గుడి డీఎస్పీ అజయ్ రత్నం, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో మెడ, తలపై నరికి హత్య చేసినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి హంతకుల కోసం గాలిస్తున్నారు.

భార్య గొంతు కోసిన భర్త


రోజా (ఫైల్)

కొరుక్కుపేట: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త బ్లేడుతో ఆమె గొంతు కోసి హత్య చేశాడు. పెళ్లయిన రెండు నెలలకే ఇలా జరగడంతో స్థానికంగా విషాదం నెలకొంది. వివరాలు.. కడలూరు జిల్లా భువనగిరి సమీపంలోని కిలాను వంపటు గ్రామానికి చెందిన సిలంబరసన్ (35)కు రెండు నెలల క్రితం రోజా(27)తో వివాహమైంది. సోమవారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన సిలంబరసన్ తన బ్లేడ్ తీసుకుని భార్య గొంతు కోసుకోసేశాడు. తీవ్ర రక్త స్రావం కావడంతో మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిదంబరం రాజా ముత్తయ్య ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు. సిలంబరసన్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

చీటీల పేరుతో రూ.కోటి మోసం

అన్నానగర్: ఉలుందూరుపేటలో చీటీలు నిర్వహించి రూ.కోటి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు మంగళవారం డీఐజీకి ఫిర్యాదు చేశారు. కళ్లకురిచ్చి జిల్లా ఉలుందూరుపేట తాలూకా సెందనాడు, నదియపట్టు, ఒల్లియంపాళయం, గూ.కల్లకురిచ్చి, అరియానట్టం, ఇలావతడి తదితర గ్రామస్తులు మంగళవారం విల్లుపురం డీఐజీని కలిశారు. సెందనాడు గ్రామంలో ముగ్గురు నెలవారీ వేలం చీటీ నిర్వహించేవారని తెలిపారు. ఒక్కొక్కరు రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు చెల్లించామని.. గడువు ముగిసినా నగదు ఇవ్వలేని పేర్కొన్నారు. గట్టిగా ప్రశ్నిస్తే చంపేస్తామని బెదిరించారని.. కొద్ది నెలల క్రితం నిందితులు ముగ్గురూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని తెలిపారు. రూ.కోటి వరకు వసూలు చేసి 70 మందిని మోసం చేశారని చెప్పారు. ఆ ముగ్గురిపై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డీఐజీకి వినతిపత్రం సమర్పించారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని డీఐజీ తెలిపారు.

డిజిటల్ రంగంలో పెట్టుబడులు

సాక్షి, చెన్నై: గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో కార్ టెక్ 30 మిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టేందుకు నిర్ణయించింది. ఏ 91 భాగస్వాములతో కలిసి ఈ పెట్టుబడులు పెట్టనున్నట్టు చెన్నై ఆధారిత కార్ టెక్ సంస్థ సీఈఓ మారన్ నాగరాజన్ తెలిపారు. పర్యావరణ వ్యవస్థలో ఐపీ అండ్ డిజిటల్ సేవల్లో ప్రత్యేకతను చాటుతున్నామని వివరించారు. తాజా పెట్టుబడులతో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, కన్సల్టింగ్ సేవలకు మరింత ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు.

అర్జున్ సంపత్‌కు నిరసన సెగ

సాక్షి, చెన్నై : హిందూ మున్నని నేత అర్జున్ సంపత్‌పై వీసీకే నేతలు తిరగ బడ్డారు. దీంతో తన ప్రసంగాన్ని మధ్యలో ఆపేసి ఆయన వెళ్లిపోయారు. వివరాలు.. నాగపట్నం జిల్లా నాగూర్‌లో సోమవారం రాత్రి జరిగిన ఓ సభలో అర్జున్ సంపత్ పాల్గొన్నారు. వీసీకే నేత తిరుమావళవన్‌ను టార్గెట్ చేసి ఆయన వ్యాఖ్యల తూటాలు పేల్చారు. లౌడ్ స్పీకర్ల ద్వారా హోరెత్తుతున్న ప్రసంగాన్ని విన్న వీసీకే నాయకులు, కార్యకర్తల్లో ఆగ్రహం రేగింది. పెద్దఎత్తున వీసీకే వర్గాలు ఆ సభ వేదిక వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. అక్కడే ఉన్న పోలీసులు వీరిని అడ్డుకున్నారు. అయినా వీసీకే వర్గాలు ఏమాత్రం తగ్గలేదు. పరిస్థితి ఉత్కంఠకు దారి తీయడంతో అర్జున్ సంపత్ తన ప్రసంగాన్ని ఆపేసి కారు ఎక్కి ఉడాయించారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది. కాగా సంపత్‌పై చర్యలకు పట్టుబడుతూ పోలీసులకు వీసీకే వర్గాలు మంగళవారం ఫిర్యాదు చేశాయి.

ఫైనాన్షియర్ హత్య కేసులో కానిస్టేబుల్ అరెస్టు



తిరువొత్తియూరు: మధురవాయల్‌లో సినిమా ఫైనాన్షియర్ హత్య కేసులో పోలీసు కానిస్టేబుల్ అరెస్టు అయ్యాడు. హంతకులకు సహకరించినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. చెన్నై నొలంబూర్ ప్రాంతానికి చెందిన వెంకటరామణ ఫైనాన్స్ వ్యాపారి. ఇతని వద్ద మైలాడుదురైకి చెందిన బాపూజీ పనిచేస్తున్నాడు. బాపూజీ వసూలు చేసిన నగదును తన చేతివటం ఉపయోగించినట్లు.. 2.50 సవర్ల నగదు చోరీ చేసినట్లు తెలిసింది. దీని గురించి బాపూజీపై అలంపూర్ పోలీసులకు వెంకటరమణ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీ రాత్రి కోయంబేడులో నిలబడి ఉన్న బాపూజీని వెంకటరమణ సహచరులతో కలిసి కారులో కిడ్నాప్ చేశాడు. తర్వాత బాపూజీనీ హత్య చేసి, మృతదేహాన్ని దహనం చేశారు. దీనిపై విచారణ జరిపిన కోయంబేడు బస్‌స్టేషన్ పోలీసులు వెంకటారామన్, అతని సహచరులు మధురవాయలకు చెందిన శరవణన్, దిలీప్, సహాయ నటుడు పురుషవాక్కంకు చెందిన నవీన్ గోపి, న్యాయవాది గోపాలకృష్ణ, గోపి కిషోర్, కార్తికేయన్, కార్తీక్ తదితర ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో బాపూజీ కిడ్నాప్ చేసి నగ్నంగా చేసి దాడి చేసిన వ్యవహారంలో వెంకటరమణ ఇంటికి పూందమల్లి క్రైమ్ విభాగం పోలీసు అమల్‌రాజ్, కానిస్టేబుల్ వెంకటరామన్ వచ్చి వెళ్లినట్టు తెలిసింది. సంఘటన జరిగిన రోజున ఇంటిలో మద్యం తాగి అమల్‌రాజ్ ఒక గంట సమయం పైగా ఉన్నట్లు తెలిసింది. ఈ సంఘటన తరువాతే బాపూజీ హత్యకు గురై దహనం చేసినట్లు తెలిసింది. అయితే పోలీస్ కానిస్టేబుల్ కిడ్నాప్ చేసిన సంఘటన చూసినా జరుగుతున్న నేరాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయకుండా వారికి సహకరించినట్లు గుర్తించారు. హత్య కేసులో 9వ నేరస్తుడిగా అమల్‌రాజ్‌ను చేర్చారు. దీంతో కోయంబేడు బస్ స్టేషన్ పోలీసులు సోమవారం అమల్‌రాజ్‌ను అరెస్టు చేశారు. అతన్ని పుళల్ జైలుకు తరలించారు.

వియత్నాంలో వైద్య విద్యా అవకాశాలు



ప్రసంగిస్తున్న దీపా తదితరులు

సాక్షి, చెన్నై: వియత్నాం ప్రభుత్వ వైద్య విద్యా సంస్థతో ఐరా ఓవర్సీస్ స్టడీస్ తాజాగా విద్యా ఒప్పందాలు కుదుర్చుకుంది. భారతీయ విద్యార్థులకు వైద్యకోర్సులలో అవకాశాలు మెరుగు పరిచే విధంగా ఈ ఒప్పందాలు జరిగాయని ఐరా ఓవర్సీస్ స్టడీస్ డైరెక్టర్ దీపా తెలిపారు. మంగళవారం చెన్నైలో వియత్నా మెడికల్ ఎడ్యుకేషన్ కాన్‌క్లేవ్ – 2023 కార్యక్రమం జరిగింది. అక్కడి ప్రభుత్వ వైద్య విద్యా సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరై వైద్యకోర్సుల, అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా దీపా మాట్లాడుతూ, కెన్ థో యూనివర్సిటీ ఆఫ్ మెడిసిన్ అండ్ ఫార్మసీ సహకారంతో వియత్నాం ప్రభుత్వ వైద్య విద్యా సంస్థతో జత కట్టినట్టు వివరించారు. భారతీయ విద్యార్థులకు వివిధ వైద్యకోర్సులు, కార్యక్రమాలను దరిచేర్చేవిధంగా ఈ ఒప్పందాలు జరిగినట్టు చెప్పారు. విద్యా రుణాలు, 100 శాతం స్కాలర్ షిప్‌లు తదితర ప్రత్యేకసదుపాయాలను కల్పిస్తున్నారని తెలిపారు. ఇక్కడ ఆరేళ్ల కోర్సును పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత చదువులకు నేరుగా ఏదేశానికైనా వెళ్లే వీలు ఉందని, ఆ విధంగా నిబంధనలు అమల్లో ఉన్నట్లు వివరించారు.

అట్టల ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అన్నానగర్: సాత్తూరులోని అట్టల ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. లక్షల విలువైన సామగ్రి మంటలను ఆహుతయ్యాయి. విరుదునగర్ జిల్లా సాత్తూరు ప్రాంతానికి చెందిన శ్రీనివాసన్ కార్డ్‌బోర్డ్ తయారీ ఫ్యాక్టరీ నడుస్తోంది. ఈ అట్టల ఫ్యాక్టరీలో సుమారు 150 మంది పని చేస్తున్నారు. వ్యర్థ కాగితాలను ఉపయోగించి యంత్రాలతో కార్డుల తయారీ పనులు కొనసాగుతున్నాయి. సోమవారం కార్డుల తయారీ వ్యర్థ పేపర్లు ఉంచే ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బలమైన గాలుల కారణంగా మంటలు వేగంగా వ్యాపించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సాత్తూరు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తతో వివాహేతర సంబంధం

• స్నేహితుడి హత్య

తిరువొత్తియూరు: తన అత్తతో వివాహేతర సంబంధం పెట్టుకున్న స్నేహితుడిని చంపిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. నామక్కల్ జిల్లా వెలగౌండంపట్టిలోని అక్కలంపట్టి అరుంధతీ కాలనీకి చెందిన కందస్వామి కుమారుడు శీను (23), అదే పట్టణానికి చెందిన శక్తివేల్ కుమారుడు ప్రవీణ్‌కుమార్ (21) స్నేహితులు. ప్రవీణ్‌కుమార్ మేనమామ సత్య భార్య మీనా (29)తో కలిసి అదే ప్రాంతంలో నివసిస్తున్నారు. ఈ క్రమంలో శీనుకు ప్రవీణ్‌కుమార్ అత్త మీనాతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం సత్యకు తెలియడంతో భార్యను మందలించాడు. అయితే శీనుతో సంబంధాన్ని వదులుకోకపోవడంతో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఇందులో వారిద్దరూ చర్చించుకుని మరోసారి కలవకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే మామ, అత్తకు చెడ్డపేరు తెచ్చిన శీనును చంపడానికి ప్రవీణ్ కుమార్ నిర్ణయించుకున్నాడు. సోమవారం రాత్రి శీను ఇంటికి వెళ్లి బయట నిద్రిస్తున్న అతని మెడ, ఛాతి, తొడలపై కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. శీను అరుపులు విని స్థానికులు అక్కడికి వచ్చారు. అయితే అప్పటికే అతను మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం నామక్కల్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. హత్య చేసి పరారైన ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

• వేడుకగా రథోత్సవం


కళి వెంకటపెరుమాళ్ రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

తిరుత్తణి: కళి వెంకటపెరుమాళ్ ఆలయ రథోత్సవం మంగళవారం కోలాహలంగా జరిగింది. భక్తులు రథాన్ని లాగి స్వామిని దర్శించుకున్నారు. తిరుత్తణి సమీపంలోని కనకమ్మసత్రంలో కళి వెంకటపెరుమాళ్ ఆలయం 58వ వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 27న ధ్వజారోహణంతో ప్రారంభమైన విషయం తెలిసిందే. ఉత్సవాల్లో 8వ రోజైన మంగళవారం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మరణంలోనూ వీడని బంధం

• రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

వెదురుకుప్పం: రోడ్డు ప్రమాదంలో దంపతులు మృత్యువాత పడిన సంఘటన మంగళవారం మండలంలోని కసవనూరు వద్ద చోటుచేసుకుంది. ఇన్నాళ్లూ ఒకరికొకరు తోడు నీడగా ఉన్నవారు మృత్యువులోనూ వారి బంధాన్ని వీడలేదు. తుది శ్వాసలోనూ ఒక్కటయ్యారు. మలుపులో వేగాన్ని నియంత్రించలేక కానరాని లోకాలకు చేరుకున్నారు. స్థానికుల కథనం ...మండలంలోని బలిజ మొండివెంగనపల్లెకు చెందిన పి.బాబు(54) తన భార్య పి.హేమలత(48)తో కొన్నేళ్ల క్రితం తిరుపతిలోని జీవకోనలో స్థిరపడ్డారు. వీరికి దినేష్, మోహన్‌కృష్ణ సంతానం. బాబు(54) టీటీడీ ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం బాబు తన భార్యను తీసుకుని ద్విచక్రవాహనంలో కార్వేటినగరానికి వెళ్లారు. అక్కడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిముగించుకుని వెదురుకుప్పానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో కసవనూరు సమీపంలోని మలుపు వద్ద ప్రమాదానికి గురయ్యారు. పచ్చికాపల్లం నుంచి ఎదురుగా వస్తున్న తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో దంపతులు ఇద్దరూ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. స్థానికులు పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ బాబు మృతి చెందగా హేమలతను తిరుపతి రుయాకు తరలిస్తుండగా మార్గమధ్యంలో తుదిశ్వాస విడిచింది. మృతులకు రుయాలో శవపరీక్ష నిర్వహించారు. బస్ డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నారు. వెదురుకుప్పం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విషపు ఈగ కుట్టి మహిళ మృతి

అన్నానగర్: కూడలూరులో విషపు ఈగ కుట్టి మహిళ మృతిచెందింది. లోయర్ క్యాంపు ప్రాంతానికి చెందిన పాండి భార్య నల్లమ్మాళ్ (45) కూలీ పనిచేస్తుంది. సోమవారం వైరవన్ డ్రైనేజీ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో పని చేస్తోంది. అక్కడున్న చెట్టు నుంచి వచ్చిన విషపు ఈగ నల్లమ్మాల్‌ను కరిచింది. నొప్పి భరించలేక కేకలు వేసింది. ఇరుగుపొరుగు వారు ఆమెని రక్షించి చికిత్స నిమిత్తం కంభం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తేని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నల్లమ్మాల్ మృతి చెందింది. లోయర్ క్యాంపు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

తిరువొత్తియూరు: చెన్నై ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. బన్‌రుట్టికి చెందిన దండపాణి (62) ఎక్స్‌ప్రెస్ రైలులో చెన్నైకి వచ్చాడు. రైలు నుంచి కిందికి దిగి ప్లాట్ ఫారంలో నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో అతని వద్ద ఉన్న వస్తువు కింద పడింది. ఆ వస్తువును తీసుకోవడానికి పట్టాలపైకి దిగాడు. ఆ సమయంలో చెన్నై బీచ్ నుంచి తాంబరం వెళ్తున్న విద్యుత్ రైలు దండపాణిని ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతన్ని చెన్నై ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై టీనగర్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

నగ్న ఫొటోలతో భార్యకు బ్లాక్‌మెయిల్

తిరువొత్తియూరు: భార్య ఫోటోను నగ్నంగా మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమంలో విడుదల చేస్తానని బెదిరించిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. సేలం అమ్మాపేటకు చెందిన యువతి(21), పెరియ గౌండర్‌పురానికి చెందిన అరుల్‌మణి (27)ను రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఒక కుమార్తె ఉంది. ఇద్దరి మధ్య గొడవలు ఏర్పడి విడిపోయారు. ఈ క్రమంలో అరుల్‌మణి తన భార్య, ఆమె తల్లి, చెల్లెలి ఫోటోలను నగ్నంగా మార్ఫింగ్ చేశారు. సామాజిక మాధ్యమంలో అప్‌లోడ్ చేస్తానని బెదిరించాడు. దీనిపై యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అరుల్‌మణిని అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించారు.

విద్యార్థినికి లైంగిక వేధింపులు

• ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

తిరువొత్తియూరు: కన్యాకుమారి జిల్లా ఇరాణియల్ సమీపంలో పాఠశాల విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. వివరాలు.. కన్యాకుమారి జిల్లా ఇరానీయల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ మహోన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసే అరుల్‌జీ 8వ తరగతి విద్యార్థినికి లైంగిక వేధింపులు ఇచ్చినట్లు తెలిసింది. దీని గురించి విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కులచల్ మహిళా పోలీస్‌లు విచారణ చేపట్టారు. ఈ ఫిర్యాదులో గత 14వ తేదీ మధ్యాహ్న భోజన సమయంలో తన కుమార్తెను ఉపాధ్యాయుడు అరుల్ జీవన్ లైంగిక వేధింపులు ఇచ్చినట్లు తెలిసింది. దీనిపై సమాచారం అందుకున్న విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుడు అరుల్ జీవన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి జీవన్‌ను ప్రశ్నిస్తున్నారు.

వృద్ధుడికి ఊపిరితిత్తుల మార్పిడి

సాక్షి, చెన్నై: వృద్ధుడి (78)కి చెన్నై ఎంజీఎం వైద్యులు ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతం చేశారు. మంగళవారం ఈ వివరాలను ఎంజీఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌హార్ట్ అండ్ లంగ్ ట్రాన్స్ ప్లాంట్ డైరెక్టర్ డాక్టర్ కేఆర్ బాలకృష్ణన్ వెల్లడించారు. బెంగళూరుకు చెందిన రోగి తీవ్రమైన అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్‌తో, ఆస్పిరేషన్ న్యుమోనియాతో బాధపడుతూ తమ ఆస్పత్రికి వచ్చారన్నారు. అవయవ దానం ద్వారా బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి ఊపిరితిత్తులను శస్త్ర చికిత్స చేసి వృద్ధుడికి అమర్చినట్లు తెలిపారు. డాక్టర్లు కేఆర్ బాలకృష్ణన్, సురేష్ రావు, అపర్ జిందాల్, ఎంజీఎం సీఈఓ హరీష్ మణియన్ పాల్గొన్నారు.

8 కిలోల గంజాయి స్వాధీనం

తిరువొత్తియూరు: హౌరా ఎక్స్‌ప్రెస్ రైలులో వచ్చిన వ్యక్తి నుంచి 8 కిలోల గంజాయిని రైల్వే స్వాధీనం చేసుకున్నారు. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ పోలీసు ఇన్‌స్పెక్టర్ గోవిందరాజ్ నేతృత్వంలో పోలీసులు మంగళవారం తనిఖీ చేశారు. ఆ సమయంలో 4వ ప్లాట్‌ఫారంలో వచ్చిన హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి దిగిన ప్రయాణికులను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సురేష్ కుమార్ (27) వద్ద 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతన్ని రిమాండ్‌కు తరలించారు.

రూ. 9.89 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు

• ప్రారంభించిన మంత్రి సుబ్రమణ్యం

కొరుక్కుపేట: కోవిలంబాక్కంలో ముఖ్యమంత్రి గ్రామ రోడ్ల అభివృద్ధి పథకంలో భాగంగా మేడవాక్కం పంచాయతీలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పనులను ఆరోగ్యమంత్రి సుబ్రమణియన్‌కు అప్పగించారు. ఈ పనులు జి. వెంకటేశన్ నేతృత్వంలో సాగనున్నాయి. ఈ రోడ్డు ఏర్పాటు చెంగల్‌పట్టు జిల్లా పునీద తోమైయార్ కొండ సదరన్ యూనియన్‌లో కలిపిన పంచాయతీ ప్రజల చిరకాల వాంఛ. రూ.9.89 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టును మంత్రి సుబ్రమణియన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రికి పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అలాగే దక్షిణ చెన్నై పార్లమెంటు సభ్యులు తమిళచ్చి తంగపాండియన్, షోలింగర్ అసెంబ్లీ సభ్యుడు అరవింద్ రమేష్, జిల్లా కలెక్టర్ ఎ.ఆర్.రాహుల్‌నాథ్, ప్రభుత్వ శాఖ అధికారి కల్మా ,కార్పొరేషన్ అధికారులు, చెన్నై సౌత్ డిస్ట్రిక్ట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్‌లు సెయింట్ తోమైయర్ కొండ సౌత్ యూనియన్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా పాల్గొన్నారు.

పేదల కంటి శస్త్ర చికిత్సలకు శ్రీకారం


ఒప్పందం చేసుకుంటున్న సంస్థ ప్రతినిధులు

కొరుక్కుపేట: పార్వై (చూపు) పేరిట ఉచితంగా 7,500 మంది నిరుపేదలకు క్యాటరాక్ట్ సర్జరీలను చేసే లక్ష్యంతో ప్రత్యేక సీఎస్ఆర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ (ఆర్‌సీఎంఈ) ఆధ్వర్యంలో అరవింద్ కంటి ఆస్పత్రి సహకారంతో అతిపెద్ద క్యాటరాక్ట్ సర్జరీ ప్రాజెక్ట్ అయిన పార్వైని ప్రారంభించింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన 7,500 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయనున్నారు. ద ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సంస్థ ఈ ప్రాజెక్ట్‌కు సహకారం అందించనుంది. ఈ మేరకు ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సంస్థ ఆఫీసర్ ఫణీష్ రావు, ఆర్‌సీఎంఈ అధ్యక్షుడు బాబు కృష్ణమూర్తి, అరవింద్ కంటి ఆస్పత్రి సీఎంఓ అరవింద్ శ్రీనివాసన్‌తో రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ సభ్యులు అవగాహన ఒప్పంద చేసుకున్నారు.

ట్యూషన్‌కు వెళ్లిన బాలుడి కిడ్నాప్

• అరక్కోణం రైల్వే స్టేషన్‌లో గుర్తింపు

కొరుక్కుపేట: ట్యూషన్‌కు వెళ్లిన చెన్నై బాలుడిని కిడ్నాప్ చేసి రైలులో తీసుకెళుతుండగా అరక్కోణం రైల్వే స్టేషన్‌లో రక్షించారు. చెన్నై సెంట్రల్ నుంచి అరక్కోణం మీదుగా అలప్పుజా వెళ్లే అలప్పుళా ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం రాత్రి 8.55 గంటలకు చెన్నై బయలుదేరింది. రైలులో టికెట్ ఇన్‌స్పెక్టర్ ప్రయాణికులను తనిఖీ చేస్తున్నారు. అక్కడున్న ఓ పెట్టెలో బాలుడు(11) ఏడుస్తున్నట్లు గుర్తించాడు. అప్పటికే రైలు రాణిపేట జిల్లా అరక్కోణం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. బాలుడిని టికెట్ ఇన్ స్పెక్టర్ రైల్వే సెక్యూరిటీ ఫోర్స్ పోలీసులకు అప్పగించారు. దీంతో రైలు 5 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరింది. అరక్కోణం రైల్వే సెక్యూరిటీ ఫోర్స్ పోలీసులు బాలుడిని విచారించగా చెన్నై విల్లివాక్కంకు చెందిన కిరణ్ బాబు కొడుకు అఖిల్ (11) అని తేలింది. బాలుడు అఖిల్ పోలీసులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ''నేను 6వ తరగతి చదువుతున్నాను. ట్యూషన్ నుంచి ఇంటికి వెళ్తున్నాను. అప్పుడు అక్కడికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు నన్ను బెదిరించి, నా నోటిని కట్టేసి విల్లివాక్కం రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి రైలులో సెంట్రల్ స్టేషన్‌కు చేరుకుని ఈ రైలులో ఏసీ కోచ్‌లో పెట్టి వెళ్లిపోయారని'' తెలిపాడు. బాలుడిని విల్లివాక్కం రైల్వే పోలీసులకు అప్పగించారు. రైల్వే స్టేషన్లలోని నిఘా కెమెరాలను చెన్నై పోలీసులు పరిశీలిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

భర్త ఆగడాలు భరించలేక హత్య

• పోలీసుల అదుపులో భార్య

వేలూరు: భర్త ప్రతి రోజూ మద్యం తాగొచ్చి ఘర్షణ పడుతుండడంతో విసిగిపోయింది. కోపంతో పుట్టింటింటికి వెళ్లింది. అక్కడికి కూడా వచ్చి గొడవ పడడంతో ఆగ్రహంతో కర్రతో తలపై బాదింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన రాణిపేటలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. రాణిపేట సమీపంలోని వీసీ మోటూరు గ్రామానికి చెందిన దేవరాజ్ (40) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య భానుమతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. దేవరాజ్ తరచూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. అతనిపై కోపంతో పిల్లలను తీసుకుని వాలాజ సమీపం చిన్న తగరకుప్పం గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. దేవరాజ్ సోమవారం సాయంత్రం మద్యం మత్తులో అత్తగారింటికి వెళ్లి భార్యతో ఘర్షణకు దిగాడు. ఆమెపై చేయి చేసుకున్నాడు. ఆగ్రహించిన భార్య పెద్ద కర్రను తీసి భర్త తలపై కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వాలాజ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. భానుమతిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. తండ్రి మృతిచెందడం.. తల్లిని పోలీసులు అరెస్టు చేయడంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

వ్యభిచార నిర్వాహకులు ఇద్దరి అరెస్ట్



నిందితులు రాజేష్, గాయత్రి

తిరువళ్లూరు: సలూన్ పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి చెరలో ఉన్న ముగ్గురు యువతులకు విముక్తి కలిగించారు. తిరువళ్లూరు జిల్లా శివందినగర్ ప్రాంతంలోని సలూన్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ మల్లికకు రహస్య సమాచారం అందింది. దీంతో పోలీసులు మంత్ర సలూన్‌లో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. చెన్నైకు చెందిన రాజేష్(47) అన్ననూర్‌కు చెందిన గాయత్రి(23)లను అరెస్టు చేశారు. వీరి చెరలో ఉన్న ముగ్గురు యువతులను రిమాండ్‌కు తరలించారు. కాగా పరారీలో ఉన్న విఘ్నేష్ అనే యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రిమాండ్ ఖైదీ మృతి

తిరుపతి క్రైం: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఓ రిమాండ్ ఖైదీ మంగళవారం మృతిచెందాడు. తిరుపతి సబ్ జైల్ సూపరింటెండెంట్ గురుశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు... తమిళనాడు వేలూరు సమీపంలోని అంబూరు ప్రాంతానికి చెందిన సెల్వం చెల్లదొరై (36) తిరుపతిలో యాచకుడిగా ఉంటున్నాడు. 8 నెలల క్రితం కొంతమంది యాచకుల మధ్య జరిగిన దాడి కేసులో చల్లాదొరైని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపించారు. ఇదిలా ఉండగా శనివారం ఆయన ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఎదర్కోవడంతో జైలు అధికారులు అతనిని రుయా ఆసుపత్రికి తరలించారు. ఊపిరితిత్తుల సమస్యతోపాటు గుండెకు సంబంధించిన సమస్యలు కూడా అతనికి ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. అప్పటి నుంచి రుయాలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు.

చోరీ ఫోన్లను గుర్తించేందుకు వాట్సాప్ నంబర్



నంబర్‌ను ప్రదర్శిస్తున్న డీఐజీ ముత్తుస్వామి, ఎస్పీ మణివన్నన్

వేలూరు: జిల్లాలో సెల్‌ఫోన్ చోరీకి గురైనా, దారిపోయినా ఇంటి నుంచే ఫిర్యాదు చేసే విధంగా సెల్ ట్రాకర్ అనే నూతన వాట్సాప్ నంబర్‌ను డీఐజీ ముత్తుస్వామి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొబైల్ పోగొట్టుకున్న వారు 9486214166 నంబరుకు సమాచారం ఇవ్వాలని.. వెంటనే ఆ నంబర్‌కు గూగుల్ లింక్‌ను పంపుతామని అందులో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారి పేరు, చిరునామ, చోరీకి గురైన సెల్ ఐఎమ్ఈఐ వంటి వివరాలను నమోదు చేస్తే నేరుగా జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులకు పూర్తి సమాచారం వస్తుందన్నారు. అనంతరం సైబర్ క్రైమ్ పోలీసులు సెల్‌ఫోన్ కనిపెట్టే పనిలో నిమగ్నమవుతారన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్పీ మణివన్నన్, అదనపు ఎస్పీ కోటీశ్వరన్ ఉన్నారు.

ఫెర్రో ఎల్లాయ్స్ సమస్యలు ఏనాటివో..!

ఆ ఇబ్బందులు దశాబ్దాలుగా ఉన్నవే రామోజీ..

- వాటి విద్యుత్‌ ఛార్జీల పెంపు స్వల్పమే
- వేధిస్తేనే కొత్త పరిశ్రమలు వస్తున్నాయా?
- నిబంధనలు పాటించకపోతే రద్దుచేయడం తప్పా?



సాక్షి, అమరావతి

రాసిందే పదే పదే రాస్తే పాఠకులు నమ్మేస్తారన్నది రామోజీరావు భ్రమ. ప్రతీ అంశాన్నీ అటుతిప్పి ఇటు తిప్పి చివరికి ముఖ్యమంత్రి జగన్, ఆయన ప్రభుత్వంపై తన అక్కసును వెళ్లగక్కేలా ఉంటున్నాయి ఆయన రాతలు. గత టీడీపీ ప్రభుత్వంలోనే కుదేలైన ఫెర్రో ఎల్లాయ్స్‌ పరిశ్రమల సమస్యలను ప్రస్తుత ప్రభుత్వంపై రుద్దేందుకు తెగ ఆయాస పడుతూ ఎప్పటిలాగే మరో తప్పుడు కథనాన్ని అచ్చోశారు. అసలు రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల పరిస్థితులే లేవన్నట్లు ఆ కథనానికి కలరింగ్‌ ఇచ్చారు. 'కరెంటు షాక్‌తో అల్లాడుతున్న ఫెర్రో ఎల్లాయ్స్‌ పరిశ్రమల మూత' శీర్షికతో మంగళవారం ఈనాడు అసత్యాలతో ఓ వంటకాన్ని వండి వార్చింది. దీని వెనకనున్న అసలు వాస్తవాలను ఇంధన, పరిశ్రమల శాఖలు వెల్లడించాయి. అవి..

ఆరోపణ: జగన్‌ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు, బెదిరింపులు, దాష్టీకానికి భయపడి ఇప్పటికే చాలా పరిశ్రమలు వెళ్లిపోయాయి..

వాస్తవం: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలవల్ల రాష్ట్రంలో అనేక కొత్త పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఇందులో భాగంగా.. వైఎస్సార్‌ జిల్లాలో సెంచరీ ప్లైవుడ్స్‌ పరిశ్రమ ఏర్పాటవుతోంది. జపాన్‌కు చెందిన 'యెకోమా' సంస్థ ఏటీజీ టైర్ల తయారీ పరిశ్రమను గత ఏడాది ఉత్పత్తి ప్రారంభించింది. మరో రూ.1,000 కోట్లతో రెండోదశ కర్మాగారం నిర్మాణానికి సీఎం జగన్‌ ఇప్పటికే శంకుస్థాపన చేయడంతో శరవేగంగా ఆ పనులు జరుగుతున్నాయి. ఇవన్నీ వేధిస్తేనే వచ్చాయా?

ఆరోపణ: రాష్ట్రంలో ఫెర్రో ఎల్లాయ్స్‌ పరిశ్రమలు.. అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలూ మూతపడుతున్నాయి..

వాస్తవం: అనేక కారణాలవల్ల ఫెర్రో ఎల్లాయ్స్‌ పరిశ్రమలు గత కొన్ని దశాబ్దాలుగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయి. అందువల్లే అవి మూతపడుతున్నాయి. ఇప్పుడు కొత్తగా ఏమీ జరగడంలేదు. గత ప్రభుత్వ హయాంలోనూ ఇవి అనేకం మూతపడ్డాయి. గత ఇరవై ఏళ్లుగా ఈ విభాగంలో అమలులో ఉన్న టారిఫ్‌కు ఎలాంటి డిమాండు ఛార్జీలు, స్థిర ఛార్జీలు, సమయానుసార ఛార్జీలు (టీఓడీ), తప్పనిసరి వినియోగం ఛార్జీలు విధించలేదు. కానీ, ఖర్చులు 54శాతం పెరిగాయి. ఇతర వినియోగదారులకు అవలంబిస్తున్నట్లుగానే ఈ పరిశ్రమలకూ డిస్కంలు చార్జీలను అమలుచేస్తున్నాయి. వీటి ప్రకారం చూసినా.. రాష్ట్రంలో వీటికి యూనిట్‌ ఛార్జి దాదాపు రూ.0.50 తక్కువే.

ఆరోపణ: 'అమరరాజా'పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటంతో ఆ సంస్థ విస్తరణ ప్రాజెక్టుల్ని తెలంగాణ, తమిళనాడులో చేపట్టింది.

వాస్తవం: కాలుష్య కారకాలైన వాయు, ద్రవ పదార్థాలను నేరుగా వదలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యావరణ ప్రమాణాలను పాటించాలని 'అమరరాజా'కు నోటీసులివ్వడం, కోర్టు ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకోవడం కక్ష సాధింపు ఎలా అవుతుంది? ప్రజారోగ్యాన్ని గుల్లచేస్తున్నా ఊరుకోవాలా డ్రామోజీ?

ఆరోపణ: కృష్ణాజిల్లా మల్లవల్లి పారిశ్రామిక పార్కులో టీడీపీ నిర్ణయించిన భూముల ధరల్ని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఐదురెట్లు పెంచింది.

వాస్తవం : ఏపీఐఐసీ వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని భూముల ధరలను సవరించడం సర్వసాధారణం.

ఆరోపణ: విక్రయ ఒప్పందానికి రాలేదన్న కారణాలతో 74 మందికి స్థల కేటాయింపులను రద్దుచేసింది..

వాస్తవం: ఇందులో తప్పేముంది? భూముల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కేటాయిస్తే నిర్ణీత కాలంలో డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్‌ చేయించుకోవాల్సిన బాధ్యత పారిశ్రామిక సంస్థలది కాదా?

ఆరోపణ: రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ చిత్తూరు జిల్లాలో రూ.13 వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనను ఉపసంహరించుకుంది..

వాస్తవం: ఇది పూర్తిగా అవాస్తవం. రకరకాల వివాదాల్లో ఉన్న భూమిని గత టీడీపీ ప్రభుత్వం రిలయన్స్‌కు కేటాయించింది. అందుకే విరమించుకుంది. కానీ, రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెడతామని ముఖేష్‌ అంబానీ విశాఖ సదస్సులో ప్రకటించిన విషయం గుర్తులేదా!?

రాదనుకున్న కార్డు ఇట్టే వచ్చింది

- జగనన్న సురక్ష శిబిరాల్లో లబ్ధిదారుల ఆనందం
- దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై హర్షం
- జగనన్న సర్కార్‌లోనే ఇది సాధ్యం అంటూ కితాబు

సాక్షి, నెట్‌వర్క్‌: లబ్ధిదారుల సంతోషం మధ్య రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష శిబిరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇంటింటికి వెళ్తున్న వలంటీర్లు ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే సమస్య పరిష్కారానికి నడుం బిగిస్తున్నారు. లబ్ధిదారులకు కావాల్సిన సర్టిఫికెట్లను బట్టి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సేకరించి వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారు. దీని ఆధారంగా అధికారులు తక్షణం స్పందించి దరఖాస్తుదారులకు కావాల్సిన సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. మంగళవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సురక్ష క్యాంపులకు విశేషమైన స్పందన లభించింది. మండల, జిల్లా స్థాయి అధికారులు ఈ క్యాంపుల్లో పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. దీర్ఘకాలికంగా ఉన్న తమ సమస్యలు ఇట్టే పరిష్కారం అవుతుండటం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. జగనన్న సర్కార్‌లోనే ఇది సాధ్యం అంటూ ప్రభుత్వ పనితీరును కొనియాడారు.

కార్డు వస్తుందన్న నమ్మకం ఉండేది కాదు



ఎన్టీఆర్‌ జిల్లా కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామానికి చెందిన బుద్దవరపు సీతారావమ్మ మధ్య తరగతికి చెందిన మహిళా కౌలు రైతు. రెండు ఎకరాల భూమిని గత ఆరేళ్ల నుంచి కౌలుకు తీసుకుని పంటలు సాగుచేస్తోంది. ఆమె భర్త వంట మేస్త్రీగా పని చేస్తుంటాడు. భూమి నుంచి వచ్చిన ఫలసాయాన్ని కుటుంబం కోసం ఖర్చు చేస్తుండేది. అయితే కౌలు రైతు కార్డు కోసం గతంలో మండల కేంద్రమైన కంచికచర్ల తహసీల్దార్‌ కార్యాలయం చుట్టూ తిరిగినా పని అయ్యేది కాదు. కాగా, జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు ఇంటికి వచ్చినప్పుడు తమకు కౌలు రైతు కార్డు లేదని సీతారావమ్మ చెప్పారు. వివరాలు తీసుకుని కౌలు రైతు కార్డు త్వరలోనే వస్తుంది అని వారు చెబితే ఆ మాటలు ఆమె నమ్మలేదు. కార్డు వచ్చింది వచ్చి తీసుకెళ్లాలని వలంటీర్‌ చెప్పగా.. మంగళవారం ఉదయం సచివాలయానికి వెళ్లింది. అక్కడ ఎమ్మెల్యే డాక్టర్‌ మొండితోక జగన్‌మోహన్‌రావు ఆమె పేరును పిలిచి కార్డు చేతికిచ్చారు. దీంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. గత ప్రభుత్వంలో కాళ్లరిగేలా తిరిగినా కౌలు రైతు కార్డు రాలేదంటూ ఆమె చెప్పింది.

ఆరోగ్య శ్రీలో అందరినీ చేర్చారు..



ఇతని పేరు ధూపాటి వీరయ్య. చెన్నుపల్లి గ్రామం బల్లికురవ మండలం. తనకి ఒక్కడికే ఆరోగ్యశ్రీ కార్డు ఉంది. వైద్యం చేయించుకోవాలంటే తన భార్య, ఇద్దరు పిల్లలు ప్రైవేటు వైద్యశాలలో ఇప్పటివరకు చాలా ఖర్చు చేశారు. జగనన్న సురక్ష క్యాంపులో భాగంగా భార్య మల్లేశ్వరీ ఇద్దరు పిల్లలను ఆరోగ్యశ్రీ కార్డులో చేర్చాల్సిందిగా మంగళవారం గ్రామ సచివాలయం దగ్గర దరఖాస్తు చేశారు. దరఖాస్తును పరిశీలించిన అధికారులు వెంటనే ఎలాంటి రుసుము చెల్లించకుండానే తన కుటుంబ సభ్యులందరినీకార్డులో చేర్చి వెంటనే కార్డు ఇప్పించారు. దీంతో భార్యాభర్తలు సంతోషం వ్యక్తం చేశారు.

దీర్ఘకాలిక భూమి సమస్య తీరింది



ఈయన పేరు నట్టేరి నరసింహులు. తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని ముద్దంపల్లె స్వగ్రామం. ఈయన తండ్రి వెంకటయ్య మృతి చెంది 18 సంవత్సరాలైంది. ఆయన తండ్రి పేరుపైన 2.67 హెక్టార్ల భూమి ఉంది. ఆ భూమి తన తండ్రిపేరుపై ఉండటంతో రైతు భరోసా, పీఎం కిసాన్‌ వంటి పథకాల ద్వారా లబ్ధి అందేది కాదు. గతంలో పొలాన్ని తన పేరుపైన మార్చుకునేందుకు చాలా కాలంగా కార్యాలయాల చుట్టూ తిరిగినా పని అవ్వలేదు. కొద్దిరోజుల క్రితం ఆయన మోకాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. దీంతో ఎక్కడికీ తిరగలేక ఇంటి వద్దే ఉండిపోయాడు. ఈ పరిస్థితిలో వలంటీర్‌ ఆయన వద్దకు వచ్చి సమస్యను తెలుసుకున్నాడు. జగనన్న సురక్షలో తండ్రి పేరుపై ఉన్న వ్యవసాయ భూమిని నరసింహులు పేరుపైకి మార్చి సర్టిఫికెట్‌ మంజూరు చేయించారు. దీంతో ఆయన ఆనందానికి అవధులు లేవు

అధికారులు దగ్గరుండి మరీ సమస్య పరిష్కరించారు



ఈయన పేరు యడ్ల రామారావు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం గంగారాం గ్రామం. వాస్తవానికి ఆయన వయసు 68 ఏళ్లు. అయితే ఆధార్‌ కార్డులో వయసు 57గాను, ఓటరు కార్డులో 68గాను నమోదై ఉంది. దీనివల్ల ఆయనకు కొన్నాళ్లుగా పింఛన్‌ రావడం లేదు. ఆధార్‌లో వయసు మార్పు చేసుకోవడం ఎలాగో తెలీక ఆయన పింఛన్‌కు దూరమయ్యారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో.. అధికారులకు సమస్యను తెలియజేశారు. ఆయనకు పింఛన్‌ మంజూరు చేసేందుకు ఎంపీడీఓ, ఎంపీపీ దరఖాస్తు చేయించారు. అధికారులు దగ్గరుండి మరీ సమస్య పరిష్కరించడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

పంటల బీమాపై అభ్యంతరాలుంటే చెప్పండి

వ్యవసాయ శాఖ స్పెషల్‌ కమిషనర్‌

సాక్షి, అమరావతి: ఖరీఫ్‌–2022 సీజన్‌కు సంబంధించి పంటల బీమా అర్హుల జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నామని, అభ్యంతరాలుంటే బుధవారంలోగా ఆర్బీకే సిబ్బందికి తెలియజేయాలని వ్యవసాయ శాఖ స్పెషల్‌ కమిషనర్‌ సీహెచ్‌.హరికిరణ్‌ రైతులకు విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని కమిషనరేట్‌ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా వ్యవసాయ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్‌ కమిషనర్‌ హరికిరణ్‌ మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌ జయంతి సందర్భంగా ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్న రైతు దినోత్సవం సందర్భంగా అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో జరిగే కార్యక్రమంలో పంటల బీమా పరిహారం సొమ్ములను సీఎం వైఎస్‌ జగన్‌ రైతుల ఖాతాలకు జమ చేస్తారని తెలిపారు. 10.20 లక్షల మందికి రూ.1,117.21 కోట్లు జమ చేయనున్నారని చెప్పారు. అదే రోజు నూతనంగా నిర్మించిన 52 వైఎస్సార్‌ ఇంటిగ్రేటెడ్‌ అగ్రి ల్యాబ్స్‌ను సీఎం ప్రారంభిస్తారని చెప్పారు. ఈ నెలాఖరు నాటికి కౌలు రైతుల గుర్తింపు కార్డుల (సీసీఆర్సీ) పంపిణీని రెవెన్యూ అధికారులతో కలసి పూర్తి చేయించాలని ఆదేశించారు. 2023–24 సీజన్‌కు సంబంధించి తొలివిడత వైఎస్సార్‌ రైతు భరోసా సాయం కోసం అర్హత గల కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆ ఆర్డినెన్స్‌ విప్లవాత్మకం

- ఆలయాల ఆస్తుల పరిరక్షణకే కట్టుదిట్టమైన ఆర్డినెన్స్‌
- దేశంలో ఎక్కడా ఇంత పకడ్బందీగా తెచ్చి ఉండరు
- హిందూ ధర్మంపై ఆలయాల ద్వారా ప్రచారం
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: దేవదాయ చట్టంలోని లొసుగులను అడ్డంపెట్టుకొని ఆలయాల భూములను ఆక్రమించడాన్ని నిరోధించడానికి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ పెద్ద విప్లవాత్మక చర్యల ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ అభివర్ణించారు. ఆలయాల ఆస్తుల పరిరక్షణకు దేశంలో ఇంకెక్కడా ఇంత కట్టుదిట్టమైన ఆర్డినెన్స్‌ తీసుకొచ్చి ఉండరని అన్నారు. ఆయన మంగళవారం రాష్ట్ర సచివాలయంలో దేవదాయ శాఖపై సమీక్షించారు. అనంతరం ఆ శాఖ కమిషనర్‌ సత్యనారాయణతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు దేవుడి భూముల లీజు కాలం ముగిసినా, వాటిని అనుభవిస్తున్న వారిని ఖాళీ చేయడానికి ట్రిబ్యునల్‌కు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు వారం రోజుల నోటీసు ఇచ్చి, వెంటనే స్వాధీనం చేసుకోవడానికి దేవదాయ శాఖ అధికారులకు ఈ ఆర్డినెన్స్‌ ద్వారా అధికారాలు వచ్చాయని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించిన ఆక్రమణదారులకు ఎనిమిదేళ్లకు పైగా శిక్ష కూడ పడుతుందన్నారు. చట్టంలో చేసిన సవరణల ప్రకారం దేవదాయ శాఖ ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర స్థాయిలో సీసీఎల్‌ఏ చైర్మన్‌గా, దేవదాయ శాఖ కమిషనర్‌ కన్వీనర్‌గా తొమ్మిది ఇతర వివిధ శాఖాధిపతులు, పోలీసు ఉన్నతాధికారులతో కమిటీ పనిచేస్తుందన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు పనిచేస్తాయన్నారు. జిల్లా కమిటీలు నెలకొకసారి, రాష్ట్ర స్థాయి కమిటీ మూడు నెలలకోసారి సమావేశమై ఆక్రమణల వివరాలు, తొలగింపుపై సమీక్షిస్తాయని తెలిపారు. హిందూ ధర్మంపై భావితరాలకు అవగాహన కలిగించేలా ఆలయాల ద్వారా నెల రోజుల పాటు ధర్మ ప్రచారం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల అమలుపై వచ్చే ధార్మిక పరిషత్‌ సమావేశంలో చర్చిస్తామన్నారు.

1,068 మంది అర్చకులకు కనీస వేతనాలు

సీఎం వైఎస్‌ జగన్‌ ఇచ్చిన హామీ మేరకు కొత్తగా మరో 1,068 మంది అర్చకులకు కామన్‌ గుడ్‌ ఫండ్‌ (సీజీఎఫ్‌) నుంచి కనీస వేతనాలు చెల్లించనున్నట్లు తెలిపారు. అందులో 229 మందికి రూ.15,650 చొప్పున, మరో 839 మందికి రూ.10 వేల చొప్పున చెల్లిస్తామన్నారు. రూ.5 లక్షల లోపు ఆదాయం ఉండే ఆలయాలను వాటి వంశపారంపర్య ధర్మకర్తలు లేదా అర్చకులకు అప్పగించడానికి ఈ నెల 20 కల్లా జిల్లాలవారీగా నివేదికలు కోరినట్టు వివరించారు.

'ఖరీఫ్‌'లో కరెంటు కొరత రానివ్వద్దు


ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్‌



సాక్షి, అమరావతి: ఈ ఖరీఫ్‌ సీజన్‌లో ఎలాంటి కొరత లేకుండా వ్యవసాయానికి పగటిపూట 9 గంటలు విద్యుత్‌ సరఫరా అందించాలని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ విద్యుత్‌ సంస్థలను ఆదేశించారు. ఖరీఫ్‌లో విద్యుత్‌ సరఫరా స్థితిపై విద్యుత్‌ పంపిణీ సంస్థ (డిస్కం)లతో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో నాణ్యమైన, నమ్మకమైన నిరంతర విద్యుత్‌ సరఫరాతో రాష్ట్ర విద్యుత్‌ సంస్థలపై వినియోగదారుల్లో విశ్వాసం పెరిగిందని చెప్పారు. వర్షాలు, గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడితే తక్షణమే స్పందించేలా క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించాలని డిస్కంల సీఎండీలకు సూచించారు. ఎమర్జెన్సీ బ్రేక్‌డౌన్‌ మేనేజ్‌మెంట్‌ టీమ్‌లను అందుబాటులో ఉంచాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఏపీ జెన్‌కో ఎండీ కె.వి.ఎన్‌.చక్రధర్‌బాబు, ఆంధ్రప్రదేశ్‌ తూర్పు, మధ్య, దక్షిణప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్దరెడ్డి, కె.సంతోషరావు, ట్రాన్స్‌కో విజిలెన్స్‌ జేఎండీ బి.మల్లారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- వాటిని విక్రయించే వారిపై పీడీ యాక్టు కింద చర్యలు
- రాష్ట్రస్థాయి నార్కోటిక్స్‌ కో ఆర్డినేషన్‌ అపెక్స్‌ కమిటీ సమావేశంలో సీఎస్‌ జవహర్‌రెడ్డి
- వీటి సరఫరాపై ఫిర్యాదుకు టోల్‌ ఫ్రీ నంబరు 14500



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గంజాయి సాగు, మత్తుమందుల సరఫరాను ఉక్కుపాదంతో అణచివేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. ఆయన అధ్యక్షతన మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రస్థాయి నార్కోటిక్స్‌ కో ఆర్డినేషన్‌ అపెక్స్‌ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మత్తుమందుల విక్రేతలపై పీడీ (ప్రివెంటివ్‌ డిటెన్షన్‌) యాక్టు కింద కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్, స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో తదితర శాఖల అధికారులను ఆదేశించారు. ఇలాంటి కేసుల్లో అరెస్టయినవారికి త్వరగా బెయిలు రాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. వీటి నియంత్రణకు విస్తృతస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, జిల్లాల్లో కలెక్టర్, ఎస్పీ ప్రత్యేకదృష్టి సారించాలని చెప్పారు. గంజాయి, మత్తుమందుల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో ముఖ్యంగా యువతలో అవగాహనను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో లింక్‌ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్న డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా సహా పరిసర జిల్లాల్లో చేపట్టిన ముమ్మర తనిఖీల ద్వారా చాలావరకు గంజాయి సాగును తగ్గించగలిగామన్నారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్‌గుప్తా మాట్లాడుతూ వివిధ విభాగాల సమన్వయంతో మత్తుమందుల సరఫరా, అక్రమ రవాణాను నివారించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు.

మూడేళ్లలో 5560 కేసులు: రాష్ట్ర స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో (ఎస్‌ఈబీ) కమిషనర్‌ రవిప్రకాశ్‌ మాట్లాడుతూ గత మూడేళ్లలో 5,560 కేసులను నమోదు చేసి 4 లక్షల 92 వేల 96 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 13,699 మందిని అరెస్టు చేశామని, 2,793 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అరెస్టయినవారిలో మన రాష్ట్రానికి చెందినవారు 9,568 మంది ఉన్నట్లు తెలిపారు. ఆపరేషన్‌ పరివర్తన్‌ కింద రెండేళ్లలో పోలీసులు, ఎస్‌ఈబీ కలిసి 7,752 ఎకరాల్లో గంజాయి సాగును ధ్వంసం చేసినట్లు చెప్పారు. వివిధ మత్తుమందుల సరఫరాకు సంబంధించి గత ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 44 కేసులు నమోదు చేసి 167 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. గంజాయికి సంబంధించి గుర్తించిన 239 మందిలో 133 మందిపై పీడీ యాక్ట్‌ ప్రయోగానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, వీరిలో 62 మందిని ఈ యాక్టు కింద జైల్లో పెట్టామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో పలు విభాగాల అధికారులు వీడియో లింక్‌ ద్వారా పాల్గొన్నారు.

రంగస్థలానికి నంది అవార్డులు

- అర్హులకే అవార్డులు ఇస్తాం
- ఏపీఎఫ్‌డీసీ చైర్మన్‌ పోసాని కృష్ణమురళి

సాక్షి, అమరావతి: రంగస్థలానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం నంది అవార్డులను ఇవ్వాలని నిర్ణయించినట్టు రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ (ఏపీఎఫ్‌డీసీ) చైర్మన్‌ పోసాని కృష్ణమురళి చెప్పారు. సచివాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటకాలకు ఊపిరి పోయడంతోపాటు నాటకరంగ కళాకారులను రక్షించుకోవడానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ ఏడాది 5 నాటక, నాటికల విభాగాల్లోకి మొత్తం 73 నంది అవార్డులను ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. తొలుత పద్య, సాంఘిక నాటకాలతో పాటు బాలలు, యువజన, సమాజాన్ని ప్రతిబింబించే నాటికలు.. ఐదు విభాగాల్లోని ఉత్తమ ఎంపికలకు అవార్డులు ఇస్తున్నట్టు వివరించారు.'పద్యనాటకాలు మన ప్రాంతానికే ప్రత్యేకం. అందుకే వాటికి నంది అవార్డులు ఇవ్వాలని నిర్ణయించాం. అవార్డులు ఏ వర్గానికో కాదు. నిజమైన అర్హులకు ఇవ్వాలన్నదే మా లక్ష్యం. ఇప్పటివరకు వంద సినిమాలకు కథలు రాసినా నాకు ఒక్క నంది అవార్డూ రాలేదు. కనీసం 10–15 సినిమాలకు నంది అవార్డు వస్తుందని ఆశించాను. నాపై కోపంతోనే కొందరు నన్ను బ్లాక్‌ లిస్టులో పెట్టారు..' అని పేర్కొన్నారు. రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా తెలుగు నాటక సమాజాలు నంది అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. కళాకారులు వారి ప్రాంతాల్లోనే నాటక, నాటికలను ప్రదర్శిస్తే.. ప్రత్యేక జ్యూరీ బృందం అక్కడికే వెళ్లి ప్రిలిమినరీ ఎంపికలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి ఎంపికలు, అవార్డుల ప్రదానం ఉంటాయని చెప్పారు.

నేడు నోటిఫికేషన్‌

ఏపీఎఫ్‌డీసీ ఎండీ, ఐఅండ్‌పీఆర్‌ కమిషనర్‌ టి.విజయకుమార్‌ రెడ్డి మాట్లాడుతూ నంది అవార్డులకు బుధవారం నోటిఫికేషన్‌ జారీచేస్తామని తెలిపారు. కళాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

సినీరంగం అభివృద్ధికి సీఎం సహకారం

రాష్ట్రంలో సినీరంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. ఏపీలో ఎవరైనా స్వేచ్ఛగా సినిమాలు తీసుకోవచ్చన్నారు. సినీ స్టూడియోల నిర్మాణానికి భూములను కూడా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఇప్పటికే సీఎం జగన్‌ ప్రకటించారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లకే కరోనా మహమ్మారి విజృంభించడంతో ప్రజారక్షణలో నిమగ్నమై నంది అవార్డులు ప్రకటించలేదన్నారు. ఆ తర్వాత పేదల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 1998 నుంచి 2004 వరకు నంది అవార్డులు ఉంటే.. అవి కేవలం హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైనట్టు చెప్పారు. కానీ.. వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లాలోను రంగస్థలకళను ప్రోత్సహించి నంది అవార్డులు ఇచ్చారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు హయాంలో అవార్డులను ప్రకటిస్తే.. అందులోని ఎంపికలపై తీవ్ర విమర్శలు రావడంతో వాటిని రద్దుచేశారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మళ్లీ సీఎం జగన్‌ కళాకారులపై గౌరవంతో నిష్పక్షపాతంగా నంది అవార్డులు ఇచ్చే బాధ్యతను తనకు అప్పగించారని ఆయన చెప్పారు.

విశ్వగురువు భారత్‌

ప్రధాని నరేంద్ర మోదీ

- సత్యసాయి సేవా స్ఫూర్తి అనితర సాధ్యమన్న ప్రధాని
- సాయి హీరా గ్లోబల్‌ కన్వెన్షన్‌ సెంటర్‌ ప్రారంభం



ప్రశాంతి నిలయం (పుట్టపర్తి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు భారతీయుల జీవన విధానం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని, భవిష్యత్‌లో భారత్‌ విశ్వగురువుగా నిలుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సత్యసాయి బాబా సేవలను మరింత విస్తరించే కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన సాయి హీరా గ్లోబల్‌ కన్వెన్షన్‌ సెంటర్‌ను ప్రధాని మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. సత్యసాయి నడయాడిన పుణ్యభూమి పుట్టపర్తి.. 'లవ్‌ ఆల్‌.. సర్వ్‌ ఆల్‌' అన్న పిలుపుతో భక్త కోటిని సేవా మార్గం వైపు నడిపిన మహనీయుడు సత్యసాయి అని కొనియాడారు. సత్యసాయి శత జయంతి నాటికి కోటి మొక్కలు నాటేందుకు 'సాయి కల్పతరు' కార్యక్రమాన్ని సెంట్రల్‌ ట్రస్ట్‌ చేపట్టడం అభినందనీయమన్నారు.

సత్యసాయి జిల్లా ఏర్పాటు సంతోషదాయకం

శ్రీసత్యసాయి బాబా పేరుతో ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని ప్రధాని మోదీ అన్నారు. ఈ జిల్లాను పూర్తిగా డిజిటలైజేషన్‌ చేసేందుకు సత్యసాయి సెంట్రల్‌ ట్రస్ట్‌ ముందుకొస్తే కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. జీ–20 సదస్సుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దేశానికి రావడం గొప్ప విషయమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటే అభివృద్ధిలో మరింత ముందుకు దూసుకెళ్లడం ఖాయమన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో వేగంగా అభివృద్ధి సాధిస్తున్న మనం సవాళ్లను దీటుగా ఎదుర్కొని ప్రపంచ నాయకత్వాన్ని సాధించే దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయన్నారు. మనం ప్రారంభించిన యోగా ప్రపంచ దేశాల జీవన విధానంగా మారిందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగితే భారత్‌ విశ్వగురువుగా నిలవడం ఖాయమన్నారు. జపాన్‌లో పర్యావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని చిన్న చిన్న అడవులను సృష్టిస్తున్నారని, సత్యసాయి సెంట్రల్‌ ట్రస్ట్‌ అలాంటి అడవులను ఇక్కడ కూడా తయారు చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌ రహిత భారత్‌ అన్న నినాదంతో ముందుకుపోతుండగా సత్యసాయి సెంట్రల్‌ ట్రస్ట్‌ సైతం సోలార్‌ పవర్‌ విధానాన్ని అమలు చేస్తోందని అభినందించారు.

రాగిజావ పంపిణీ భేష్‌

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా రాగిజావ పంపిణీ చేయడం ఎంతో మంచి కార్యక్రమమని, ఇది ఇతర రాష్ట్రాలలోనూ అమలైతే ఎంతో మేలు జరుగుతుందని ప్రధాని మోదీ అన్నారు. ఇంత మంచి కార్యక్రమానికి సత్యసాయి సెంట్రల్‌ ట్రస్ట్‌ సహకారాన్ని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్‌ అబ్దుల్‌ నజీర్, సత్యసాయి సెంట్రల్‌ ట్రస్ట్‌ మేనేజింగ్‌ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌ రాజు, ట్రస్ట్‌ సభ్యులు హీరా, డాక్టర్‌ మోహన్, నాగానంద, సత్యసాయి గ్లోబల్‌ కౌన్సిల్‌ చైర్మన్‌ చక్రవర్తి, వైస్‌ చైర్మన్‌ నిమిష్‌ పాండ్య పాల్గొన్నారు.

వైద్య శాఖలో 168 కొత్త పోస్టుల భర్తీ

- కడపలో మెంటల్‌ హెల్త్‌ ఇన్‌స్టిట్యూట్‌కు 116 పోస్టులు
- పలాస కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌కు 41
- ఆంధ్రా వైద్య కళాశాలకు 11 కేటాయింపు



సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని డీఎంఈ పరిధిలో 168 సూపర్‌ స్పెషాలిటీ, స్పెషలిస్ట్‌ వైద్యులు, ఇతర సిబ్బంది పోస్టులను ప్రభుత్వం కొత్తగా సృష్టించింది. ఈ పోస్టుల్లో 116 కడపలో ఏర్పాటు చేస్తున్న మెంటల్‌ హెల్త్‌ ఇన్‌స్టిట్యూట్‌కు, 41 పోస్టులు పలాస కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌కు, మరో 11 పోస్టులను ఆంధ్రా వైద్య కళాశాలలో చైల్డ్‌ సైకియాట్రీ విభాగానికి కేటాయించారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. రూ.40.81 కోట్లతో కడపలో మెంటల్‌ హెల్త్‌ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. 100 పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ ఆస్పత్రిలో సేవలు అందించడానికి ఒక సూపరింటెండెంట్, మూడు పోస్టుల చొప్పున ప్రొఫెసర్లు, అసోసియేట్‌ ప్రొఫెసర్లు సహా 116 క్లినికల్, నాన్‌–క్లినికల్‌ పోస్టులను ప్రభుత్వం కొత్తగా సృష్టించింది. అదేవిధంగా శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీ బాధితులకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయడానికి పలాసలో రూ.50 కోట్లతో కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ భవన నిర్మాణం దాదాపు పూర్తయింది. 200 పడకల సామర్థ్యంతో సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి కూడా ఇక్కడ అందుబాటులోకి రానుంది. ఈ క్రమంలో త్వరలో ఇక్కడ సేవలు ప్రారంభించడానికి వీలుగా నెఫ్రాలజీ, యూరాలజీ, అనస్తీషియా, జనరల్‌ మెడిసిన్, జనరల్‌ సర్జన్, రేడియాలజీ, కార్డియాలజీ వంటి ఇతర సూపర్‌ స్పెషాలిటీ, స్పెషాలిటీ విభాగాల్లో 41 వైద్య పోస్టులను భర్తీ చేస్తున్నారు. విశాఖ ఆంధ్రా వైద్య కళాశాల/మానసిక వైద్యశాలలో అడోలసెంట్, చైల్డ్‌ సైకియాట్రీ విభాగం ఏర్పాటులో భాగంగా మరో 11 పోస్టులను కేటాయించారు. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్‌ ప్రొఫెసర్, సీనియర్‌ రెసిడెంట్‌ సహా పలు పోస్టులు ఉన్నాయి.

సేవ

33 ఏళ్ల సర్వీసు. 10 వేల డెలివరీలు.
విలుప్పురం ప్రభుత్వాస్పత్రి నుంచి గత నెలలో రిటైర్ అయిన నర్సు ఖతీజాబీని తమిళనాడు ప్రభుత్వం సత్కరించి మరీ వీడ్కోలు పలికింది. కారణం ఆమె మొత్తం సర్వీసులో ఒక్క శిశువు కూడా కాన్పు సమయంలో మృతి చెందలేదు. ప్రాణం పోసే పని ఎంతటి బాధ్యతాయుతమైనదో ఖతీజాను చూసి తెలుసుకోవాలంటారు సాటి నర్సులు.
ఇలాంటి నర్సులే ప్రతిచోటా కావాలి.


ఖతీజాబీ

అమృత హస్తాలు

‘ఆ రోజుల్లో ప్రయివేటు ఆస్పత్రులు చాలా తక్కువ. ఎంతటి వాళ్లయినా ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి రావాల్సిందే. క్షణం తీరిక ఉండేది కాదు’ అని గుర్తు చేసుకుంది 60 ఏళ్ల ఖతీజాబీ. ఆమె గత నెలలోనే విల్లుపురం ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి పదవీ విరమణ పొందింది. తమిళనాడు ఆరోగ్య శాఖామంత్రి సుబ్రమణియన్ ప్రత్యేక పురస్కారం అందించి మరీ ఆమెను సత్కరించాడు. ‘అందుకు కారణం నా మొత్తం సర్వీసులో ఒక్క పసికందు కూడా కాన్పు సమయంలో ప్రాణం పోగొట్టుకోకపోవడమే’ అంటుందామె సంతృప్తిగా.

■ తల్లి కూడా నర్సే

ఖతీజాబీ ఏదో వేరే పని దొరక్క నర్సు కాలేదు. ఆ వృత్తి పట్ల ప్రేమతోనే అయ్యింది. ‘మా అమ్మ జులేఖా కూడా నర్సుగా పని చేసేది. కాని ఆమె కాలంలో కాన్పు సమయాలు చాలా ఘోరంగా ఉండేవి. తల్లి, బిడ్డ క్షేమంగా బయటపడతారనేది చెప్పలేము. నేను ఆమెను చూస్తూ పెరిగాను. చిన్నప్పుడు సిరంజీలతో ఆడుకున్నాను. అమ్మ వెంట హాస్పిటల్‌కు వెళుతూ హాస్పిటల్ వాసనకు అలవాటు పడ్డాను. 1990లో నేను కూడా నర్సుగా ఉద్యోగం ప్రారంభించాను. అయితే అప్పటికే నాకు పెళ్లయ్యి ఏడు నెలల గర్భిణిగా ఉన్నాను. అలా ఉంటూనే కాన్పులు చేయడం ప్రారంభించాను. నా కాన్పు అయ్యాక కేవలం రెండు నెలలు బ్రేక్ తీసుకుని మళ్లీ డ్యూటీకి హాజరయ్యాను’ అంది ఖతీజా.

■ స్త్రీల వేదన

1990లలో మన దేశంలో ప్రతి లక్ష కాన్పుల్లో 556 మంది శిశువులు మరణించేవారు. నవజాత శిశువుల్లో ప్రతి 1000 మందికి 88 మంది మరణించేవారు. ‘సిజేరియన్ ఆపరేషన్లు చాలామటుకు స్త్రీలను, శిశువులను కాపాడాయి. నేను పని చేసే ఆస్పత్రిలో కేవలం ఒక డాక్టరు, ఇద్దరు నర్సులు ఉండేవాళ్లం. సిజేరియన్ చేసే సామాగ్రి మా దగ్గర ఉండేది కాదు. అందుకే కాన్పు కాంప్లికేట్ అవుతుందని డౌట్ రాగానే జిల్లా (కడలూర్) ఆస్పత్రికి పంపేసేదాన్ని. ఆ తర్వాత కూడా సిజేరియన్‌కు స్త్రీలు భయపడితే ధైర్యం చెప్పేదాన్ని. కానీ ఇవాళ మామూలు నొప్పులు వద్దని స్త్రీలు సిజేరియనే కోరుకుంటున్నారు’ అని తెలిపింది ఖతీజా. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతులు పెంచడం, స్త్రీల అక్షరాస్యత కోసం శ్రద్ధ పెట్టడం తదితర కారణాల వల్ల ప్రసూతి మరణాలు తగ్గుముఖం పట్టాయని ఖతీజా అంటోంది. ‘ఇవాళ మన దేశంలో ప్రతి లక్ష కాన్పుల్లో కేవలం 88 మంది పిల్లలే మరణిస్తున్నారు. నవజాత శిశువుల్లో వెయ్యికి 27 మంది మరణిస్తున్నారు’ అందామె.

■ ఎంతో సంతృప్తి

‘2008 మార్చి 8 నా జీవితంలో మర్చిపోలేను. ఆ రోజు డ్యూటీకి రావడంతోటే ఇద్దరు స్త్రీలు నొప్పులతో ఉన్నారు. వారి కాన్పుకు సాయం చేశాను. రోజులో ఇద్దరు సాధారణమే. కాని ఆ తర్వాత ఆరు మంది వచ్చారు. వారంతా కూడా ఆ రోజే కాన్పు జరిగి పిల్లల్ని కన్నారు. బాగా అలసటగా అనిపించింది. కాని సాయంత్రం డ్యూటీ దిగి వెళుతుంటే ఎనిమిది మంది చంటి పిల్లలు తల్లుల పక్కన పడుకుని కేరుకేరుమంటుంటే ఏడుస్తుంటే చాలా సంతోషం కలిగింది. కాన్పు సమయంలో స్త్రీలు ఎంతో ఆందోళనగా ఉంటారు. వారికి ముందుగా ధైర్యం చెప్పడంపై నేను దృష్టి పెట్టేదాన్ని. బిడ్డను కనే సమయంలో వారు ఎంత బాధ అనుభవించినా బిడ్డ పుట్టి కేర్‌మన్నాక తప్పనిసరిగా నవ్వు ముఖంతో బిడ్డవైపు చూసేవారు. వారి ఆ నవ్వు నాకు ఎంతో సంతృప్తిని చ్చేది. రిటైరయ్యానన్న మాటే గాని నా మనసు మాత్రం అలాంటి తల్లుల సేవలోనే ఉండమని చెబుతోంది’ అని ముగించింది ఖతీజా.

మారిన దృష్టి

‘నేను కాన్పులు చేసిన కొత్తల్లో రెండో సంతానంగా, మూడో సంతానంగా కూడా ఆడపిల్లే పుడితే ఆ తల్లులు అంతులేనంతగా ఏడ్చేవారు. అసలు తండ్రులు చూడ్డానికి కూడా వచ్చేవారు కాదు. ఇవాళ ఆ ధోరణిలో మార్పు వచ్చింది. అమ్మాయిలు పుట్టినా అబ్బాయిలు పుట్టినా కేవలం ఇద్దరు చాలని ఎక్కువమంది అనుకుంటున్నారు. నా మొత్తం సర్వీసులో 50 మంది కవలలకు పురుడు పోశాను. ఒక కాన్పులో ట్రిప్లెట్ పుట్టారు’ అందామె.




ప్రాచీ భాటియా

అరకొర ఆర్థిక పరిస్థితులు బాల్యాన్ని సర్దుకు పొమ్మన్నాయి. ఏమీ తెలియని పసిమనసు కూడా పరిస్థితులకు తలొంచక తప్పలేదు. తన వయసుతో పాటు కుటుంబ ఆర్థికభారం పెరిగిపోతుంటే చూడలేకపోయింది. డిగ్రీలోనే సంపాదనకు నడుం బిగించి, 28 ఏళ్లకే సక్సెస్‌ఫుల్ ఎంట్రప్రెన్యూర్‌గా రాణిస్తోంది ప్రాచీ భాటియా.

జీవితాన్ని అలంకరించుకుంది

ఘజియాబాద్‌కు చెందిన ప్రాచీ భాటియా దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టింది. తండ్రి జర్నలిస్టు, తల్లి గృహిణి. తండ్రికొచ్చే కొద్దిపాటి ఆదాయమే కుటుంబానికి ఆధారం. ఆ ఆదాయం ఏమూలకూ సరిపోయేది కాదు. ప్రాచీ స్కూలు ఫీజులు కట్టడం కూడా చాలా కష్టంగా ఉండేది. ఎప్పుడూ స్కూల్లో అందరికంటే ఆలస్యంగా ఫీజు చెల్లించేవారు. ఇంతటి గడ్డు పరిస్థితుల్లో సైతం ఇంటర్మీడియట్ పూర్తిచేసిన ప్రాచీ ... తనకెంతో ఇష్టమైన డిజైనింగ్ డిగ్రీ చేయాలనుకుంది. అనుకున్నట్టుగానే ఢిల్లీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఎఫ్‌టీ)లో సీటు సంపాదించింది. కానీ అక్కడ హాస్టల్ ఫీజు, ఇతర ఖర్చులకు డబ్బులు లేక ఎన్‌ఐఎఫ్‌టీలో చేరలేదు. గురుగామ్‌లోని జీడీ గోయెంకా యూనివర్శిటీలో చేరింది.

■ సంపాదిస్తూనే కాలేజీ టాపర్

అతి కష్టంమీద డిగ్రీలో చేరిన ప్రాచీ.. ఒకపక్క చదువుకుంటూనే మరోపక్క చిన్న వ్యాపారం ప్రారంభించింది. కుటుంబానికి ఆర్థికంగా సాయపడేందుకు.. గిఫ్ట్స్ తయారు చేసి విక్రయించేది. ఫొటో ఆల్బమ్స్, ఫొటో ప్రింటెడ్ ల్యాంప్స్, హ్యాండ్‌మేడ్ కార్డ్స్, రోజెస్ వంటివి తయారు చేసి ఫేస్ బుక్ పేజీలో పోస్టు చేసేది. ఇలా విక్రయిస్తూ నెలకు ఐదు వేల రూపాయల దాకా సంపాదించేది. వాటిలో కొంత ఇంట్లో ఇచ్చి మిగతావి దాచుకునేది. ఆర్ట్స్, క్రాఫ్ట్స్ మీద ఆసక్తి ఉండడంతో సర్టిఫికెట్ కోర్సులు చేసేది. మరోపక్క డిగ్రీ చదువుతూ వచ్చే స్కాలర్ షిప్‌తో తన ఎడ్యుకేషన్ లోన్ కట్టేది. ఇవన్నీ చేస్తూ కూడా డిగ్రీలో కాలేజ్ టాపర్‌గా నిలిచింది ప్రాచీ.

■ ఎంప్లాయీ నుంచి ఎంట్రప్రెన్యూర్‌గా

డిగ్రీ పూర్తవగానే ప్రాచీ గురుగామ్‌లోని ఓ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో అసిస్టెంట్ డిజైనర్‌గా చేరింది. కొన్నాళ్లు పని చేశాక.. మరో బహుళ జాతి కంపెనీలో డిజైనర్‌గా ఉద్యోగావకాశం వచ్చింది. అందులోచేరిన కొద్దిరోజులకే ‘‘ఒకరి కింద నేనెందుకు పనిచేయాలి? నేనే ఏదైనా కొత్తగా ప్రారంభించవచ్చు కదా!’’ అనుకుని వెంటనే ఉద్యోగం వదిలేసింది. అప్పటిదాకా చేసిన ఉద్యోగ అనుభవ పాఠాలతో 24 ఏళ్ల వయసులో సొంతంగా ‘చౌఖట్’ పేరిట హోండెకార్ బ్రాండ్‌ను స్థాపించింది. అప్పటివరకు దాచుకున్న లక్ష రూపాయలను పెట్టుబడిగా పెట్టి.. ఇంటి అలంకరణలో ఉపయోగించే ఉత్పత్తులను పేపర్ మీద డిజైన్ చేసి, మొరాదాబాద్, జైపూర్, నోయిడాలలోని కళాకారులతో రకరకాల కళాఖండాలను తయారు చేయించేది. తయారైన ఉత్పత్తులను ఫోటోషూట్ చేసి తన సొంత వెబ్‌సైట్‌లో పెట్టి విక్రయించడం మొదలు పెట్టింది. విక్రయాలు కాస్త మందకొడిగా ఉండడంతో.. ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రకటనలు ఇచ్చింది. వీటి ద్వారా చౌఖట్‌కు గుర్తింపు రావడంతో వ్యాపారం ఊపందుకుంది. దీంతో తన మార్కెటింగ్ బడ్జెట్ నెలకు యాభైవేలకు చేరింది. తొలిఏడాది మూడు లక్షలు, రెండో ఏడాది పదకొండు లక్షలు. దురదృష్ట వశాత్తూ మూడో ఏడాది కరోనా కారణంగా ఆశించినంత ఆదాయం రాలేదు. దాంతో ప్రాచీ తన ఐడియాలతో వ్యాపారం పుంజుకునేలా చేయడంతో... గతేడాది (నాలుగో సంవత్సరం) ఒక్కసారిగా 35.5 లక్షలకు చేరింది. ఐదు వందల నుంచి ఇరవై వేల రూపాయల ధరల్లో ఉన్న 70 రకాల ఛౌఖట్ ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా ఆర్డర్లు వస్తున్నాయి. తను డిజైన్ చేసిన వస్తువులను స్కూటీ మీద మోసుకెళ్లిన ప్రాచీ ఇటీవలే తన సొంత డబ్బులతో కారు కొనుక్కుంది.


తమ ఉత్పత్తులను ఫోటోషూట్ చేయించి పరిశీలిస్తున్న ప్రాచీ

■ రాయి శిల్పంగా మారినట్టు..

‘‘నేను నడిచిన దారిలో అనేక బెదిరింపులు, వయసు వివక్షలు వంటి అనేక ఇబ్బందులు, సమస్యలు, ఒత్తిళ్లు ఎదురయ్యేవి. అయితే ఉలి దెబ్బలకు రాయి శిల్పంగా మారినట్లు వీటన్నింటిని భరిస్తూనే ఈ స్థాయికి వచ్చాను. భవిష్యత్‌లో చౌఖట్ టర్నోవర్‌ను నాలుగు వందల కోట్లకు తీసుకెళ్లాలి. ఇంటి అలంకరణ వస్తువులు కావాలంటే కష్టమర్లు నా చౌఖట్‌ను ఎంచుకునే స్థాయికి ఎదుగుతాను’’ అని ప్రాచీ సగర్వంగా చెబుతోంది.

బ్యూటిప్స్

ఇలా చేస్తే...

వాతావరణంలో మార్పుల వల్ల లేదా జుట్టు స్వభావం వల్ల ఒకోసారి తలస్నానం చేసినప్పటికీ వెంట్రుకలు వాసన వస్తుంటాయి. కొంతమందిలో వాసనతోపాటు జుట్టు ఊడిపోతుంటుంది. ఈ సమస్య నివారణకు ఇంట్లోనే సులభంగా చేసుకోదగిన ఈ రెండు చిట్కాలు చక్కగా పనిచేస్తాయి.



- అలోవెరా జెల్ లేదా అలోవెరా నూనెను వారానికి ఒకసారి తలకు పట్టించి గంట తరువాత కడిగితే వెంట్రుకల నుంచి వచ్చే వాసన పోతుంది. అలోవెరాలోని విటమిన్ ఎ, సి, ఇ, బీ12 లు జుట్టుకు అంది పెరుగుదలకు దోహద పడతాయి.
- శీకా కాయ, ఉసిరిపొడి, కరివేపాకు, మందార పువ్వులను సమపాళ్లల్లో తీసుకుని రాత్రంతా నానబెట్టాలి. మరుసటిరోజు ఉదయం వీటన్నింటిని పేస్టు చేయాలి. ఈ పేస్టుని జుట్టుకి పట్టించి అరగంట తరువాత షాంపూతో కడిగేయాలి. వారానికి మూడుసార్లు ఇలా చేయడం వల్ల కురుల నుంచి వచ్చే చెడువాసన పోవడంతోపాటు, జుట్టు కూడా పెరుగుతుంది.





యూత్ పల్స్

వయసు పైబడిన వారికి సుపరిచితమైన ‘మతిమరుపు’ ఇప్పుడు యువతకు హాయ్ చెబుతూ వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తోంది. ఆ ప్రయత్నాన్ని నివారించడానికి పురాతన రోమన్, గ్రీక్ మెమొరైజేషన్ స్ట్రాటజీ ‘మెథడ్ ఆఫ్ లోకి’ నుంచి చిన్నాచితకా బ్రెయిన్ ఎక్సర్‌సైజ్‌ల వరకు ఎన్నో చేస్తున్న వారు యూత్‌లో ఎంతో మంది ఉన్నారు...

సారీ... మీ పేరు మరచిపోయాను!

ఢిల్లీకి చెందిన 22 సంవత్సరాల శ్రుతి అగర్వాల్ ఒకప్పుడు సినిమా చూస్తే... ఆ సినిమా గురించి ఆర్డర్ తప్పకుండా సీన్ బై సీన్ చెప్పేది. ఎన్నో సంవత్సరాల క్రితం చూసిన సినిమా అయినా సరే ఈరోజే చూసినంత ఫ్రెష్‌గా చెప్పేది.

అలాంటి శ్రుతికి రెండు వారాల క్రితం చూసిన సినిమా కథ కూడా గుర్తుండడం లేదు అనేది ఒక విషయం అయితే కొత్త వారి పేర్లు త్వరగా మరచిపోవడం మరో విషయం. తనకు మతిమరుపు దగ్గరవుతుంది అని చెప్పడానికి ఈ రెండే కాదు ఇంకా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

శృతికి ఎలాంటి దురలవాట్లు లేవు. వేళకు నిద్ర పోతుంది. సరియైన ఆహారం తీసుకుంటుంది.

మరి ఎందుకు తన జ్ఞాపకశక్తి బలహీనం అవుతోంది?

తనను తాను విశ్లేషించుకునే సమయంలో ఎప్పుడో స్కూల్ రోజుల్లో చదువుకున్న ‘యూజ్ ఇట్ ఆర్ లూస్ ఇట్’ అనే సామెత గుర్తుకువచ్చింది. అందులోనే తన సమస్యకు సగం పరిష్కారం కనిపించింది. స్కూల్, కాలేజీ రోజుల్లో ఏదైనా లెక్క చేయాలంటే మనసులో క్యాలిక్యులేట్ చేసుకోవడమో, కాగితం మీద చేయడమో జరిగేది.

ఇప్పుడు మనసుతో పనిలేదు.

చిన్నాచితకా లెక్కలకైనా స్మార్ట్‌ఫోన్‌లోని క్యాలిక్యులేటర్‌పై అతిగా ఆధారపడుతుంది. ఒక శుభకార్యం లేదా ఏదైనా ముఖ్యమైన కార్యక్రమాన్ని గుర్తు పెట్టుకోవడానికి ఆ తేదీని మదిలో ముద్రించుకునేది..

ఇప్పుడు సెల్‌ఫోన్‌లోని రిమైండర్‌కు పని చెబుతోంది. తన మెదడును సరిగా ఉపయోగించుకోకపోవడం వల్లే తనకు మతిమరపు దగ్గరవుతోందని గ్రహించిందామె. తనకు ఇప్పుడు కావాల్సింది బ్రెయిన్‌కు ఎక్సర్‌సైజ్ అనే విషయం అర్థమైంది. దీని గురించిన సమాచార శోధనలో తనను ఆకట్టుకున్నది.... పురాతనమైన మెమొరైజేషన్ స్ట్రాటజీ... మెథడ్ ఆఫ్ లోకి.

మెమోరీ కోచ్, అథ్లెట్ బోరిస్ నికోలాయ్ వందల పేర్లను కేవలం పదిహేను నిమిషాల వ్యవధిలో గుర్తు పెట్టుకొని చెబుతాడు. నికోలాయ్ నెదర్లాండ్స్‌కు చెందిన న్యూరోసైంటిస్ట్ మార్టిన్ డ్రెస్లర్‌తో కలిసి ఒక అధ్యయనం నిర్వహించాడు. అందులో భాగంగా 20 ఏళ్ల వయసు ఉన్న 51 మందిని మూడు గ్రూప్‌లుగా విభజించారు.


మొదటి గ్రూప్ చేత ‘మెథడ్ ఆఫ్ లోకి’ ప్రాక్టీస్ చేయించారు. రెండో గ్రూప్ చేత షార్ట్‌టర్మ్ మెమొరీ గేమ్స్ ఆడించారు. మూడో గ్రూప్‌కు మాత్రం ఎలాంటి కార్యక్రమం ఇవ్వలేదు. ఆరువారాల తరువాత... మొదటి గ్రూప్ మెమొరీ పవర్ పెరిగింది. రెండు, మూడు గ్రూప్‌లలో పెద్దగా మార్పు కనిపించలేదు.

పురాతనమైన ‘మెథడ్ ఆఫ్ లోకి’ ప్రాధాన్యత కోల్పోలేదు అని చెప్పడానికి ఇదొక బలమైన ఉదాహరణ. అందుకే యూత్ దీనిపై ఆసక్తి కనబరుస్తోంది. ‘మెథడ్ ఆఫ్ లోకి’ని మెమొరీ జర్నీ, మెమొరీ ప్యాలెస్... మొదలైన పేర్లతో పిలుస్తున్నారు. ‘లోకి’ అనేది ‘లోకస్’ అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. దీని అర్థం... ప్రదేశం. సమాచారాన్ని మనసులోని ఊహాజనిత ప్రదేశాల్లో స్థిరపరుచుకోవడమే ‘మెథడ్ ఆఫ్ లోకి’ టెక్నిక్.

ఉదాహరణకు...717, 919, 862, 91 99.. లను గుర్తు పెట్టుకోవాలనుకుంటే మనసులో సుపరిచితమైన ప్రదేశాన్ని ఆవిష్కరించుకోవాలి. సపోజ్ మన ఇల్లు. ఆ ఇంట్లో కిచెన్‌కు ఒక సంఖ్య, డోర్‌కు ఒక సంఖ్య, విండోకు ఒక సంఖ్య ఇచ్చుకోవాలి.

స్థూలంగా చెప్పాలంటే...

‘మెథడ్ ఆఫ్ లోకి’ని ప్రాక్టీస్ చేసినా, రకరకాల మెమోరీ గేమ్స్ ఆడినా, జ్ఞాపకశక్తికి సంబంధించిన అద్భుతమైన పుస్తకాలు చదివినా... శక్తిహీనత ప్రమాదం నుంచి బయటపడి జ్ఞాపకశక్తిని పదిలపరుచుకునే ప్రయత్నమే అవుతుంది. మంచిదే కదా!



బిల్‌గేట్స్ నుంచి యూత్ వరకు...

కోచీ(కేరళ)కు చెందిన 24 సంవత్సరాల కైష తన జ్ఞాపకశక్తి బలహీనం అవుతున్న సమయంలో చదివిన పుస్తకం ‘మూన్‌వాకింగ్ విత్ ఐన్‌స్టీన్: ది ఆర్ట్ అండ్ సైన్స్ ఆఫ్ రిమెంబరింగ్ ఎవ్రీ థింగ్’ ఎంతో ధైర్యాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చింది. జాషువా ఫోయర్ ఎంతో పరిశోధించి, విశ్లేషించి రాసిన ఈ పుస్తకానికి యువతలో ఎంతోమంది అభిమానులు ఉన్నారు. బిల్‌గేట్స్‌కు బాగా నచ్చిన పుస్తకం ఇది. 320 పేజీల ‘మూన్‌వాకింగ్ విత్ ఐన్‌స్టీన్’ లో ఫోయర్ రకరకాల నిమానిక్ టూల్స్ (జ్ఞాపక శక్తికి ఉపకరించేవి) నుంచి ఇంగ్లాండ్‌కు చెందిన విద్యావేత్త టోనీ బుజాన్ మైండ్ మ్యాపింగ్ టెక్నిక్స్ వరకు ఎన్నో అంశాలు ప్రస్తావించాడు.



పిల్లల చదువుల కోసం ఇళ్లలో పాచిపనులు చేసిన మధు ఇప్పుడు కాలేజీలో పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా పాఠాలు చెబుతోంది. ఒకప్పుడు ఇంగ్లిష్ చదువులు మీరేం చదువుతారని పిల్లలకు అడ్మిషన్ ఇవ్వలేదు. అలాంటి ఆమె పిల్లలు ఇప్పుడు ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఉన్నత విద్యను కొనసాగిస్తున్నారు. ఈ విజయం ఒక్కరోజుతో రాలేదు. ప్రతిరోజూ పోరాటమే అని వివరిస్తారు రాజస్థాని భిల్వారా నివాసి మధు. ఆమె గురించి అడిగితే సక్సెస్‌ని ఏ విధంగానైనా కష్టపడి సాధించుకోవచ్చు అని చెబుతుంది.

పాచిపని చేసింది... లెక్చరర్‌గా రాణిస్తోంది

‘‘మేం ఆరు మంది తోబుట్టువులం. మా నాన్న చనిపోయినప్పుడు నాకు నాలుగేళ్లు. ఎన్నో ఇక్కట్ల మధ్య పెరిగాను. ఇంటర్మీడియెట్ పూర్తయ్యాక పెళ్లయింది. నా భర్త ఒక కంపెనీలో వర్కర్‌గా పనిచేసేవాడు. అతని జీతం ఇంటి అవసరాలకు ఏ మాత్రం సరిపోయేది కాదు. పిల్లలు పుట్టాక ఇంకా సమస్యలు పెరిగాయి. దీంతో కుట్టుపని మొదలు పెట్టాను. కొంత కాలానికి మా ఆయనకు కీళ్లనొప్పులు వచ్చి, ఆరోగ్యం బాగా క్షీణించడంతో ఆయన చేస్తున్న పనిని వదిలేయాల్సి వచ్చింది. దీంతో ఇంటి ఆర్థిక పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. ఈ కష్టకాలంలో దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ వారి స్కూల్‌కు దగ్గరలో కుట్టుమిషన్ పెట్టుకోవడానికి ప్లేస్ ఇచ్చాడు. అక్కడ కూర్చొని కుట్టుపని చేసేదాన్ని. అక్కడ బ్యాగులు, కవర్లు తయారు చేయడం మొదలు పెట్టినప్పుడు, ఆ స్కూల్ టీచర్ ఒకరు నేను చాలా త్వరగా వర్క్ నేర్చుకుంటానని గమనించారు. నా పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవాలని కాన్వెంట్ స్కూల్‌లో చేర్పించడానికి వెళితే, ‘మీరు చదువుకోలేదు, స్కూల్ ఫీజులు కూడా కట్టలేరు, అడ్మిషన్ ఇవ్వలేం’ అన్నారు. ఈ విషయం నన్ను చాలా ఇబ్బంది పెట్టింది.

■ ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపల్

నేను కుట్టుపని చేస్తున్నప్పుడు బ్యాగుల తయారీ గురించి తెలుసుకోవడానికి ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపల్ వచ్చేవారు. ఆ సమయంలో పిల్లలతోపాటు నన్ను కూడా చదువుకోమని ప్రోత్సహించారు. అందుకు తగిన దూరవిద్య ఫామ్స్ కూడా తెచ్చి ఇచ్చారు. దీంతో పిల్లలు గవర్నమెంట్ స్కూల్లో, నేను కుట్టుమిషన్ దగ్గరే చదువుకునేదాన్ని. రోజూ ఉదయాన్నే నాలుగిళ్లలో పనులు చేయడం, కుట్టుమిషన్‌పై బ్యాగులు కుట్టడం, ఖాళీ సమయంలో డిగ్రీ పుస్తకాలు చదవడం... ఇలాగే నడిచేది.

■ అడ్డంకిగా మారిన పరిస్థితులు

నేను పట్టుదలగా చదువుకోవడం చూసిన గవర్నమెంట్ స్కూల్ టీచర్లు కూడా నన్ను ప్రోత్సహించేవారు. పిల్లలు కూడా నాకు చదువుకోవడానికి అవకాశం ఇచ్చేవారు. అయితే, మా అత్తగారు ఆపేవారు. మామగారికి మా బంధువులు వెక్కిరిస్తున్నారని చెప్పేవారు. ఆమె సాయంత్రం పూట ఎక్కడకు వెళ్తుందో, ఎక్కడి నుండి వస్తుందో అని విపరీతపు మాటలు రకరకాలుగా మాట్లాడుకునేవారు. కానీ, నా భర్త వాటన్నింటినీ పట్టించుకోవద్దని చెప్పేవారు.

నేను ఎం.ఏ. పరీక్షలు రాస్తున్నప్పుడు మా మామగారు చనిపోయారు. దీంతో చదువును వదులుకునే పరిస్థితి వచ్చింది. కానీ, స్కూల్ టీచర్ శైలజ వచ్చి మా అత్తగారికి నచ్చచెప్పి, నన్ను చదువు కొనసాగించమని ప్రోత్సహించడంతో ఆ పరిస్థితి నుంచి గట్టెక్కాను.

■ లెక్చరర్‌గా చేస్తూనే..

మొదటిసారి నెట్‌లో అర్హత సాధించడంతో అంతా ఆశ్చర్యపోయారు. పొలిటికల్ సైన్స్‌లో ఎం.ఏ. పూర్తిచేసి, పీహెచ్‌డీకి అడ్మిషన్ తీసుకున్నాను. పిల్లలు పెద్దవడంతో డబ్బు అవసరం కూడా పెరిగింది. దీంతో పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా చేరాను. నెలకు ఆరువేల రూపాయలు వచ్చేవి. వాటితోనే ఇల్లు గడవదని, టైలరింగ్ పనులు చేస్తూనే ఉండేదాన్ని. కానీ, మనం అనుకున్నవి అన్నీ జరగవు కదా. మా వారి ఆరోగ్యం మరీ క్షీణించడంతో ట్రీట్‌మెంట్ నెలలపాటు కొనసాగింది. దీనిని తట్టుకుంటూనే నా జీవన పోరాటం చేస్తూనే ఉన్నాను. నా కూతురు ఐఐటీలో సీటు సంపాదించి, మాస్టర్స్ కూడా చేసింది. కొడుకు ఇంకా చదువుకుంటున్నాడు. నాలుగిళ్లలో పనిచేసుకునే నేను ఇప్పుడు లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. నా భర్తను అనారోగ్యం నుంచి కాపాడుకున్నాను. పిల్లలు మంచి చదువులు చదువుకుంటూ ఉన్నత అవకాశాలను అందుకుంటున్నారు. త్వరలోనే మంచి ఉద్యోగాల్లో వారిని చూడబోతున్నాను’’ అని ఆనందంగా వివరించే మధు జీవనపోరాటంలో విజయం ఒక్కరోజుతో సాధ్యం కాలేదని, ప్రతిరోజూ కఠోరశ్రమ చేస్తే వచ్చిందని చెబుతోంది మధు.

మధు



క్వార్టర్ ఫైనల్లో రష్మిక, సహజ జోడీలు

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన శ్రీవల్లి రష్మిక, సహజ యామలపల్లి తమ భాగస్వాములతో కలిపి డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. థాయ్‌లాండ్‌లో మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 6-1, 6-3తో పవిని -జులాలక్ (థాయ్‌లాండ్) జంటపై... సహజ-సోహా (భారత్) జోడీ 6-3, 3-6, 10-6తో ఆన్ యుజిన్ (కొరియా)-ఇకుమి (జపాన్) ద్వయంపై గెలిచాయి.

మిగతా 'యాషెస్' టెస్టులకు పోప్ దూరం



ఆస్ట్రేలియా చేతిలో రెండు టెస్టుల్లో ఓడిపోయి ఇబ్బందుల్లో ఉన్న ఇంగ్లండ్ జట్టుకు మరో దెబ్బ పడింది. జట్టు వైస్ కెప్టెన్ ఓలి పోప్ భుజం గాయం కారణంగా తదుపరి మూడు టెస్టులకు దూరమయ్యాడు. లార్డ్స్‌లో జరిగిన రెండో టెస్టు సందర్భంగా ఓలి పోప్ గాయపడ్డాడు. పోప్ భుజం గాయానికి శస్త్ర చికిత్స అవసరమని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు తెలిపింది. రెండు టెస్టుల్లో పోప్ మొత్తం 90 పరుగులు సాధించాడు. మూడో టెస్టు గురువారం నుంచి హెడింగ్లీలో జరుగుతుంది.

చీఫ్ సెలెక్టర్‌గా అగార్కర్



ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పురుషుల సీనియర్ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా అజిత్ అగార్కర్‌ను నియమించినట్లు బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రకటించారు. సెలెక్షన్ ప్యానెల్‌లో ఖాళీగా ఉన్న ఒక సెలెక్టర్ పదవి కోసం అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే, సులక్షణ నాయక్‌లతో కూడిన క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) మంగళవారం ఇంటర్వ్యూలు చేసింది. చివరకు అగార్కర్ పేరును ఈ పదవి కోసం సీఏసీ ఏకగ్రీవంగా ప్రతిపాదించింది. అనంతరం అగార్కర్ అనుభవందృష్ట్యా చీఫ్ సెలెక్టర్ పదవికి కూడా సీఏసీ అతని పేరునే సూచించింది. ముంబైకి చెందిన 45 ఏళ్ల అగార్కర్ భారత్ తరఫున 26 టెస్టులు, 191 వన్డేలు, నాలుగు టి20 మ్యాచ్‌లు ఆడాడు. 2007లో ధోని సారథ్యంలో టి20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో అగార్కర్ సభ్యుడిగా ఉన్నాడు. వన్డేల్లో వేగవంతమైన అర్ధ సెంచరీ చేసిన భారత బ్యాటర్ రికార్డు ఇప్పటికీ అగార్కర్ పేరిటే ఉంది. 2000లో జింబాబ్వేతో జరిగిన వన్డేలో అగార్కర్ 21 బంతుల్లో అర్ధ సెంచరీ చేశాడు. ప్లేయర్‌గా కెరీర్ ముగిశాక అగార్కర్ ముంబై జట్టు చీఫ్ సెలెక్టర్‌గా, ఢిల్లీ క్యాపిటల్స్ అసిస్టెంట్ కోచ్‌గా పని చేశాడు.

భారత సీనియర్ సెలెక్షన్ కమిటీ: అజిత్ అగార్కర్ (చైర్మన్), శివ సుందర్ దాస్, సుబ్రతో బెనర్జీ, సలీల్ అంకోలా, శ్రీధరన్ శరత్.

చాంపియన్ భారత్

తొమ్మిదోసారి 'శాఫ్' టైటిల్ సొంతం ● ఫైనల్లో 'పెనాల్టీ షూటౌట్'లో కువైట్‌పై విజయం



బెంగళూరు: దక్షిణాసియా ఫుట్‌బాల్‌లో భారత జట్టు మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. దక్షిణాసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ (శాఫ్)లో తొమ్మిదోసారి భారత జట్టు చాంపియన్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో సునీల్ ఛెత్రి కెప్టెన్సీలోని టీమిండియా 'పెనాల్టీ షూటౌట్'లో 5-4తో కువైట్ జట్టును ఓడించింది. కువైట్ పశ్చిమ ఆసియా దేశమైనా పోటీతత్వం పెరగాలనే ఉద్దేశంతో దక్షిణాసియా టోర్నీకి ఆ జట్టును ప్రత్యేకంగా ఆహ్వానించారు. లీగ్ దశలో కువైట్‌తో జరిగిన మ్యాచ్‌ను 1-1తో 'డ్రా' చేసుకున్న భారత్ తుది పోరులో మాత్రం పైచేయి సాధించింది. ఆట 14వ నిమిషంలో అల్‌బలూషి గోల్‌తో కువైట్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 39వ నిమిషంలో లాలియన్‌జులా చాంగ్టే గోల్‌తో భారత్ 1-1తో స్కోరును సమం చేసింది. ఆ తర్వాత రెండు జట్లు మరో గోల్ చేయలేకపోయాయి. అదనపు సమయంలోనూ స్కోరు సమంగానే ఉంది. దాంతో విజేతను నిర్ణయించడానికి పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. 'షూటౌట్'లో నిర్ణీత ఐదు షాట్‌ల తర్వాత రెండు జట్లు 4-4తో సమంగా నిలిచాయి. ఆరో షాట్‌లో భారత ప్లేయర్ మహేశ్ సింగ్ గోల్ చేయగా... కువైట్ ప్లేయర్ హజియా కొట్టిన షాట్‌ను భారత గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధూ అడ్డుకోవడంతో టీమిండియా విజయం ఖాయమైంది.

విజేతగా నిలిచిన భారత జట్టుకు 50 వేల డాలర్లు (రూ. 41 లక్షలు), రన్నరప్ కువైట్ జట్టుకు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 50 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

'షూటౌట్' సాగిందిలా...

భారత్		స్కోరు	కువైట్	
సునీల్ ఛెత్రి	✔	1-0	అబ్దుల్లా	✘
సందేశ్ జింగాన్	✔	2-1	అలోతైబి	✔
లాలియన్‌జులా	✔	3-2	అల్దెఫీరి	✔
ఉదాంత సింగ్	✘	3-3	మహ్రాన్	✔
సుభాశ్ బోస్	✔	4-4	అల్ఖాల్డి	✔
మహేశ్ సింగ్	✔	5-4	హజియా	✘

9 'శాఫ్' చాంపియన్‌షిప్ ఇప్పటివరకు 13 సార్లు జరిగింది. భారత్ తొమ్మిదిసార్లు (1993, 1997, 1999, 2005, 2009, 2011, 2015, 2021, 2023) టైటిల్ సాధించింది.

24 'శాఫ్' చాంపియన్‌షిప్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా సునీల్ ఛెత్రి అవతరించాడు. 23 గోల్స్‌తో అలీ అష్ఫాక్ (మాల్దీవులు) పేరిట ఉన్న రికార్డును 24 గోల్స్‌తో సునీల్ ఛెత్రి అధిగమించాడు.

అల్‌కరాజ్ అలవోకగా...

- రెండో రౌండ్‌లోకి టాప్ సీడ్
- ముర్రే ముందంజ



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో అల్‌కరాజ్ 6-0, 6-2, 7-5తో జెరెమీ చార్డీ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. గంటా 53 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ పది ఏస్‌లు సంధించి రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. చార్డీ సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసిన ఈ స్పెయిన్ స్టార్ తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయాడు. నెట్ వద్దకు తొమ్మిదిసార్లు దూసుకొచ్చిన అల్‌కరాజ్ ఏడుసార్లు పాయింట్లు గెలిచాడు. 38 విన్నర్స్ కొట్టిన అతను 14 అనవసర తప్పిదాలు చేశాడు. మరో మ్యాచ్‌లో రెండుసార్లు చాంపియన్, బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే కూడా అలవోక విజయంతో రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. రియాన్ పెనిస్టన్ (బ్రిటన్)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ముర్రే 6-3, 6-0, 6-1తో విజయం సాధించాడు. వర్షం కారణంగా రెండో రోజు పలు మ్యాచ్‌లకు అంతరాయం కలిగింది. పైకప్పు కలిగిన సెంటర్ కోర్టు, నంబర్‌వన్ కోర్టులోని మ్యాచ్‌లు సజావుగా సాగాయి. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ రిబాకినా (కజకిస్తాన్) కష్టపడి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. రిబాకినా 4-6, 6-1, 6-2తో షెల్బీ రోజర్స్ (అమెరికా)పై నెగ్గింది. మరో మ్యాచ్‌లో ఆరో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) 6-3, 6-3తో మగ్దలినా ఫ్రెచ్ (పోలాండ్)ను ఓడించింది. సోమవారం ఆలస్యంగా ముగిసిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ఏడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 4-6, 6-4, 2-6తో 2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ సోఫియా కెనిన్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది.

రజతం గెలిచిన వ్రితి



సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి వ్రితి అగర్వాల్ మూడో పతకం సాధించింది. గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం జరిగిన మహిళల 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి రజత పతకం గెలిచింది. వ్రితి 9ని:17.62 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచింది. భవ్య సచ్‌దేవ (ఢిల్లీ; 9ని:15.59 సెకన్లు) స్వర్ణం, అనన్య (మహారాష్ట్ర; 9ని:24.67 సెకన్లు) కాంస్యం నెగ్గారు.

భారత 'ఎ' జట్టులో నితీశ్ రెడ్డి



న్యూఢిల్లీ: ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్-23 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత 'ఎ' జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన భారత 'ఎ' జట్టులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 20 ఏళ్ల నితీశ్ కుమార్ రెడ్డికి స్థానం లభించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి 2018 బీసీసీఐ వార్షిక పురస్కారాల్లో అండర్-16 విభాగంలో 'బెస్ట్ క్రికెటర్' అవార్డు గెల్చుకున్నాడు. ఎనిమిది ఆసియా దేశాల మధ్య వన్డే ఫార్మాట్‌లో జరిగే ఎమర్జింగ్ కప్ టోర్నీ ఈనెల 13 నుంచి 23 వరకు కొలంబోలో జరుగుతుంది. గ్రూప్ 'బి'లో భారత్, నేపాల్, యూఏఈ, పాకిస్తాన్... గ్రూప్ 'ఎ'లో శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్, ఒమన్ జట్లున్నాయి. భారత్ తమ లీగ్ మ్యాచ్‌లను 13న యూఏఈతో... 15న పాకిస్తాన్‌తో... 18న నేపాల్ జట్లతో ఆడుతుంది. సెమీఫైనల్స్ 21న, ఫైనల్ 23న జరుగుతాయి.

భారత 'ఎ' జట్టు: యశ్ ధుల్ (కెప్టెన్), అభిషేక్ శర్మ (వైస్ కెప్టెన్), సాయి సుదర్శన్, నికిన్ జోస్, ప్రదోశ్ రంజన్ పాల్, రియాన్ పరాగ్, నిశాంత్ సింధు, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ధ్రువ్ జురేల్, మానవ్, యువరాజ్ సింగ్ దోడియా, హర్షిత్ రాణా, ఆకాశ్ సింగ్, నితీశ్ కుమార్ రెడ్డి, రాజ్‌వర్ధన్ హంగార్గేకర్.

జింబాబ్వేకు మళ్లీ నిరాశ

- వరుసగా రెండోసారి దక్కని వన్డే ప్రపంచకప్ బెర్త్
- స్కాట్లాండ్ చేతిలో పరాజయం



బులవాయో: తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో తడబడటంతో... జింబాబ్వే జట్టు వరుసగా రెండోసారి వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్‌కు అర్హత సాధించలేకపోయింది. వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా మంగళవారం స్కాట్లాండ్ జట్టుతో జరిగిన తమ 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో జింబాబ్వే 31 పరుగుల తేడాతో ఓడిపోయింది. ముందుగా స్కాట్లాండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 234 పరుగులు సాధించింది. మైకేల్ లీస్క్ (48; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మాథ్యూ క్రాస్ (38; 2 ఫోర్లు), బ్రెండన్ మెక్‌ములెన్ (34; 6 ఫోర్లు) రాణించారు. జింబాబ్వే బౌలర్లలో సీన్ విలియమ్స్ మూడు వికెట్లు, చటారా రెండు వికెట్లు తీశారు. అనంతరం 235 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 41.1 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. రియాన్ బర్ల్ (83; 8 ఫోర్లు, 1 సిక్స్), సికందర్ రజా (34; 2 ఫోర్లు, 1 సిక్స్), మధెవెరె (40; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా ఫలితం లేకపోయింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' క్రిస్ సోల్ (3/33) జింబాబ్వేను దెబ్బ కొట్టాడు. మెక్‌ములెన్, లీస్క్ రెండు వికెట్ల చొప్పున తీశారు. 2019లోనూ జింబాబ్వే క్వాలిఫయింగ్ టోర్నీలోనే వెనుదిరిగింది.

జింబాబ్వేపై విజయంతో స్కాట్లాండ్ దాదాపుగా ప్రపంచకప్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఈనెల 6న నెదర్లాండ్స్‌తో జరిగే తమ చివరి 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో స్కాట్లాండ్ గెలిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా మెగా ఈవెంట్‌కు అర్హత పొందుతుంది. ఒకవేళ ఓడిపోయినా నెదర్లాండ్స్ కంటే రన్‌రేట్ తక్కువ కాకుండా చేసుకుంటే స్కాట్లాండ్‌కే ప్రపంచకప్ బెర్త్ ఖరారవుతుంది. నెదర్లాండ్స్ ప్రపంచకప్‌కు అర్హత సాధించాలంటే స్కాట్లాండ్‌పై భారీ విజయం సాధించాల్సి ఉంటుంది.

డాక్టర్ పుల్లెల గోపీచంద్!

భారత బ్యాడ్మింటన్ కోచ్‌కు గౌరవ డాక్టరేట్



బెంగళూరు: భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్‌కు మరో గౌరవం దక్కింది. కర్ణాటకకు చెందిన శ్రీ సత్య సాయి యూనివర్సిటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. మంగళవారం జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు ఈ పురస్కారాన్ని అందించారు. జాతీయ అభివృద్ధిలో క్రీడల ద్వారా తనదైన పాత్ర పోషించినందుకు గోపీచంద్‌ను డాక్టరేట్ కోసం ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ ప్రకటించింది. గోపీచంద్‌తో పాటు మరో నలుగురు కూడా దీనిని అందుకున్నారు.

సినిమా

యాక్షన్.. పరేషాన్


● షారుక్ ఖాన్
● సల్మాన్ ఖాన్

స్క్రీన్‌పై విలన్లను హీరో రఫ్ఫాడిస్తుంటే ఫ్యాన్స్‌కి కిక్కో కిక్కు.. కానీ ఆ యాక్షన్ సీన్స్ చేసేటప్పుడు స్టార్స్‌కి తగిలే గాయాలు ఒక్కోసారి ఆపరేషన్‌కి దారితీస్తాయి. ఇక ఇటీవల యాక్షన్ షూట్‌లో పరేషాన్ అయిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.

టైగర్‌కి గాయం

ఐదు కేజీల డంబెల్‌ని అమాంతంగా ఎత్తగలిగే సల్మాన్ ఖాన్‌కి ఇటీవల ఐదు కేజీల కన్నా తక్కువ బరువు ఉన్న వస్తువులు ఎత్తడం కష్టమైంది. దానికి కారణం 'టైగర్ 3' సినిమా. ఈ చిత్రం కోసం నెలన్నర క్రితం ఓ రిస్కీ యాక్షన్ సీన్ చేస్తుండగా సల్మాన్ గాయపడ్డారు. ''ప్రపంచాన్నే మన భుజం మీద మోస్తున్న ఫీలింగ్‌లో ఉన్నప్పుడు.. ఆ ప్రపంచాన్ని వదలండి.. ఇప్పుడు కనీసం ఐదు కిలోల డంబెల్ ఎత్తడం కూడా కష్టమవుతోంది'' అని భుజానికి అయిన గాయం తాలూకు నొప్పిని తగ్గించే పట్టీ వేయించుకుని ఉన్న ఫొటోను షేర్ చేశారు సల్మాన్. అంతే.. 'టైగర్ (సల్మాన్‌ని ఉద్దేశించి)కి ఏమీ కాదు... తగ్గిపోతుంది' అంటూ ఫ్యాన్స్ స్పందించారు.

కింగ్ ఖాన్.. నోస్ సర్జరీ

షారుక్ ఖాన్‌ని ఆయన ఫ్యాన్స్ కింగ్ ఖాన్ అని పిలుచుకుంటారు. ఈ కింగ్ ఖాన్ ఫ్యాన్స్‌కి కిక్ ఇవ్వడానికి రిస్కీ ఫైట్స్ చేస్తుంటారు. తాజాగా అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో ఓ చిత్రం కోసం యాక్షన్ సీన్ చేస్తూ, గాయపడ్డారు షారుక్. ముక్కుకి బలమైన గాయం కావడంతో సర్జరీ జరిగిందనే వార్త మంగళవారం వెలుగులోకి వచ్చింది. అమెరికాలో శస్త్ర చికిత్స జరిగిన అనంతరం షారుక్ ముంబై చేరుకున్నారట. ''రక్త స్రావం ఆగడానికి ముక్కుకి చిన్నపాటి శస్త్ర చికిత్స చేశాం. కంగారుపడాల్సిన అవసరం లేదు'' అని షారుక్ వ్యక్తిగత సిబ్బందికి డాక్టర్లు తెలియజేశారని బాలీవుడ్ టాక్.

విక్రమ్.. రిస్కీ పోరాటమ్

విలక్షణ పాత్రలకు చిరునామా విక్రమ్. తాజాగా విక్రమ్ ఓ కొత్త లుక్‌లో నటిస్తున్న చిత్రం 'తంగలాన్'. ఈ చిత్రం కోసం రిస్కీ ఫైట్ షూట్‌లో పాల్గొనే ముందు విక్రమ్ రిహార్సల్స్ చేశారు. అప్పుడు జరిగిన ప్రమాదంలో ఆయన పక్కటెముక విరిగింది. వెంటనే విక్రమ్‌ను ఆస్పత్రికి తరలించారు. రెండు నెలల క్రితం ఈ ప్రమాదం జరిగింది. కోలుకున్నాక ఆయన తిరిగి షూట్‌లో పాల్గొనడంతో సినిమా పూర్తయింది.

పృథ్వీ.. మూడు నెలల విశ్రాంతి

మలయాళ పరిశ్రమలో ఓ స్టార్ హీరోగా, దర్శకుడిగా దూసుకెళుతున్నారు పృథ్వీరాజ్ సుకుమారన్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'విలయత్ బుద్ధ'. పది రోజుల క్రితం ఈ సినిమా కోసం ఒక యాక్షన్ సీన్‌ని ఆర్టీసీ బస్సులో చిత్రీకరిస్తున్నప్పుడు పృథ్వీరాజ్ కింద పడటంతో దెబ్బ తగిలింది. బలమైన గాయం కావడంతో కాలికి సర్జరీ చేయాలని వైద్యులు పేర్కొన్నారు. శస్త్ర చికిత్స అనంతరం దాదాపు మూడు నెలల పాటు బెడ్ రెస్ట్ తీసుకోవాలని పృథ్వీరాజ్‌కి సూచించారు.

వరుణ్.. మూడు వారాల విశ్రాంతి

వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ది కానిస్టేబుల్'. ఈ చిత్రం కోసం ఇటీవల ఓ ఫైట్ సీన్ తీస్తున్న సమయంలో గాయపడ్డారు వరుణ్ సందేశ్. ఈ ప్రమాదంలో వరుణ్ సందేశ్ కాలికి బలమైన గాయం అయింది. దీంతో ఆయన్ని హాస్పిటల్‌కి తరలించారు. చికిత్స అనంతరం మూడు వారాలు విశ్రాంతి తీసుకోవాలంటూ వరుణ్‌కి సూచించారు వైద్యులు. వరుణ్ సందేశ్ గాయపడటంతో 'ది కానిస్టేబుల్' సినిమా షూటింగ్ ప్రస్తుతానికి వాయిదా పడింది.


● విక్రమ్ ● పృథ్వీ ● వరుణ్ సందేశ్

డిసెంబర్‌కి రెడీ


● వరుణ్‌తేజ్

వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కుతోన్న 13వ చిత్రం 'వీటీ 13' (వర్కింగ్ టైటిల్). శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో తెలుగు, హిందీ భాషల్లో సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్‌పై సందీప్ ముద్ద ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో ఈ సినిమాలోని ఓ యాక్షన్ సీక్వెన్స్‌ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఐఏఎఫ్ అధికారిగా యుద్ధ విమానం ముందు నిలబడి ఉన్న వరుణ్ ఫొటోని చిత్రబృందం విడుదల చేసింది. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'వీటీ 13'. త్వరలో టైటిల్ అనౌన్స్ చేస్తాం. డిసెంబర్‌లో సినిమాని రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో మాజీ మిస్ యూనివర్స్ మానుషి చిల్లార్ రాడార్ ఆఫీసర్ పాత్ర చేస్తున్నారు.

ఇది నా టైమ్ అనిపిస్తోంది! - దర్శకుడు నీలకంఠ



''కాన్సెప్ట్, కమర్షియల్ అంశాలను బాగా బ్యాలెన్స్ చేయాలి. అయితే నా గత చిత్రాలకు ఈ బ్యాలెన్స్‌ను మిస్సయ్యానని అనుకుంటున్నా. బాలచందర్‌గారివంటి పెద్ద దర్శకుల కమర్షియల్ చిత్రాలు ఆడియన్స్‌ను అలరిస్తూనే కాన్సెప్ట్ ఓరియంటెడ్‌గా ఉండేవి. 'సర్కిల్' సినిమాకి ఆ బ్యాలెన్స్ మిస్ కాకుండా జాగ్రత్త తీసుకుని, చేశాను'' అన్నారు దర్శకుడు నీలకంఠ. సాయిరోనక్, బాబా భాస్కర్ ప్రధాన పాత్రల్లో అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సర్కిల్'. ఎమ్‌వీ శరత్ చంద్ర, టి. సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నీలకంఠ మాట్లాడుతూ– ''సర్కిల్' ఎమోషనల్ థ్రిల్లర్ ఫిల్మ్. విధి వందమందిని ఓ సర్కిల్‌లోకి తీసుకొచ్చి వారి జీవితాలను ఎలా అల్లకల్లోలం చేసింది? అన్నదే కాన్సెప్ట్. ఈ చిత్రంలో ఫొటోగ్రాఫర్ పాత్రలో నటించిన సాయి రోనక్ అనూహ్యమైన ఘటనల్లో ఎలా చిక్కుకున్నాడు? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఆడియన్స్ సినిమాలను చూసే విధానంలో మార్పు వచ్చింది. నా తరహా సినిమాలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. సో.. ఇది నా టైమ్ ఏమో అనిపిస్తోంది. 'సర్కిల్' ప్రేక్షకులకు నచ్చుతుందనే అనుకుంటున్నాను. ఇక నా కెరీర్‌లో నేను గ్యాప్ ఇవ్వలేదు... ఇవ్వబడింది. 'మాయ' సినిమాను మహేశ్ భట్‌గారు హిందీలో తీయాలనుకున్నారు.. కుదర్లేదు. ఓ రెండు ప్రాజెక్ట్స్ సెట్స్‌కు వెళ్లే టైమ్‌లో ఆగిపోయాయి. స్వామి వివేకానందగారి జీవితంతో వెంకటేశ్‌గారితో ఓ ప్రాజెక్ట్ అనుకున్నాను.. కుదర్లేదు. కానీ ఆయన నటించిన 'ఈనాడు'కు డైలాగ్స్ రాశాను. హిందీ 'క్వీన్' మలయాళ రీమేక్ చేశాను. ఓ సోషల్ డ్రామా, పీరియాడికల్ సబ్జెక్ట్స్‌తో వెబ్ సిరీస్‌ల ప్లాన్ ఉంది'' అన్నారు.

ఇప్పట్లో రీమేక్ చేయను - నిర్మాత అర్జున్ దాస్యన్



శ్రీ సింహా కోడూరి, నేహా సోలంకి జంటగా నటించిన క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'భాగ్ సాలే'. ప్రణీత్ బ్రహ్మాండపల్లి దర్శకత్వంలో అర్జున్ దాస్యన్, యశ్ రంగినేని, కళ్యాణ్ సింగనమల నిర్మించిన ఈ చిత్రం సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో అర్జున్ దాస్యన్ మాట్లాడుతూ– ''కష్టపడకుండా తక్కువ టైమ్‌లో జీవితంలో ఎదగాలనుకునే అర్జున్ అనే ఓ కుర్రాడి లైఫ్ ఫైనల్‌గా ఏమైంది? అన్నదే కాన్సెప్ట్. అర్జున్ పాత్రలో శ్రీ సింహా నటించారు. దర్శకుడు ప్రణీత్ కథ చెప్పినదాని కంటే పదిరెట్లు బాగా తీశాడు. 'కార్తికేయ 2'లోలా ఈ చిత్రంలోనూ కృష్ణుడి కాన్సెప్ట్ ఉంటుంది. ఆ సినిమాకి ఇచ్చినట్లే ఈ సినిమాకి కూడా కాలభైరవ మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఇక నేను నిర్మించిన 'డియర్ మేఘ' చిత్రం కన్నడ 'దియా'కు రీమేక్. కారణాలు తెలియదు కానీ 'డియర్ మేఘ' విడుదలైన రోజే 'దియా' యూట్యూబ్‌లో విడుదలైంది. మాకు బాగా నష్టం కలిగింది. సో.. ఇప్పట్లో రీమేక్ మూవీ చేయకూడదనుకుంటున్నాను. అలాగే కొందరు నిర్మాతల అసోసియేషన్‌తోనే ప్రొడక్షన్ చేద్దామని అనుకుంటున్నాను. ప్రియదర్శి హీరోగా ఓ సినిమా తీస్తున్నాం. హిందీలో రెండు ప్రాజెక్ట్స్ చేస్తున్నాం'' అన్నారు.

కామెడీ.. యాక్షన్


● 'ఇద్దరు' వేడుకలో ఓ దృశ్యం

అర్జున్ సర్జా, జేడీ చక్రవర్తి, రాధికా కుమారస్వామి, ఫైజల్ ఖాన్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఇద్దరు'. ఎస్ఎస్ సమీర్‌దర్శకత్వంలో డీఎస్ రెడ్డి సమర్పణలో ఫర్హీన్ ఫాతిమా నిర్మించారు. ఈ నెల 7న రిలీజవుతున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకకి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అతిథిగా హాజరై, 'ఇద్దరు' మంచి విజయం సాధించాలన్నారు. ''యాక్షన్, కామెడీతో సాగే చిత్రమిది'' అన్నారు ఎస్ఎస్ సమీర్. ''ఈ సినిమాలో హీరో ఎవరు? విలన్ ఎవరన్నది చివరివరకూ ఊహించలేరు'' అన్నారు ఫర్హీన్ ఫాతిమా.

రైజ్ టు రూల్


● కమల్‌హాసన్

జెట్ స్పీడ్‌లో దూసుకెళ్తున్నారు హీరో కమల్‌హాసన్. వరుసగా సినిమాలు సైన్ చేస్తున్నారు. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'ఇండియన్ 2'తో కమల్ బిజీగా ఉంటున్నారు. కాగా 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') తర్వాత మణిరత్నంతో మళ్లీ ఓ సినిమా చేయడానికి కమల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇది కమల్‌హాసన్ కెరీర్‌లో 234వ సినిమాగా ప్రకటించారు. దీంతో ఆయన 233వ సినిమా చర్చనీయాంశమైంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో ఈ సినిమా ఉంటుందనే టాక్ వినిపించింది. ఫైనల్‌గా అదే నిజమైంది. హీరో కమల్‌హాసన్, దర్శకుడు హెచ్. వినోద్ కాంబినేషన్‌లో సినిమాను మంగళవారం ప్రకటించారు. ''అండ్ ఇట్ బిగిన్స్. రైజ్ టు రూల్' అంటూ ఈ సినిమాను ఉద్దేశించి ట్వీట్ చేశారు కమల్.

కళ్లలో భయం!


● పాయల్ రాజ్‌పుత్

'ఆర్ఎక్స్ 100' తర్వాత హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్, దర్శకుడు అజయ్ భూపతి కాంబినేషన్‌లో రూపొందిన డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్ 'మంగళవారం'. స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రానికి అజయ్ భూపతి 'ఎ' క్రియేటివ్ వర్క్స్ నిర్మాణ భాగస్వామి. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా 'ఫియర్ ఇన్ ఐస్ (కళ్లలో భయం) అంటూ 'మంగళవారం' సినిమా టీజర్‌ను మంగళవారం చిత్ర యూనిట్ విడుదల చేశారు. ''ఈ సినిమాలో 30 పాత్రలు ఉన్నాయి. ఇందులోని ప్రతి పాత్ర హైలైట్ అవుతుంది'' అన్నారు అజయ్ భూపతి.

నిజమే నే చెబుతున్నా..


● సందీప్ కిషన్, వర్ష

సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ జంటగా వీఐ ఆనంద్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. ఈ చిత్రం కోసం సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచగా, సిద్ శ్రీరామ్ పాడిన 'నిజమే నే చెబుతున్నా..' పాట మార్చిలో విడుదలైంది. ''ఈ పాట లిరికల్ వీడియోకు శ్రోతల నుంచి మంచి రెస్పాన్స్ లభిస్తోంది. ఈ పాట ఇప్పటికే 3 కోట్ల వ్యూస్ సాధించింది. 'బాగుంటుంది నువ్వు నవ్వితే', 'ప్రియతమా ప్రియతమా, 'మనసు దారి తప్పెనే'... వంటి పాటల తర్వాత సిద్ శ్రీరామ్, నా కాంబినేషన్‌లో వచ్చిన ఈ పాట హిట్ కావడం హ్యాపీగా ఉంది. సందీప్ కిషన్, వీఐ ఆనంద్, గీత రచయిత శ్రీమణిలకు థ్యాంక్స్'' అని అన్నారు.

తొలి ప్రేమ కథతో...


● ఆర్యన్, మిస్తీ

ఆర్యన్ గౌర, మిస్తీ చక్రవర్తి జంటగా నటించిన లవ్‌స్టోరీ 'ఓ సాథియా'. దివ్య భావన దర్శకత్వంలో చందన కట్టా, సుభాష్ కట్టా నిర్మించారు. యూఎఫ్ఓ మూవీస్ సంస్థ ఈ సినిమాను ఈ నెల 7న విడుదల చేయనుంది. ''లవ్‌స్టోరీలో ఓ డిఫరెంట్ యాంగిల్‌ను తీసుకుని ఈ సినిమాను తెరకెక్కించాం. ప్రతి వ్యక్తి జీవితంలో మెమొరబుల్‌గా నిలిచే ఫస్ట్ లవ్ కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్

బుధవారం
5-7-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	274	65,479
నిఫ్టీ ▲	66	19,389

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు సోమవారం ముగింపు)			
నాస్‌డాక్	13,817	▲	29
డోజోన్స్	34,418	▲	11
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,520	▼	7
డాక్స్	16,039	▼	42
షాంఘై	3,245	▲	1
నికాయ్	33,203	▼	3

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై	
బంగారం (24 క్యారట్)	58,522
బంగారం (22 క్యారట్)	58,288
వెండి (కిలో)	69,949

హార్లే డేవిడ్సన్ ఎక్స్440 బుకింగ్స్ షురూ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హార్లే డేవిడ్సన్ ఎక్స్440 బైక్ బుకింగ్స్‌ను ప్రారంభించినట్టు హీరో మోటోకార్ప్ మంగళవారం ప్రకటించింది. అక్టోబర్ నుంచి డెలివరీలు ఉంటాయి. హార్లే డేవిడ్సన్ షోరూంలు, ఎంపిక చేసిన హీరో మోటోకార్ప్ ఔట్‌లెట్స్, ఆన్‌లైన్‌లో రూ.5,000 చెల్లించి బుక్ చేసుకోవచ్చు. 440 సీసీ ఇంజిన్‌తో కూడిన ఈ బైక్స్‌ను నీమ్రానా ప్లాంటులో హీరో మోటోకార్ప్



తయారు చేస్తోంది. 440 సీసీ విభాగంలోకి ఇరు కంపెనీలు ఎంట్రీ ఇవ్వడం ఇదే తొలిసారి. మూడు వేరియంట్లలో ఎక్స్440 లభిస్తుంది. ఎక్స్‌షోరూం ధర రూ.2.29 లక్షల నుంచి ప్రారంభం. 2020 అక్టోబర్‌లో హీరో మోటోకార్ప్, హార్లే డేవిడ్సన్ చేతులు కలిపాయి. ఈ ఒప్పందం ప్రకారం భారత్‌లో హార్లే డేవిడ్సన్ బ్రాండ్ ప్రీమియం మోటార్‌సైకిళ్లను హీరో మోటోకార్ప్ అభివృద్ధి చేయడంతోపాటు విక్రయిస్తుంది.

నిఫ్టీలో ఎల్‌టీఐమైండ్‌ట్రీ

హెచ్‌డీఎఫ్‌సీ స్థానంలో చోటు

న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ–50లో ఎల్‌టీఐమైండ్‌ట్రీ చోటు సాధించనుంది. మార్ట్‌గేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ స్థానే ఇండెక్స్‌లో చేరనుంది. ఈ నెల 13 నుంచి ఇండెక్స్‌లో ప్రాతినిధ్యం వహించనుంది. హెచ్‌డీఎఫ్‌సీ దిగ్గజాల విలీనం నేపథ్యంలో నిఫ్టీ–50తోపాటు.. నిఫ్టీ 100, నిఫ్టీ–500 ఇండెక్స్‌లలోనూ సవరణలు చేపట్టినట్లు ఎన్‌ఎస్‌ఈ వెల్లడించింది. నిఫ్టీ–100లో హెచ్‌డీఎఫ్‌సీకి బదులు జిందాల్ స్టీల్ అండ్ పవర్‌కు చోటు లభించనుంది. ఎన్‌ఎస్‌ఈ ఇండెక్సుల నిర్వహణ ఉపకమిటీ(ఈక్విటీ) ఈ మేరకు మార్పులు చేపట్టినట్లు ఎన్‌ఎస్‌ఈ పేర్కొంది. ఈ బాటలో నిఫ్టీ–500లో హెచ్‌డీఎఫ్‌సీ స్థానంలో మ్యాన్‌కైండ్ ఫార్మా, ఎల్‌టీఐమైండ్‌ట్రీ స్థానంలో జిందాల్ స్టీల్ అండ్ పవర్ ప్రాతినిధ్యం వహించనున్నాయి. తాజా సవరణలు 2023 జూలై 13 నుంచి అమలుకానున్నట్లు ఎన్‌ఎస్‌ఈ తెలియజేసింది.

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఆస్తులు జూమ్

- రూ.8 లక్షల కోట్ల మైలురాయి చేరిక
- ఏడాదిలో రూ.10 లక్షల కోట్లకు...
- సంస్థ డిప్యూటీ ఎండీ సింగ్ వెల్లడి



ముంబై: దేశంలోనే మ్యూచువల్ ఫండ్ నిర్వహణ ఆస్తుల (ఏయూఎం) పరంగా ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ కొత్త రికార్డు నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) రూ. 90 వేల కోట్ల మేర ఆస్తులను పెంచుకుంది. దీంతో సంస్థ నిర్వహణలోని మొత్తం ఏయూఎం మార్చి నాటికి ఉన్న రూ.7.10 లక్షల కోట్ల నుంచి, జూన్ చివరికి రూ.8 లక్షల కోట్లకు చేరుకుంది. వచ్చే 12 నుంచి 18 నెలల్లో మొత్తం నిర్వహణ ఆస్తులు రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటాయని అంచనా వేస్తున్నట్టు ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ డిప్యూటీ ఎండీ, చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డీపీ సింగ్ తెలిపారు. రూ.10 లక్షల కోట్ల మైలురాయిని చేరుకోవాలనే లక్ష్యాన్ని అంతర్గతంగా విధించుకున్నట్టు చెప్పారు. మార్కెట్లో ఏదైనా తీవ్ర పతనాన్ని చూస్తే తప్పితే, తాము దీన్ని చేరుకుంటామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 43 మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని మొత్తం ఏయూఎం జూన్ చివరికి రూ.43.2 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం.

8 శాతం మార్కెట్ వాటా: మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణ ఆస్తులు రూ.43.2 లక్షల కోట్ల ప్రకారం చూస్తే, ఎస్‌బీఐ ఫండ్ ఏయూఎం వాటా 18%. ఇందులో రూ.5.5 లక్షల కోట్ల ఆస్తులు ఈక్విటీలకు సంబంధించినవిగా సింగ్ వెల్లడించారు. ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో తమ పథకాల్లోకి రూ.2,200 కోట్లు వస్తున్నట్టు తెలిపారు. ఎక్కువ పెట్టుబడులు టాప్–30 పట్టణాల నుంచి ఉన్నాయన్నారు. ఎస్‌బీఐ నిర్వహణలోని ఫోలియోల్లో (పెట్టుబడి ఖాతా) 35% చిన్న పట్టణాలవేనని తెలిపారు.

దూకుడు పెంచిన కియా ఇండియా

- 2025 నాటికి 3 కొత్త మోడళ్లు
- వీటిలో రెండు ఎలక్ట్రిక్ కార్లు
- ఏపీ ప్లాంటులోనే తయారీ
- కంపెనీ ఎండీ టే–జిన్ పార్క్
- సెల్టోస్ అప్‌డేటెడ్ వెర్షన్ విడుదల



న్యూఢిల్లీ: వాహన తయారీలో ఉన్న దక్షిణ కొరియా సంస్థ కియా.. భారత మార్కెట్లో 2025 నాటికి మరో మూడు మోడళ్లను ప్రవేశపెట్టనుంది. వీటిలో రెండు ఎలక్ట్రిక్ వెహికల్స్ ఉంటాయని కియా ఇండియా ఎండీ, సీఈవో టే–జిన్ పార్క్ మంగళవారం వెల్లడించారు. సెల్టోస్ అప్‌డేటెడ్ వెర్షన్ విడుదల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కియా 2.0 వ్యూహంలో భాగంగా సమీప భవిష్యత్తులో భారత ప్యాసింజర్ వెహికల్స్ మార్కెట్లో కంపెనీ వాటాను 10 శాతానికి చేర్చాలని లక్ష్యంగా చేసుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం కియాకు సుమారు 7% వాటా ఉందన్నారు. 2030 నాటికి మొత్తం అమ్మకాల్లో ఈవీల వాటా 20%కి చేరుతుందని అంచనా వేశారు.

అనంతపురం ప్లాంటులో: ప్రపంచంలో మూడవ అతిపెద్ద వాహన మార్కెట్ అయిన భారత్ విషయంలో దీర్ఘకాలిక లక్ష్యంతో ఉన్నట్టు టే–జిన్ పార్క్ తెలిపారు. 'ఇక్కడి వృద్ధి తీరుకు అనుగుణంగా వాటాను పెంచుకోవాలంటే కంపెనీ ప్రస్తుతం ఆఫర్ చేస్తున్న మోడళ్లు సరిపోవు. అందుకే కొత్త కార్లను ప్రవేశపెట్టనున్నాం. కొత్తగా వచ్చే మూడు మోడళ్లు కూడా ప్రపంచవ్యాప్తంగా కియా అభివృద్ధి చేసిన రీక్రియేషనల్ (వినోద) వెహికల్స్. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ ప్లాంటులో వీటిని అసెంబుల్ చేస్తాం' అని వివరించారు. పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఈ ఏడాది వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 3.5 లక్షల యూనిట్లకు పెంచుకుంటున్నట్టు వెల్లడించారు. ఇది ఏడాదికి 4.3 లక్షల యూనిట్లకు చేరుకోగలదని అన్నారు. డిమాండ్ బలంగా కొనసాగితే అనంతపురం ప్లాంటులో కొత్త లైన్ ఏర్పాటును కియా పరిశీలించవచ్చని పేర్కొన్నారు.

మరో 15 ఏళ్లు..

భారత్‌లో 2025 నాటికి ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ వేగవంతం అవుతుందని కంపెనీ అంచనా వేస్తోంది. అయితే యూరప్ మార్కెట్‌లా కాకుండా ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌తో (ఐసీఈ) కూడిన వాహనాలు మరో 10–15 సంవత్సరాల పాటు ఇక్కడ కొనసాగుతాయని పార్క్ అన్నారు.

డీజిల్ మోడళ్లు సైతం..: డిమాండ్ కొనసాగుతున్నందున దేశంలో డీజిల్ వాహనాల విక్రయాన్ని కొనసాగిస్తామని కంపెనీ ఎండీ తెలిపారు. ఉద్గార నిబంధనలు కఠినతరం అయితే హైబ్రిడ్, ఇతర సాంకేతికతలను పరిగణిస్తామని వివరించారు. కాగా, కంపెనీ భారత మార్కెట్‌పై దృష్టి సారించడంతో ఎగుమతులు మొత్తం ఉత్పత్తిలో ప్రస్తుతం ఉన్న 25 నుండి 20%కి తగ్గవచ్చని అన్నారు.

నాలుగోరోజూ నాన్‌స్టాప్‌'బుల్స్'

- మరోకొత్త గరిష్టాలకు సూచీలు
- ఆల్‌టైం హైకి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: స్టాక్ మార్కెట్ సరికొత్త రికార్డులను సృష్టిస్తూ పరుగులు పెడుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉండటం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల పరంపర కొనసాగడం ర్యాలీకి తోడ్పడ్డాయి. సూచీలు నాలుగోరోజూ ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డ్‌లను నమోదు చేశాయి. ఉదయం సెన్సెక్స్ 299 పాయింట్ల లాభంతో 65,504 వద్ద, నిఫ్టీ 84 పాయింట్లు పెరిగి 19,407 వద్ద మొదలయ్యాయి. తొలి గంటలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడంతో సూచీలు కొంతమేర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు తిరిగి లాభాల్లోకి మళ్లాయి. బ్యాంకింగ్, ఆర్థిక, ఐటీ రంగాల్లో అధికంగా కొనుగోళ్లు జరిగాయి. ఇంట్రాడేలో వరుసగా నాలుగోరోజూ సెన్సెక్స్ 468 పాయింట్లు పెరిగి 65,673 వద్ద, నిఫ్టీ 111 పాయింట్లు బలపడి 19,434 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 274 పాయింట్ల లాభంతో 65,479 వద్ద ముగిసింది. ఈ సూచీకిది వరుసగా అయిదోరోజూ లాభాల ముగింపు. నిఫ్టీ మార్కెట్ ముగిసేసరికి 66 పాయింట్లు బలపడి 19,389 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్య తరహా షేర్లకూ డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.22%, 0.05 % చొప్పున లాభపడ్డాయి. ఇంధన, ఆటో, కన్జూమర్, కమోడిటీ, టెలికం షేర్లు నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,134 కోట్లు ఈక్విటీ షేర్లు కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.785 షేర్లు అమ్మేశారు. డాలర్ మారకంలో రూపాయి 11 పైసలు బలపడి 82.02 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

అయిదురోజుల్లో రూ.7.90 లక్షల కోట్లు

సెన్సెక్స్ వరుస రికార్డుల ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద జీవితకాల గరిష్టానికి చేరుకుంది. గడిచిన అయిదు రోజుల్లో ఈ సూచీ 2,500 పాయింట్లకు పైగా బలపడటంతో బీఎస్‌ఈ ఎక్స్ఛేంజీలో రూ.7.90 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. మంగళవారం ఒక్కరోజే ఇన్వెస్టర్లు రూ.44,898 కోట్లను ఆర్జించారు. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల రికార్డు స్థాయి రూ.2,98.57 లక్షల కోట్లకు చేరింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఫ్రోజెన్ మాంసం ఎగుమతిదారు హెచ్‌ఎంఏ ఆగ్రో ఇండస్ట్రీస్ షేరు లిస్టింగ్ నిరాశపరిచింది. ఇష్యూ ధర(రూ.585)తో పోలిస్తే బీఎస్‌ఈలో 5% ప్రీమియంతో రూ.615 వద్ద లిస్టయ్యింది. తొలి సెషన్‌లో 15% ర్యాలీ రూ.670 స్థాయికి చేరింది. ఆఖరికి 0.04% స్వల్ప నష్టంతో రూ.584.75 వద్ద ఫ్లాటుగా ముగిసింది.
- ఐడీఎఫ్‌సీ విలీనానికి బోర్డు ఆమోదం తెలపడంతో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ 4% నష్టపోయి రూ.79 వద్ద స్థిరపడింది. అయితే ఐడీఎఫ్‌సీ షేరు మాత్రం 6 శాతం పెరిగి రూ.116 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి 2% పెరిగి రూ.111 వద్ద స్థిరపడింది.

స్టార్టప్ వ్యవస్థ బలోపేతానికి కృషి

- ప్రభుత్వం ప్రోత్సహిస్తుందే తప్ప నియంత్రించదు
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

గురుగ్రామ్: అంకుర సంస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. స్టార్టప్‌ల వ్యవస్థను ప్రోత్సహించేందుకే తప్ప నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రయత్నించబోదని ఆయన స్పష్టం చేశారు. ఆ వ్యవస్థలో భాగమైన వర్గాలే స్వీయ నియంత్రణ పాటించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. స్టార్టప్20 సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు చెప్పారు. అంకుర సంస్థల పురోగతికి అవరోధాలు కల్పించాలనేది ప్రభుత్వాల ఉద్దేశం కాదనే స్పష్టమైన సందేశం స్టార్టప్‌లకు చేరాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. భారత్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని అంకుర సంస్థలను ఆహ్వానించారు. 2030 నాటికి అంకుర సంస్థల వ్యవస్థలోకి జీ20 దేశాలన్నీ కలిసి ఏటా 1 లక్ష కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టేలా చూసేందుకు స్టార్టప్20 గ్రూప్ చేస్తున్న ప్రయత్నాలు సాకారమైతే స్టార్టప్‌లకు మరిన్ని ప్రయోజనాలు చేకూరగలవని గోయల్ చెప్పారు.



పీయూష్ గోయల్

మంచి స్టార్టప్‌లకు నిధుల కొరత లేదు: అమితాబ్ కాంత్

సరైన అంకుర సంస్థలకు పెట్టుబడుల కొరతేమీ లేదని జీ20 షెర్పా అమితాబ్ కాంత్ స్పష్టం చేశారు. పటిష్టమైన వ్యాపార విధానాలున్న మంచి స్టార్టప్‌లకు నిధుల లభ్యత బాగానే ఉందని ఆయన చెప్పారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కార మార్గాలను కనుగొనేందుకు స్టార్టప్ వ్యవస్థ చురుగ్గా పని చేస్తోందని స్టార్టప్20 శిఖర్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. భారత్‌లో 1,00,000 పైచిలుకు స్టార్టప్‌లు, 108 యూనికార్న్‌లు (బిలియన్ డాలర్లకు పైగా విలువ చేసే అంకురాలు) ఉన్నాయని అమితాబ్ కాంత్ తెలిపారు.

భవిత

జాబ్ పాయింట్

ఏపీఎస్ఎఫ్‌సీ, విజయవాడలో 20 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్(ఏపీఎస్ఎఫ్‌సీ).. ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 20
- **అర్హత:** సంబంధిత విభాగంలో సీఏ/సీఎంఏ లేదా బీఈ/బీటెక్, పీజీడీఎం, డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**31.07.2023.
- **వెబ్‌సైట్:** esfc.ap.gov.in

ఏపీ హైకోర్టు, అమరావతిలో 26 లా క్లర్క్ పోస్టులు

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన లా క్లర్క్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 26
- **అర్హత:**న్యాయశాస్త్రంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
- **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
- **పే స్కేల్:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్(రిక్రూట్‌మెంట్),హైకోర్టు ఆఫ్ ఏపీ,అమరావతి,నేలపాడు, గుంటూరు జిల్లా చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 22.07.2023.
- **వెబ్‌సైట్:** hc.ap.nic.in

పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్, న్యూఢిల్లీలో 183 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్.. స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 183
- **పోస్టుల వివరాలు:** ఐటీ ఆఫీసర్, లా మేనేజర్, సీఏ, సెక్యూరిటీ ఆఫీసర్, మార్కెటింగ్ రిలేషన్‌షిప్ మేనేజర్, ఫారెక్స్ డీలర్, ట్రెజరీ డీలర్, ఎకనమిస్ట్ ఆఫీసర్, టెక్నికల్ ఆఫీసర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ/ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ /బీటెక్/బీఈ/సీఏ/ఎంసీఏ/పీజీ డిగ్రీ/ఎంబీఏ/పీజీడీబీఎం/పీజీడీబీఏ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 25 నుంచి 35 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.36,000 నుంచి రూ.78,230 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:**రాతపరీక్ష, షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**12.07.2023.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
- **వెబ్‌సైట్:** https://punjabandsindbank.co.in

ఎన్‌హెచ్‌ఎం, తూర్పు గోదావరి జిల్లాలో 61 ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ యూనిట్ నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 61
- **పోస్టుల వివరాలు:**గైనకాలజిస్ట్,పీడియాట్రిషన్స్, సైకియాట్రిస్ట్, ఫిజిషియన్, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, డెంటల్ టెక్నీషియన్, హాస్పిటల్ అటెండెంట్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి/ఇంటర్/డిప్లొమా/బ్యాచిలర్స్ డిగ్రీ/డీఎంఎల్‌టీ/ఎంబీబీఎస్/పీజీ డిగ్రీ/ఎంఫిల్ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** రోస్టర్ పాయింట్లు/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఇంటర్వ్యూ వేదిక:** డీఎంహెచ్‌వో, తూర్పు గోదావరి, కాకినాడ.
- **ఇంటర్వ్యూ తేది:** 07.07.2023.
- **వెబ్‌సైట్:** eastgodavari.ap.gov.in

ఇస్రో తిరువనంతపురంలో 66 సైంటిస్ట్ పోస్టులు

తిరువనంతపురంలో ఇస్రో ఆధ్వర్యంలో ఉన్న విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ).. సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 66 » **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్/ఇంజనీర్(ఎస్‌డీ, ఎస్‌సీ).

అర్హతలు-వేతనం

- **సైంటిస్ట్/ఇంజనీర్(ఎస్‌డీ):** సంబంధిత స్పెషలైజేషన్‌లో పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.**వేతనం:** నెలకు రూ.67,700నుంచి రూ.2,08,700 చెల్లిస్తారు.
- **సైంటిస్ట్/ఇంజనీర్(ఎస్‌సీ):** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ /బీటెక్ /ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి. **వేతనం:** నెలకు రూ.56,100 నుంచి రూ.1,77,500 చెల్లిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.07.2023.
- **వెబ్‌సైట్:** www.vssc.gov.in

కాలేజ్, బ్రాంచ్.. ఏది ముఖ్యం!

- మొదలైన ఇంజనీరింగ్ ప్రవేశాల సందడి
- జోసా, టీఎస్ ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం
- ఏపీలోనూ మరికొద్ది రోజుల్లో కౌన్సెలింగ్
- కోర్సు ఎంపికలో ఆసక్తి కీలకం అంటున్న నిపుణులు

బీటెక్.. దేశ వ్యాప్తంగా లక్షల మంది విద్యార్థుల స్వప్నం! ఇంజనీరింగ్‌లో చేరేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయి ఎంట్రన్స్‌ల్లో ర్యాంకు కోసం విద్యార్థులు ఎంతో శ్రమిస్తారు. అలా సాధించిన ర్యాంకుతో.. తమకు నచ్చిన బ్రాంచ్‌లో.. మెచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లో చేరాలని కోరుకుంటారు! కాని పదుల సంఖ్యలో బ్రాంచ్‌లు.. వందల సంఖ్యలో కాలేజ్‌లు!! దీంతో బ్రాంచ్‌కు ప్రాధాన్యమివ్వాలా? లేదా.. ఇన్‌స్టిట్యూట్ ముఖ్యమా అనే సందిగ్ధత ఎదురవుతోంది. ఇటీవల జోసా, టీఎస్ ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. ఏపీలోనూ మరికొద్ది రోజుల్లో కౌన్సెలింగ్ మొదలు కానుంది. ఈ నేపథ్యంలో.. బీటెక్‌లో బ్రాంచ్, కాలేజ్ ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..



ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు.. బ్రాంచ్ ఎంపికలో ఆసక్తికి ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం క్రేజ్ కోణంలోనే బ్రాంచ్‌లను ఎంపిక చేసుకోవడం సరికాదంటున్నారు. ఆసక్తి లేని బ్రాంచ్‌లో చేరితే.. భవిష్యత్‌లో అకడమిక్‌గా రాణించలేకపోవచ్చు. ఇది భవిష్యత్తు గమ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ఆస్కారముంది. కాబట్టి ఆయా బ్రాంచ్‌ల సిలబస్, కరిక్యులం స్వరూపాన్ని పరిశీలించి.. తమ సహజ ఆసక్తికి అనుగుణంగా ఉండే విభాగాన్ని ఎంపిక చేసుకోవడం మేలు.

ఇన్‌స్టిట్యూట్ ఎంపిక

విద్యార్థులు బ్రాంచ్‌తోపాటు ఇన్‌స్టిట్యూట్ ఎంపిక కూడా కీలకమని గుర్తించాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇంజనీరింగ్ సీట్లను పరిగణనలోకి తీసుకుంటే.. దాదాపు అందరికీ సీట్లు లభిస్తాయి. అందుకే టాప్ ఇన్‌స్టిట్యూట్‌లో సీటు కోసం విద్యార్థులు ఉత్తమ ర్యాంకు సాధించాలని ప్రయత్నిస్తుంటారు. కాలేజీ ఎంపికలో ఆయా ఇన్‌స్టిట్యూట్‌లో నిబంధనలకు అనుగుణంగా ప్రమాణాలు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కళాశాలలో ఫ్యాకల్టీ నుంచి ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ వరకూ.. వివిధ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు.

ఎన్‌బీఏ గుర్తింపు

విద్యార్థులు తాము చేరాలనుకుంటున్న బ్రాంచ్‌కు, ఇన్‌స్టిట్యూట్‌కు ఎన్‌బీఏ గుర్తింపు ఉందా? లేదా? అనే విషయం కూడా పరిగణించాలి. కారణం.. ఎన్‌బీఏ గుర్తింపు బ్రాంచ్‌ల వారీగా ఉంటుంది. కొన్ని కళాశాలలు మొత్తం బ్రాంచ్‌లలో ఒకట్రెండు బ్రాంచ్‌లకే ఎన్‌బీఏ గుర్తింపు ఉన్నా.. ఎన్‌బీఏ అక్రెడిటెడ్ అని వెబ్‌సైట్లలో ఆకర్షణీయంగా ప్రకటనలిస్తున్నాయి. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

విద్యార్థులు కాలేజ్ ఎంపికలో సదరు ఇన్‌స్టిట్యూట్‌కు ఇండస్ట్రీ వర్గాల్లో ఉన్న గుర్తింపు గురించి తెలుసుకోవాలి. దీంతోపాటు గతేడాది ఆయా కాలేజ్‌లో సీట్ల భర్తీ పరంగా ఓపెనింగ్–క్లోజింగ్ ర్యాంకుల సమాచారం సేకరించాలి. ఉదాహరణకు యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలు, అదే విధంగా కొన్ని ప్రముఖ ప్రైవేటు కళాశాలల్లో ఈసీఈ, సీఎస్ఈ, ట్రిపుల్‌ఈ వంటి బ్రాంచ్‌లలో లాస్ట్ ర్యాంకు 1500 నుంచి 2000లోపే ఉంటోంది. అంటే.. ఆ కళాశాలలు తమ నాణ్యత ప్రమాణాల ఆధారంగా టాపర్స్ ఆదరణ పొందుతున్నాయని చెప్పొచ్చు.

బోధన విధానాలు

విద్యార్థులు కాలేజ్ ఎంపికలో బోధన పద్ధతుల పైనా దృష్టి పెట్టాలి. టీచింగ్‌లో అనుసరిస్తున్న విధానం, ప్రాక్టికల్స్‌కు ఇస్తున్న ప్రాధాన్యం, అందులో విద్యార్థులను మమేకం చేస్తున్న తీరుతెన్నులను పరిశీలన చేయాలి. ఇప్పటికే ఆ కాలేజీలో చదువుతున్న విద్యార్థులను అడిగి ఈ వివరాలు తెలుసుకోవచ్చు. కొన్ని కళాశాలలు ఏఐసీటీఈ నిబంధనల మేరకు తమ కళాశాలలో పీహెచ్‌డీ ఫ్యాకల్టీ ఉన్నారని ప్రకటనలిస్తుంటాయి. వాస్తవానికి సదరు పీహెచ్‌డీ ఫ్యాకల్టీ క్లాస్ రూంలో స్టూడెంట్‌తో ఇంటరాక్షన్ ఎంత మేరకు ఉంటుందనేది ముఖ్యం.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్

కళాశాలలో గత నాలుగేళ్ల ప్లేస్‌మెంట్ రికార్డ్స్ ఎలా ఉన్నాయి. ఎలాంటి కంపెనీలు వస్తున్నాయి. వచ్చిన కంపెనీలు ఎలాంటి ఉద్యోగాలు ఆఫర్ చేస్తున్నాయి తదితర వివరాలను పరిశీలించాలి. ఇన్ఫోసిస్, ఐబీఎం వంటి ప్రతిష్టాత్మక కంపెనీలు క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాయని పలు కాలేజీలు విద్యార్థులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కాని ఇలా వచ్చిన సంస్థలు కోర్ ప్రొఫైల్స్‌లో ఎంతమందికి అవకాశాలు ఇస్తున్నాయో అడిగి తెలుసుకోవాలి.

ఈ బ్రాంచ్‌లకే క్రేజ్

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో టాప్ ర్యాంకర్‌లు మొదలు ఎంసెట్ టాపర్ల వరకూ.. ప్రతి ఒక్కరు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ)ను తమ తొలి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నారు. గత మూడు, నాలుగేళ్లుగా అడ్వాన్స్‌డ్‌లో ఫస్ట్ ర్యాంక్ పొందిన అభ్యర్థులు సీఎస్ఈ బ్రాంచ్‌లోనే చేరారు. జనరల్ కేటగిరీలో 1500లోపు ర్యాంకుతోనే అన్ని ఐఐటీల్లో ఈ బ్రాంచ్‌లో సీట్లు భర్తీ అవడమే సీఎస్ఈ పట్ల విద్యార్థుల క్రేజ్‌కు నిదర్శనంగా చెప్పొచ్చు. రాష్ట్రాల స్థాయిలో నిర్వహించే ఎంసెట్ ర్యాంకర్లది సైతం ఇదే ఆలోచన. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలు, టాప్–10, 20 ఇన్‌స్టిట్యూట్‌లలో జనరల్ కేటగిరీలో 5వేలలోపు ర్యాంకుతోనే ఈ బ్రాంచ్ సీట్లు భర్తీ అవుతున్నాయి. ప్రస్తుత జాబ్ మార్కెట్‌లో సీఎస్ఈకి ఉజ్వల అవకాశాలు అందుబాటులో ఉండటమే ఇందుకు కారణంగా చెప్పొచ్చు.

ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్

బీటెక్‌లో విద్యార్థులు ఆసక్తి చూపుతున్న మరో బ్రాంచ్.. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ (ఈసీఈ). ఐఐటీల్లో జనరల్ కేటగిరీలో గత రెండేళ్లుగా మూడున్నర వేలలోపు ర్యాంకుతో ఈ బ్రాంచ్‌లో సీట్లు భర్తీ అవుతున్నాయి. ఇదే ట్రెండ్ ఇతర ఇన్‌స్టిట్యూట్‌లు, కౌన్సెలింగ్‌లలోనూ ప్రతిబింబిస్తోంది. జాబ్ మార్కెట్ పరిస్థితులు, ఉన్నత విద్య కోణంలో లభిస్తున్న అవకాశాలే ఇందుకు కారణం. ఇంటర్నెట్, బ్రాడ్ బ్యాండ్, స్మార్ట్ టెక్నాలజీస్, 5జీ టెక్నాలజీ స్థాయికి టెలికం రంగం విస్తరిస్తోంది. దీంతోపాటు డిజిటల్ ఇండియా, డిజిటలైజేషన్, డిజిటల్ లిటరసీ మిషన్ వంటి వాటితో ఈ రంగంలో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయని అంచనా.

సివిల్ ఇంజనీరింగ్

మౌలిక రంగం, నిర్మాణ రంగంలో కట్టడాలు, డిజైన్లకు సంబంధించి మూల భావనలు, నైపుణ్యాలు అందించే కోర్సు ఇది. ఇటీవల కాలంలో ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా జీపీఎస్, అర్బన్ డెవలప్‌మెంట్ వంటి పలు స్పెషలైజేషన్లకు రూపకల్పన జరిగినప్పటికీ.. వీటికి ఆధారం సివిల్ ఇంజనీరింగ్‌లోని మౌలిక సూత్రాలే. రియల్టీ రంగంలో కార్పొరేట్ సంస్థలు అడుగుపెట్టడం కూడా ఈ బ్రాంచ్ భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తోంది. ఈ బ్రాంచ్‌లో రాణించాలంటే.. డిజైన్, ప్లానింగ్, కన్‌స్ట్రక్షన్, క్వాలిటీ కంట్రోల్, నిర్వహణ పరమైన అంశాలపై పట్టు సాధించడం ముఖ్యం.

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

దశాబ్దాలుగా 'వెలుగు'లీనుతున్న మరో బ్రాంచ్.. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్. ఈఈఈగా సుపరిచితమైన ఈ బ్రాంచ్ కూడా విద్యార్థుల ప్రాథమ్యతల క్రమంలో రెండు, మూడు స్థానాల్లో నిలుస్తోంది. ఈ బ్రాంచ్ పూర్తి చేసిన విద్యార్థులకు భవిష్యత్తు పరంగా ఆశాజనక పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మెకానికల్ ఇంజనీరింగ్

బీటెక్‌లో మరో ఎవర్ గ్రీన్ బ్రాంచ్.. మెకానికల్ ఇంజనీరింగ్. ఇది బెస్ట్–5 బ్రాంచ్‌ల జాబితాలో నిలుస్తోంది. ఆటో రిక్షా నుంచి బోయింగ్ విమానాల తయారీ వరకూ.. ప్రతి విభాగంలోనూ మెకానికల్ ఇంజనీరింగ్ నైపుణ్యాల అవసరం ఎంతో ఉంది. ఫలితంగా ఈ బ్రాంచ్ నిత్య నూతనంగా వెలుగులీనుతోంది. ఐఐటీల్లో జనరల్ కేటగిరీలో సగటున నాలుగు వేల లోపు ర్యాంకుతో ఈ బ్రాంచ్ సీట్లు భర్తీ అవుతున్నాయి. ఇటీవల కాలంలో ఈ విభాగంలో ఆధునికత దిశగా అడుగులు పడుతున్నాయి. రోబోటిక్స్, అన్–మ్యాన్డ్ వెహికిల్స్ వంటి వాటిని వీటికి ప్రత్యక్ష నిదర్శనంగా పేర్కొనొచ్చు. అకడమిక్ స్థాయిలోనే రోబోటిక్స్, క్యాడ్, క్యామ్, 3–డి డిజైన్ టెక్నాలజీస్ వంటి ఆధునిక సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. అవకాశాలకు ఢోకా ఉండదు.

ఇండస్ట్రీ 4. 0 బ్రాంచ్‌లు

ఇటీవల ఏఐసీటీఈ మార్గదర్శకాల ప్రకారం–దేశంలోని ఐఐటీలు సహా అనేక ఇన్‌స్టిట్యూట్‌లు అందుబాటులోకి తెస్తున్న కొత్త బ్రాంచ్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్. ఈ బ్రాంచ్ ద్వారా ఇండస్ట్రీ 4.0గా స్కిల్స్‌గా పేర్కొంటున్న ఏఐ, ఎంఎల్‌తోపాటు రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, 5జీ టెక్నాలజీస్‌పై అవగాహన లభిస్తుంది.

మరికొన్ని బ్రాంచ్‌లు

కెమికల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్/ మెరైన్‌ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ తదితర బ్రాంచ్‌ల్లోనూ విద్యార్థులు చేరుతున్నారు.

నేటి నుంచి ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

- నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఏర్పాట్లు పూర్తి

నూజివీడు: రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 2023 విద్యాసంవత్సరంలో నిర్వహిస్తున్న ప్రవేశాల్లో భాగంగా బుధవారం నుంచి తొమ్మిదో తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్టు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు మంగళవారం తెలిపారు. నాలుగు ట్రిపుల్ ఐటీలకు దరఖాస్తు చేసిన ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. బుధ, గురువారాల్లో మాజీ సైనికోద్యోగుల పిల్లల కేటగిరీ అభ్యర్థులకు, బుధవారం నుంచి తొమ్మిదో తేదీ వరకు క్రీడా కోటా అభ్యర్థులకు, ఈ నెల 6వ తేదీన దివ్యాంగ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అభ్యర్థులకు, బుధవారం నుంచి 7వ తేదీ వరకు ఎన్‌సీసీ అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 13న ట్రిపుల్ ఐటీ సీట్లకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్టు వెల్లడించారు.



నెల్లూరు జాతి ఆవు @ రూ. 35 కోట్లు!

బ్రెజిల్‌లో జరిగిన వేలంలో ప్రపంచ రికార్డు ధర

ఎక్కడైనా మేలు జాతి ఆవు ధర ఎంత ఉంటుంది? మహా అయితే రూ.లక్షల్లో ఉంటుందంటారా.. అయితే మీరు తప్పులో కాలేసినట్లే.. ఎందుకంటే బ్రెజిల్‌లో ఇటీవల జరిగిన వేలంలో నెల్లూరు జాతికి (ఏపీలోని నెల్లూరు జిల్లా నుంచి దశాబ్దాల కిందట కొన్ని ఆవులను బ్రెజిల్ తీసుకెళ్లి జన్యు లక్షణాలను మరింత అభివృద్ధి చేసుకున్న ఆవులు) చెందిన తెల్ల ఆవు కనీవినీ ఎరుగని అత్యధిక ధర పలికింది. తద్వారా ప్రపంచంలోకెల్లా అత్యంత ఖరీదైన ఆవుగా నిలిచింది. వియాటినా–19 ఎఫ్4 మారా ఇమ్‌విస్ అనే నాలుగున్నరేళ్ల ఆవు మూడో వంతు యాజమాన్య హక్కు ఏకంగా రూ.11.82 కోట్లకు అమ్ముడుపోయింది!! గతేడాది ఈ ఆవు సగం యాజమాన్య హక్కు రూ.6.5 కోట్లు పలకడం అప్పట్లోనే రికార్డు సృష్టించగా ఇప్పుడు ఆ రికార్డు బద్దలైంది. మొత్తం మీద ఈ ఆవు విలువ రూ.35.30 కోట్లు పలికింది. అత్యంత నాణ్యమైన జన్యు లక్షణాలు గల బ్రెజిల్‌లోని నెల్లూరు జాతి ఆవును రికార్డు ధరకు సొంతం చేసుకొనేందుకు డెయిరీ వ్యాపారులు పోటీపడటం దీని అసలుసిసలు విలువను చాటిచెబుతోంది.

నెల్లూరు జాతి ఆవుల ప్రత్యేకతలు ఇవీ...

- ఈ ఆవులు అధిక ఉష్ణోగ్రతలను తట్టుకొనేలా చిక్కటి తెలుపు రంగులో ఉంటాయి.
- దళసరి చర్మంతో ఉండటం వల్ల రక్తం పీల్చే కీటకాలు వాటిని దరిచేరవు.
- ఓక్లహామా స్టేట్ యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం వాటి స్వేద గ్రంథులు యూరోపియన్ జాతి ఆవులతో పోలిస్తే రెండు రెట్లు పెద్దగా ఉండటంతోపాటు గ్రంథుల సంఖ్య సైతం 30 శాతం ఎక్కువగా ఉంటుంది.
- రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండటంతో ఇన్ఫెక్షన్లను సమర్థంగా తట్టుకోగలవు.
- ముఖ్యంగా ఇలాంటి జాతి దూడలను ఉత్పత్తి చేయడంలో వీటిని ఉపయోగించుకుంటారు.
- ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఈనగలగడం, సరైన యాజమాన్య పద్ధతులు పాటించనప్పటికీ దూడలు సులువుగా పెరగగలగడం మరో ప్రత్యేకత.

బ్రెజిల్‌లోని ముఖ్యమైన ఆవు జాతుల్లో నెల్లూరు జాతి ఆవులు కూడా ఒకటి. వీటిని ఎక్కువగా మాంసం కోసం పెంచుతారు. వీటి మాంసంలో కొవ్వు తక్కువగా ఉండటం వల్ల చాలా దేశాల్లో ఈ ఆవుల మాంసానికి విపరీతమైన డిమాండ్ ఉంది. ప్రస్తుతం బ్రెజిల్‌లో 16.70 కోట్ల నెల్లూరు జాతి ఆవులు ఉన్నాయి. బ్రెజిల్‌లో ఉన్న మొత్తం ఆవుల సంఖ్యలో ఇవి 80 శాతం కావడం విశేషం. ఈ జాతికి చెందిన శ్రేష్ఠమైన ఎద్దుల వీర్యం సైతం అర మిల్లీలీటర్‌కు రూ.4 లక్షలు పలుకుతోంది.

– సాక్షి సెంట్రల్ డెస్క్

హానరరీ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏఎస్‌యూ: హానరరీ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ తెలిపారు. ఆచార్య నాగార్జున వర్సిటీలోని సీఎస్ఈ, ఈసీఈ, ట్రిపుల్ఈ, మెకానికల్, సివిల్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ (థియేటర్, టీవీ అండ్ సినిమా), డాన్స్ (ఫోక్, క్లాసికల్, వెస్ట్రన్), మ్యూజిక్(క్లాసికల్ అండ్ వెస్ట్రన్), ఎకనామిక్స్, మాథమాటిక్స్, స్టాటిస్టిక్స్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎంటెక్, ఇరిగేషన్ అండ్ వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్, ఫారెస్ట్రీ, ఎంబీఏ ఇన్ మీడియా మేనేజ్‌మెంట్, ఎమ్మెస్సీ డేటా సైన్స్, ఎడ్యుకేషన్, లీగల్ స్టడీస్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బోటనీ, ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ కెమిస్ట్రీ, ఎంఏ అప్లయిడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కోర్సులలో హానరరీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

బీఎస్సీ నర్సింగ్‌తో జర్మనీలో కొలువులు

- టాక్ట్ ఇంటర్నేషనల్, ఏపీఎన్ఆర్‌టీఎస్‌తో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం

నరసరావుపేట ఈస్ట్: బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జర్మనీలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి సంజీవరావు తెలిపారు. ఇందులో భాగంగా టాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ, ఏపీఎన్ఆర్‌టీఎస్ (ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ)తో కలిసి బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు జర్మనీలో ఉద్యోగాలు పొందేందుకు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. అభ్యర్థి నర్సింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, రెండేళ్ల పని అనుభవం ఉండాలని, జర్మనీలో పనిచేసేందుకు సిద్ధపడాలని తెలిపారు. విజయవాడలోని కేఎల్ వర్సిటీలో బీ1 స్థాయి జర్మన్ భాష శిక్షణ కోసం అందించే ఉచిత శిక్షణకు హాజరు కావాలన్నారు. 2 నెలల పాటు రోజుకు 6 గంటలు చొప్పున వారానికి 48 గంటలు శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో హాస్టల్‌లో ఉండే అభ్యర్థులు హాస్టల్ ఫీజులను వారే చెల్లించుకోవాలని చెప్పారు. బీ1 స్థాయిలో ఉత్తీర్ణత సాధించిన తరువాత ఆఫర్ లెటర్ అందజేస్తారన్నారు. అభ్యర్థి తన బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్, అనుభవ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఆఫర్ లెటర్ పొందిన అభ్యర్థులకు విమాన చార్జీలు ఉచితమని అలాగే మొదటి 6 నెలలు ఆహారం, వసతి కూడా ఉచితంగా అందిస్తామని వివరించారు. ఈ సమయంలో నెలకు 1,000 యూరోలు (రూ.89వేలు) జీతమివ్వనున్నట్లు చెప్పారు. జర్మనీలో 6 నెలలు బీ2 సర్టిఫికేషన్ శిక్షణ ఇస్తారని, బీ2 స్థాయిలో ఉత్తీర్ణత సాధించిన తరువాత నెలకు 2,500 యూరోలు జీతంగా చెల్లిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఏపీఎస్ఎస్‌డీసీ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, నైపుణ్యాభివృద్ధి సంస్థ హెల్ప్‌లైన్ నంబర్ 9988853335 సంప్రదించాలని సూచించారు.

Skill AP
APSSDC

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ లోగో

జ్ఞానాన్నే కాదు..భారతీయతనూ తీసుకువెళ్లండి

- విదేశీ విద్యార్థులతో ఐసీసీఆర్ డైరెక్టర్ జనరల్ కుమార్ తుహిన్
- ఏయూలో ఘనంగా ఈ–3 వేడుక

ఏయూ క్యాంపస్: భారత్‌లో చదువుకున్న విదేశీ విద్యార్థుల్లో భారతీయత అంతర్భాగమైందని ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్) డైరెక్టర్ జనరల్ కుమార్ తుహిన్ అన్నారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన విదేశీ విద్యార్థుల వీడ్కోల వేడుకలు 'ఎగ్జిట్–ఎంగేజ్‌మెంట్–ఈవినింగ్ (ఈ–3)'లో ఆయన మాట్లాడారు. భారత్‌లో చదువుకున్న విదేశీ విద్యార్థులు తమ వెంట జ్ఞానంతో పాటు భారతీయతను తీసుకువెళ్లాలని సూచించారు. ప్రపంచ దేశాలతో భారత్‌కు ఉన్న సత్సంబంధాల్లో భాగంగా ఐసీసీఆర్ స్కాలర్‌షిప్‌లను అందిస్తూ..విదేశీ విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేస్తోందని చెప్పారు. ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ వర్సిటీలో విదేశీ విద్యార్థుల సంఖ్య 1,000 దాటిందన్నారు. 54 దేశాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారని చెప్పారు. విద్యలో సమగ్ర మార్పులు తీసుకురావడానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ధనుంజయరావు, ఐసీసీఆర్ జోనల్ డైరెక్టర్ సునీల్ కుమార్ సింగ్, ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్, అసోసియేట్ డీన్ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. నృత్య ఆచార్యులు బాలకొండలరావు నేతృత్వంలో నృత్య ప్రదర్శనలు, విదేశీ విద్యార్థుల నృత్యాలు ఆహూతులను అలరించాయి.



మాట్లాడుతున్న కుమార్ తుహిన్

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943